epaper.vaartha.com

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

18-12-2025
గురువారం
సంపుటి: 31
సంచిక: 317
పేజీలు: 10+4
వెల: 6.50

హైదరాబాద్

: fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

WWW.VAARTHA.COM









ప్రధాని మోడీకి ఇథియోపియా అత్యున్నత పురస్కారం అందజేస్తున్న దృశ్యం -5లో

# భారత్, ఒమన్‌ల మధ్య 7 దశాబ్దాల బంధం

2

గల్ఫ్ దేశంలో ప్రధానికి ప్రవాసభారతీయుల ఘనస్వాగతం

ఇంధన భద్రత, టెక్నాలజీ, వ్యవసాయ రంగాలపై ఒమన్ సుల్తాన్‌తో ప్రధాని మోడీ చర్చలు



ఒమన్‌లోని మస్కట్ ఎయిర్‌పోర్టులో ప్రధాని మోడీకి స్వాగతం పలుకుతున్న దృశ్యం

## ఎమ్మెల్యేల 'అనర్హత'
# పిటిషన్లు కొట్టివేత



బుధవారం అసెంబ్లీ హాలులో ఎమ్మెల్యేలపై విచారణ జరుపుతున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

**సంచలన తీర్పు ఇచ్చిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్**

**బండ్ల కృష్ణమోహన్, తెల్లం వెంకట్రావు, అరికెపూడి గాంధీ, ప్రకాశ్ గౌడ్, మహిపాల్ రెడ్డి సాంకేతికంగా ఇంకా బిఆర్‌ఎస్‌లోనే**

**వారు పార్టీ మారినట్లు ఆధారాల్లేవు**

**మరో ముగ్గురు ఎమ్మెల్యేలపై నేడు తీర్పు**

**శ్రీహరి, దానంపై నిర్ణయం త్వరలోనే**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబర్ 17:** బిఆర్‌ఎస్ పార్టీ గుర్తుతో గెలిచి పార్టీ ఫిరాయించారంటూ 10 మంది ఎమ్మెల్యేలపై బీఆర్‌ఎస్ దాఖలు చేసిన అనర్హత పిటిషన్లపై అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ బుధవారం సంచలన తీర్పు ఇచ్చారు. ఐదుగురు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలన్న పిటిషన్లను ఆయన తోసిపుచ్చారు. ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, తెల్లం వెంకట్రావు, అరికెపూడి గాంధీ, ప్రకాశ్ గౌడ్, మహిపాల్ రెడ్డిలపై అనర్హత వేటు వేయడానికి తగిన ఆధారాలు >>2

## మూడో విడత కూడా
# కాంగ్రెస్‌దే..



**2237కు పైగా సర్పంచ్ స్థానాల్లో విజయం**

**బిఆర్‌ఎస్ మద్దతుతో 1153 మంది గెలుపు**

**బిజెపికి లభించినవి 242 మాత్రమే**

**ఎన్నికల్లో పలు చోట్ల కాంగ్రెస్, బిఆర్‌ఎస్ వర్గాల మధ్య ఘర్షణలు**


**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,డిసెంబర్17:** తెలంగాణ పంచాయతీ ఎన్నికల మూడో దశలో కూడా కాంగ్రెసన హవా వీచింది. 2237కు పైగా సర్పంచ్ స్థానాల్లో కాంగ్రెస్ మద్దతు ధరాలు గెలిచారు. రెండో స్థానంలో బిఆర్‌ఎస్ నిలిచింది. 1153కు పైగా సర్పంచ్ స్థానాల్లో బిఆర్‌ఎస్ మద్దతు పొందిన అభ్యర్థులు గెలిచారు. బిజెపి మూడో స్థానంలో నిలిచింది. 242కుపైగా సర్పంచ్ స్థానాల్లో బిజెపి మద్దతు పొందిన అభ్యర్థులు గెలిచారు. ఇతరులు,ఇండిపెండెంట్ అభ్యర్థులు 489 సర్పంచ్ స్థానాల్లో గెలిచారు. మూడో దశ పోలింగ్ నేపథ్యంలో పలుచోట్ల కాంగ్రెస్,బీఆర్‌ఎస్ మధ్య ఘర్షణలు జరిగాయి.పంచాయతీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా వికారాబాద్ జిల్లాలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. పరిగి మండలం మాదారంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఓటింగ్ సరళిని పరిశీలించేందుకు బీఆర్‌ఎస్ సర్పంచ్ అభ్యర్థి రాములు పోలింగ్ కేంద్రానికి వెళ్లారు. అదే టైంలో అక్కడ ఉన్న కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు, రాములుకు మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో కాంగ్రెస్ మద్దతుదారులు ఆయనపై దాడికి పాల్పడ్డారు. గాయపడిన రాములును పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. ఆసుపత్రిలో రాములును మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి పరామర్శించారు. అనంతరం మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ ఓటమి భయంతోనే కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లో దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఈ ఘటనపై ఉన్నత అధికారులు నిష్పాక్షికంగా విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా టేకులపల్లి మండలం బద్దుతండాలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ వర్గీయుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఓ వ్యక్తి తొలుత గుర్తింపు కార్డ్ లేకుండా పోలింగ్ కేంద్రానికి వెళ్లాడు. ఓటు వేసేందుకు అధికారులు నిరాకరించడంతో వెనుదిరిగాడు. ఆ తరువాత గుర్తింపు కార్డుతో మరోసారి అక్కడికి వచ్చాడు.ఈ క్రమంలో గమనించిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి భూక్యా గంగారావు సదరు వ్యక్తి దొంగ ఓటు వేస్తున్నాడని ఆరోపించాడు. ఆగ్రహానికి గురై అతడిపై దాడికి దిగారు. దీంతో >>2

## మూడో డిస్కమ్‌కు
# ప్రభుత్వం ఆమోదం

**పరిధిలో 29 లక్షల సర్వీసులు**



**హైదరాబాద్, డిసెంబరు 17, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మూడో విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)కు రాష్ట్ర సర్కార్ ఆమోదం తెలిపింది. ఈ మేరకు విద్యుత్ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్ దీనికి సంబంధించి బుధవారం మార్గదర్శకాలు, బాధ్యతలను విడుదల చేశారు. తెలంగాణ కోసం మూడవ డిస్కామ్, విద్యుత్ చట్టం 2003 లోని సెక్షన్14నిబంధనల >>2



బుధవారం హైదరాబాద్‌లోని హకీంపేట ఎయిర్‌పోర్టులో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు స్వాగతం పలుకుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

# హైదరాబాద్‌లో రాష్ట్రపతి

**శీతాకాల విడిది కోసం ద్రౌపది ముర్ము రాక**

**వివిధ కార్యక్రమాలలో పాల్గొననున్న రాష్ట్రపతి**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,డిసెంబర్17:** రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శీతాకాలం విడిది కోసం బుధవారం మధ్యాహ్నం హైదరాబాద్ చేరుకున్నారు. ఆమె ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌లోని హకీంపేట ఎయిర్‌ఫోర్స్ శిక్షణ కేంద్రానికి చేరుకున్నారు. రాష్ట్రపతికి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, డిజిపి శివధర్‌రెడ్డి తదితరులు స్వాగతం పలికారు. ఆమె డిసెంబర్ 22 వరకు హైదరాబాద్‌లో ఉంటారు. >>2

# పల్లెలూ కాంగ్రెస్ 'చేతి'లోనే



**రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధికి నిదర్శనం**

**మూడు విడతలలోనూ కాంగ్రెస్ హవాయే**

**ప్రజల ఆశయాలకు అద్దంపట్టిన తీర్పు: పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్**

**హైదరాబాద్, డిసెంబరు 17,ప్రభాతవార్త:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైనాక జరుగుతున్న అభివృద్ధి సంక్షేమంచూసి ఉప ఎన్నికలలో కాంగ్రెస్‌కు మొగ్గుచూపుతుంటే పల్లెలు కూడా అదే దారిలో నడుస్తూ కాంగ్రెస్‌కు మరోమారు పట్టం కట్టాయనిటిపిసిసి అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ ఒక ప్రకటనలో హర్షం చేస్తూ తెలిపారు. పంచాయతీ ఎన్నికలు-2025 మూడో విడత ఫలితాల్లోనూ కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగిందని మహేష్ కుమార్ పేర్కొన్నారు.ప్రజలు ఇచ్చిన ఈ తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనంగా నిలిచిందని అభిప్రాయపడ్డారు. మూడో విడత సర్పంచ్ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ మద్దతుదారులే ఘన విజయం సాధించడం గ్రామీణ ఓటర్లు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై వ్యక్తం చేసిన విశ్వాసానికి స్పష్టమైన ప్రతిబింబమని ఆయన పేర్కొన్నారు. పంచాయతీ ఎన్నికల మూడో విడత ఫలితాలు ప్రతిపక్షాలకు చెంపపెట్టులా మారాయని, తెలంగాణ గ్రామీణ రాజకీయాల్లో స్పష్టమైన మార్పుకు ఇవి సంకేతమని మహేష్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు.పంచాయతీ ఎన్నికలను కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, ఈ విజయం వెనుక సమన్వయంతో కూడిన బలమైన ప్రచార వ్యూహాలే ప్రధాన కారణమని మహేష్ గౌడ్ స్పష్టం చేశారు.మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు, స్థానిక నాయకులను ఒకే వేదికపై సమన్వయం చేస్తూ గ్రామ స్థాయి వరకు విస్తరించిన ప్రచారం పార్టీకి అనుకూలంగా మారిందని తెలిపారు.ప్రజల ఆశయాలకు అద్దం పట్టే విధంగా వచ్చిన ఈ తీర్పు, కాంగ్రెస్ ప్రభుత్వ పాలన పట్ల గ్రామీణ ప్రజల్లో ఏర్పడిన సంతృప్తిని మరోసారి రుజువు చేసిందని టిపిసిసిచీఫ్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గత రెండు సంవత్సరాలుగా అమలవుతున్న ప్రజాపాలన, సంక్షేమ, అభివృద్ధి పథకాలు నేరుగా ప్రజలకు అందుతున్న తీరు ఈ ఎన్నికల ఫలితాల్లో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమన్వయపరిచిన ప్రజాపాలన ప్రభుత్వం ప్రజల్లో బలమైన నమ్మకాన్ని కలిగించిందని చెప్పుకొచ్చారు. గ్రామస్థాయి సమస్యలను గుర్తించి వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ప్రభుత్వం చూపుతున్న చిత్తశుద్ధి కాంగ్రెస్‌కు అనుకూలంగా మారిందని మహేష్ గౌడ్ విశ్లేషించారు. సిఎం రేవంత్ రెడ్డి,మంత్రులు స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ >>2



## 20,21న ఉప రాష్ట్రపతి హైదరాబాద్ పర్యటన

2



## ప్రభాకర్ రావు కస్టడీ
# నేటితో పూర్తి

**'సుప్రీం'కు నివేదిక ఇవ్వనున్న సిట్ బృందం**

**హైదరాబాద్, డిసెంబర్ 17, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మొదటి ముద్దాయిగా వుండి ఆరు రోజులుగా పోలీసు కస్టడీలో వున్న ఎస్ఐబి మాజీబాస్ ప్రభాకర్ రావు భవితవ్యం సుప్రీం కోర్టు నిర్ణయంపై ఆధారపడి వుంది. ప్రభాకర్ రావు సాధారణ విచారణలో ఏమీ చెప్పడం లేదని, కస్టడీకి ఇవ్వాలని పోలీసు శాఖ సుప్రీం కోర్టులో పిటిషన్ వేసి మరీ ఆయనను కస్టడీలోకి తీసుకోవడం తెలిసిందే. గత శుక్రవారం నాడు ప్రభాకర్ రావు సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు సిట్ ఎసిపి వెంకటగిరి >>2

# వడివడిగా కొత్త హైకోర్టు

**రాజేంద్రనగర్‌లో నిర్మాణంలో ఉన్న భవన సముదాయం**

**రూ. 2,583 కోట్లతో హైకోర్టు కట్టడాలు**

**పనులను పరిశీలించిన ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్**



రాజేంద్రనగర్‌లో బుధవారం హైకోర్టు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అధికారులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,డిసెంబర్17:** రాజేంద్రనగర్‌లో నిర్మాణంలో ఉన్న కొత్త హైకోర్టు భవన సముదాయం పనుల పురోగతిని రవాణా, రహదారులు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ బుధవారం పరిశీలించారు. పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆయన అధికారులకు స్పష్టం చేశారు.ఈ సందర్భంగా చీఫ్ ఇంజినీర్లు (బిల్డింగ్స్), ఎలక్ట్రికల్), ఆర్అండ్‌బీ ఫీల్డ్ ఇంజినీర్లు, కాంట్రాక్టర్ సంస్థ డీఈసీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు, కన్సల్టెంట్లు టీమ్ వన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అధికారులు పాల్గొన్నారు. పనుల వేగం, క్రమబద్ధత, నాణ్యతను వికాస్ రాజ్ సమీక్షించి, వివిధ దశల పూర్తి కాలపట్టికలను ఖరారు చేశారు.తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక న్యాయ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుగా చేపట్టిన ఈ కొత్త హైకోర్టు భవన సముదాయానికి రూ.2,583 కోట్ల పరిపాలనా అనుమతి ఉంది. మొత్తం 36.52 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్టు నిర్మాణం సాగుతోంది. ఇందులో సివిల్, ఎలక్ట్రికల్, ఎంఈపీ పనులకు రూ.1,980 కోట్లు, ఫర్నిచర్,ఆపరేటివ్ పరికరాలకు రూ.603 కోట్లు కేటాయించారు. 2024 డిసెంబర్ 7న జారీ చేసిన జీఓ ఆర్టీ నెం.827 ద్వారా పరిపాలనా ఆమోదం లభించింది.పనుల సమీక్షలో భాగంగా, డ్రాయింగ్‌లను ముందుగానే సమర్పించాలని కన్సల్టెంట్లను వికాస్ రాజ్ ఆదేశించారు. తద్వారా కార్మికులు, సామగ్రి, యంత్రాల సమర్థ వినియోగం సాధ్యమవుతుందని ఆయన తెలిపారు. పనుల పూర్తి కార్యక్రమాన్ని చీఫ్ ఇంజినీర్ (బిల్డింగ్స్), కన్సల్టెంట్లు, కాంట్రాక్టర్ కలిసి రూపొందించాలని, దానిపై తరచూ సమీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఒప్పందంలో పేర్కొన్న మైలురాళ్ల ప్రకారం పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. న్యాయ అధికారుల సూచనలకు అనుగుణంగా మార్పు చేసిన నమూనాలను ఆలస్యం లేకుండా సిద్ధం చేసి, అనుమతులు పొందాలని కన్సల్టెంట్లకు ఆదేశించారు. జోన్2కు సంబంధించిన అటవీ అనుమతులు సహా అన్ని క్లియరెన్సులను త్వరితగతిన పూర్తి చేయాలని చీఫ్ ఇంజినీర్ (బిల్డింగ్స్)కు సూచించారు.డిజైన్ >>2



## సిఎం రేవంత్ దావోస్ పర్యటనకు ఎసిబి కోర్టు
# అనుమతి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబర్17:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జనవరి 19 నుంచి 23 వరకు స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరగనున్న ప్రపంచ ఆర్థిక ఫోరం (డబ్లుఈఎఫ్) సదస్సుకు హాజరు కానున్నారు. ఈ విదేశీ పర్యటనకు ఏసీబీ స్పెషల్ కోర్టు అనుమతి ఇచ్చింది. 2015లో జరిగిన ఓటుకు నోటు (క్యాష్ ఫర్ వోట్) కేసులో బెయిల్ షరతుల మేరకు సీఎం రేవంత్‌రెడ్డి పాస్‌పోర్టు కోర్టు కస్టడీలో ఉంది. రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనలకు ప్రతిసారీ కోర్టు అనుమతి తప్పనిసరి. ఈ నేపథ్యంలో రూ.10 వేల పూచికత్తుతో పాస్‌పోర్టు ఇచ్చేందుకు కోర్టు అనుమతించింది. అయితే మార్చి 3లోగా >>2



బుధవారం జెరుసలెంలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో భేటీ అయిన విదేశంగ మంత్రి జైశంకర్

# కాంగ్రెస్ 'చేతి'లోనే

>> తీసుకుంటున్న నిర్ణయాలు గ్రామీణ ఓటర్లలో కాంగ్రెస్‌పై విశ్వాసాన్ని మరింత పెంచాయని తెలిపారు.ప్రజలను నేరుగా కలిసి సమస్యల పరిష్కారానికి కృషి చేసే విధానం పార్టీ బలాన్ని పటిష్టం చేస్తోందని పేర్కొన్నారు. సంక్షేమం, సామాజిక న్యాయం, అభివృద్ధి" అనే నినాదానికి ప్రజలు పట్టం కట్టారని, సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల ఘన విజయం దీనికి స్పష్టమైన ప్రతీక అని మహేష్ గౌడ్ అన్నారు. మైనారిటీలు, దళితులు, గిరిజనులు, మహిళలు, రైతులు, యువత పెద్ద సంఖ్యలో కాంగ్రెస్‌కు మద్దతు తెలపడం గ్రామ పాలనా వ్యవస్థలో కొత్త దిశను సూచిస్తోందని, పంచాయతీ ఎన్నికల్లో సామాజిక న్యాయం స్పష్టంగా ప్రతిఫలించిందని ఆయన అభిప్రాయపడ్డారు. గ్రామీణ ప్రజలు అభివృద్ధి, సంక్షేమాన్ని కేంద్రంగా చేసుకుని నిర్ణయాలు తీసుకుంటున్న తీరు తెలంగాణలో నూతన రాజకీయ సంస్కృతికి నాంది పలుకుతోందని టిపిసిసి అధ్యక్షుడు అభిప్రాపడ్డారు.

ఈ విజయం పార్టీపై మరింత బాధ్యతను పెంచిందని, గ్రామీణ అభివృద్ధిని మరింత వేగవంతం చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు... పంచాయతీ రాజ్ వ్యవస్థను బలోపేతం చేస్తూ ప్రతి గ్రామాన్ని అభివృద్ధి ప్రాధాన్యత కేంద్రంగా మార్చే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. సర్పంచ్ ఎన్నికల తొలి, రెండో, మూడో విడతల ఫలితాలు ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై గ్రామీణ స్థాయిలో ఏర్పడిన అనుకూల వాతావరణానికి అద్దం పడుతున్నాయని, ప్రజలు ఇచ్చిన ఈ తీర్పు తెలంగాణలో కాంగ్రెస్ బలోపేతానికి మార్గదర్శకంగా నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు.

### మూడో డిస్కమ్‌కు

# ప్రభుత్వం ఆమోదం

>> ప్రకారం ఏర్పాటు చేయబడుతుంది. ఇది ఒకే ప్రాంతంలో ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది లైసెన్సుదారులు పనిచేయడానికి అనుమతిస్తుందితెలంగాణ రాష్ట్రం మొత్తం మూడవ డిస్కామ్ యొక్క అధికార పరిధిలో ఉంటుంది. ఈ మూడవ డిస్కామ్ బాధ్యతలను పేర్కొంటూ వ్యవసాయం, రక్షిత మంచిన నీట పథకాలు, మిషన్ భగీరథ, హైదరాబాద్ వాటర్ బోర్డు, లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు మరియు ప్రత్యేక డిటిఅర్‌లతో మునిసిపల్ నీటి కనెక్షన్లు వంటి వినియోగదారుల వర్గాలకు విద్యుత్ సరఫరాను విస్తరిస్తుంది. అలాగే కేటాయించిన పిపిఎ వాటా ప్రకారం విద్యుత్ కొనుగోళ్లు, కొత్త వ్యవసాయ కనెక్షన్లను మంజూరు, ఆస్తుల నిర్వహణ, పర్యవేక్షణ (డిటిఅర్‌లు, ఎల్‌టి లైన్లు), లిఫ్ట్ ఇరిగేషన్, సిపిడబ్ల్యూ, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ కోసం మీటరింగ్ ద్వారా వినియోగించిన విద్యుత్ అకౌంటింగ్ చూడటం, రెగ్యులేటరీ ఫైలింగ్ మరియు సమ్మతి, వినియోగదారులకు నమ్మకమైన, నాణ్యమైన విద్యుత్ సరఫరాను నిర్ధారించడం ప్రధాన బాధ్యతలుగా నిర్వర్తించాల్సి ఉంటుంది. అలాగే పంపిణీ నెట్‌వర్క్ విభజన మీటరింగ్, పిపిఎ పునఃకేటాయింపు, మానవ వనరుల పునఃకేటాయింపు, ఆస్తులు మరియు అప్పుల బదిలీ, వినియోగదారులు డిస్కామ్‌ల మధ్య మీటరింగ్ విద్యుత్ సర్దుబాటు చేయనుంది. ఆయా వినియోగదారుల వర్గాలకు విద్యుత్ సరఫరా, బిల్లింగ్ (ఏదైనా ఉంటే), ఫిర్యాదుల పరిష్కారానికి మూడవ డిస్కామ్ బాధ్యత వహిస్తుంది. ఈ మూడో డిస్కం పరిధిలో రాష్ట్రంలోని 29,05,779 వ్యవసాయ కనెక్షన్లు, 489 ఎత్తిపోతల పథకాలు, 99 హైదరాబాద్ వాటర్ వర్క్స్ పథకాలు, మిషన్ భగీరథ, సిపిడబ్ల్యూఎస్‌కు సంబంధించి 1,132 సర్వీసులు, డిటిఆర్ఎస్‌కు సంబంధించి 639 సర్వీసులు ఉంటాయి.

# కస్టడీ నేటితో పూర్తి

>> ఎదుట లొంగిపోవడం విదితమే. అంతకు ముందు ఆయనకు ఏ డాది పాటు పోలీసుల అరెస్టు నుంచి మధ్యంతర ఉత్తర్వుల రక్షణ వుండింది. అయితే బుధవారంతో ప్రభాకర్ రావు కస్టడీ విచారణ ఆరవ రోజుకు చేరింది. ఆరు రోజుల విచారణలో ప్రభాకర్ రావు ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి ఎలాంటి విషయాలు చెప్పాడనేది పోలీసులు వెల్లడించడం లేదు. విశ్వసనీయ సమాచారం మేరకు ప్రభాకర్ రావు పోలీసులను ముప్పతిప్పలు పెట్టి 36 చెరువుల నీళ్లు తాగిస్తున్నట్లు తెలిసింది. ఫోన్ ట్యాపింగ్‌లో ఎ లాంటి అక్రమాలు జరగలేదని, అంతా సవ్యంగానే జరిగిందని ప్రభాకర్ రావు చెప్పుకొచ్చారని తెలిసింది. తన పై బాస్‌లు, ఉన్నతాధికారులకు దీని గురించి అంతా తెలుసునని, ఇందులో అక్రమాలకు తావులేదని ఆయన పదే పదే చెప్పినట్లు తెలిసింది. అక్రమాలు జరిగాయని, ఇందుకు ప్రభాకర్ రావు బాధ్యుడని ఇంతకు ముందు అరెస్టయిన నలుగురు నిందితులు ఇచ్చిన వాంగ్మూలం కాఫీలను కూడా ప్రభాకర్ రావు తిరస్కరింరని, ఇదంతా కల్పితమని, కావాలని, వారిచేత బలవంతంగా వాంగ్మూలం తీసుకున్నారని, హార్డ్ డిస్కల ధ్వంసం అంతా నాటకమని అన్నట్లు తెలిసింది. బిఆఎర్ ఎస్ అధినేత కెసిఆర్ కుమార్తె కవిత ఫోన్‌తో పాటు ఆమె భర్త అనిల్ కుమార్ ఫోన్ ట్యాపింగ్ జరిగిందని కవిత మీడియా సమావేశం నిర్వహించి మరీ ఆరోపించడం తెలిసిందే. ఇదే విషయమై ప్రభాకర్ రావును ప్రశ్నిస్తే అంతా...తూచ్...అన్నట్లు తెలిసింది. కాగా ప్రభాకర్ రావు చివరి రోజు క స్టడీ గురువారంతో ముగియనుంది. దీని తరువాత కస్టడీలో ప్రభాకర్ రావు వెల్లడించిన వివరాలను సిట్ అధికారులు సుప్రీం కోర్టుకు వెల్లడించనున్నా రు. ఈ ప్రక్రియ శుక్రవారం జరగనుందని సమాచారం. అప్పటి వరకు ప్రభాకర్ రావు పోలీసు కస్టడీలోనే వుండనున్నారని సమాచారం. అనంతరం దీనిపై సుప్రీం కోర్టు విచారించి ప్రభాకర్ రావు కస్టడీపై ఒక నిర్ణయం తీసుకునే వీలుంది. మరోవైపు పోలీసు శాఖ ప్రభాకర్ రావును మరో వారం రో జుల పాటు కస్టడీకి కోరనుందని తెలిసింది. మొదటి దఫా వారం రోజులు ఆయన ఎలాంటి సమాచారం వెల్లడిం చనందున కస్టడీని పొడిగించాలని కోరాలని పోలీసు శాఖ నిర్ణయిం చినట్లు తెలిసిం ది. దీనిపై శుక్రవారం నాడు సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలయ్యే వీలుంది. ఇదే సమయంలో ప్రభా కర్ రావును కస్టడీ నుంచి విడుదల చేయాలని ఆయన తరపు న్యాయవాది వాదించ నున్నారు. దీనిపై సుప్రీం తీసుకునే నిర్ణయంపై ఉత్కంఠ నెలకొంది.

## వడివడిగా కొత్త హైకోర్టు

>> మార్పుల వల్ల ఏర్పడిన ఆలస్యాలను అధిగమించేందుకు ఆర్ అండ్‌బిశాఖ, కన్సల్టెంట్లు, కాంట్రాక్టర్ సమన్వయంతో పనిచేయాలని, ప్రాజెక్టును సమయానికి పూర్తిచేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ స్పష్టం చేశారు.

## 20,21న ఉప రాష్ట్రపతి హైదరాబాద్ పర్యటన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబర్17:** భారత ఉప రాష్ట్రపతి సి.పీ. రాధకృష్ణన్ హైదరాబాద్‌లో ఈనెల 20,21 తేదీల్లో పర్యటించనున్నారు. డిసెంబర్ 20వ తేదీన శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌కు చేరుకొని అక్కడనుండి నేరుగా రామోజీ ఫిలిం సిటీ కి వెళ్తారు. పబ్లిక్ సర్వీస్ కమీషన్ చైర్మన్‌ల జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో పాల్గొని అక్కడనుండి లోక్‌భవన్‌లో రాత్రి బస చేస్తారు. 21న ఉదయం కన్హాశాంతి వనంలో ఏర్పాటుచేసిన ప్రపంచ ధ్యానదినోత్సవం కార్యక్రమంలో పాల్గొని అక్కడినుండి శంషా బాద్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకొని ఢిల్లీ తిరిగి వెళ్తా రు. కాగా, ఉప రాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు సంబంధిత ఉన్నతాధికారుల తో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. బందోబస్తు ఏర్పాట్లు, ఉప రాష్ట్రపతి ప్రయాణించే మార్గంలో రహదారుల నిర్వహణ, ప్రోటోకాల్ తదితర ఏర్పాట్లపై సమీక్షించారు. ఉప రాష్ట్రపతి పర్యటనకు ఏ విధమైన లోటు జరగాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

## హైదరాబాద్‌లో రాష్ట్రపతి

>> రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో హైదరాబాద్‌లో పలుచోట్ల ట్రాఫిక్ నిబంధనలు వర్తిస్తాయి. రేపు రాష్ట్రపతి నిలయంలోనే ఆమె విశ్రాంతి తీసుకుంటారు. 19న రామోజీ ఫిల్మ్ సిటీలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాలకు హాజరవుతారు. 20న గచ్చిబౌలిలో బ్రహ్మకుమారీస్ శాంతిసరోవర్ సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాలలో పాల్గొంటారు. 21న రాష్ట్రపతి నిలయంలో నిర్వహించే పౌరుల భేటీ, ఎట్ హోమ్‌లో పాల్గొంటారు. 22న సాయంత్రం ప్రత్యేక విమానంలో ఢిల్లీకి బయలుదేరుతారు.

## నేను పార్టీ మారలేదు: కడియం శ్రీహరి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబర్17:** స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ నోటీసులపై ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పందించారు. బుధవారం స్పీకర్‌కు లిఖిత పూర్వకంగా వివరణ ఇచ్చారు. తాను కాంగ్రెస్‌లో చేరలేదని స్పష్టం చేశారు. పార్టీ మారను అనేది పచ్చి అబద్ధం అని పేర్కొన్నారు. కావాలనే తనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన చెందారు. పార్టీ మారిన ఐదుగురు ఎమ్మెల్యేలపై స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఇదే రోజు తీర్పు వెలవరించారు. కడియం శ్రీహరి తన కుమార్తె కడియం కావ్య కాంగ్రెస్ తరఫున ఎంపీగా పోటీ చేసినప్పుడు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారని ఆరోపణలు ఉన్నాయి.

## వారం - వర్జ్యం

18-12-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మార్గశిరమాసం, దక్షిణాయణం
హేమంత ఋతువు, కృష్ణపక్షం
చతుర్దశి తె.4.59
అనూరాధ రా.8.05, మూల కార్తె
వర్జ్యం : రా.2.20-తె.4.07
దు.ఉ.10.13-10.58
2) మ.2.40-3.25
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:** క్రీడలయందు ఆసక్తి కలిగి వుంటారు. బాధ్యతలు సక్రమంగా నిర్వ హిస్తారు. బంధువుల రాక ఆనందం కలిగిస్తుంది.

**వృషభం:** సంఘంలో గుర్తింపు కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఏర్పరచుకుంటారు. ప్రయాణాలు. మిత్రుల కలయికతో విందు, వినోదాలు.

**మిథునం:** గృహనిర్మాణ ఆలోచనలు కొనసాగిస్తారు. వృత్తి, వ్యాపారాలలో ఎదురైన ఆటంకాలు తొలగుతాయి.

**కర్కాటకం:** చిన్ననాటి మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు. మొండి బాకీలు వసూలవుతాయి.స్వల్ప ధనలాభం పొందుతారు.

**సింహం:** అనుకోని అతిథుల నుండి శుభ వార్తలు అందుకుంటారు. వ్యవహారాలలో విజయం సాధిస్తారు. వస్త్ర లాభం.

**కన్య :** కుటుంబ సభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు. ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి.

**తుల :** చిన్ననాటి మిత్రుల నుండి ఆహ్వానాలు అందుకుంటారు. గృహ నిర్మాణ ఆలోచనలు సాగిస్తారు.ప్రయాణాలు.

**వృశ్చికం:** బంధువులతో ఏర్పడిన విభేదాలు పరిష్కారమవుతాయి. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**ధనుస్సు:** ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. సకాలంలో ఋణాలు తీరుతాయి.స్వల్ప ధనలాభం పొందుతారు.

**మకరం:** ఆస్తి విషయంలో నూతన ఒప్పందాలు కుదురుతాయి. ఉద్యోగాలలో మంచి మార్పులు ఉంటాయి.

**కుంభం:** చేపట్టిన పనులు సవ్యంగా పూర్తి చేస్తారు. నూతన పెట్టుబడులకు అనుకూలంగా ఉంటుంది.కాంట్రాక్టులు లాభిస్తాయి.

**మీనం:** కొన్ని విషయాలలో పట్టిందల్లా బంగారంగా ఉంటుంది. ఆరోగ్య సమస్యలు తీరి ప్రశాంతత పొందుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# భారత్, ఒమన్‌ల మధ్య 7 దశాబ్దాల బంధం



ఒమన్‌లోని మస్కట్ విమానాశ్రయంలో ప్రధాని మోడీకి స్వాగతం పలుకుతున్న కళాకారులు

### ఇంధన భద్రత, టెక్నాలజీ, వ్యవసాయ రంగాలపై ఒమన్ సుల్తాన్‌తో ప్రధాని మోడీ చర్చలు

### గల్ఫ్ దేశంలో ప్రధానికి ప్రవాసభారతీయుల ఘనస్వాగతం

**మస్కట్(ఓమన్),డిసెంబరు 17:** భారత్ ఓమన్‌దేశాలమధ్య దశాబ్దాలుగా నెలకొన్న పరస్పర సహకారం ఇపుడు మరింత శక్తివంతం అవుతుందని, రెండుదేశాలమధ్య ద్వైపాక్షిక బంధం మరింత బలపడి వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత పటిష్టంచేస్తుందని ప్రధాని మోడీ ఆశాభావం వ్యక్తంచేసారు. భారత్ ఓమన్ దేశాలమధ్య 70 ఏళ్లుగా ఉన్న దౌత్య బంధం మరింత ముందుకు సాగుతోందని ఈసందర్భంగా మోడీ ట్వీట్‌చేసారు. మోడీ తన పర్యటనలో ద్వైపాక్షిక బంధంపై ఓమన్ సుల్తాన్‌తో సమగ్ర చర్చలు జరిపారు. వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధన సహకారం, రక్షణరంగం, భద్రత, టెక్నాలజీ, వ్యవసాయం, సాంస్కృతికరంగాల్లో పరస్పరసహకారం వంటివాటిపై ఇరువురునేతలు విస్తృత చర్చలుజరిపారు. మూడు దేశాలపర్యటనల్లో ప్రధానిమోడీ జోర్డాన్, ఇథియోపియాల్లో తన పర్యటనను విజయవంతంగా ముగించుకుని గల్ఫ్ దేశం ఓమన్‌కు చేరారు. ఓమన్ డిప్యూటి ప్రధాని రక్షణ మంత్రి సయ్యిద్ షిహాబ్ బిన్ తారిక్ అల్‌సైద్ ప్రధానిని సాదరంగా స్వాగతం పలికి తోడ్కొని వెళ్లారు. మస్కట్ ఎయిర్‌పోర్టులోనే ప్రధానిమోడీ గౌరవ వందనం స్వీకరించారు. ఈసందర్భంగా మోడీ తన సోషల్‌మీడియాలో భారత్‌లో చరిత్రాత్మక సంబంధాలు కలిగి ఉన్న గల్ఫ్‌దేశంలో పర్యటించడం ఎంతో గర్వకారణంగా ఉందని పేర్కొంటూ రెండుదేశాల భాగస్వామ్యం సరికొత్త దిశలను నిర్దేశిస్తుందని ఆకాంక్షను వ్యక్తంచేసారు. భారత్ ఓమన్ వ్యూహాత్మక భాగస్వామ్యంలోభాగంగానే ప్రధానిమోడీ ఓమన్‌లో రెండోసారి పర్యటించారు. 2023 డిసెంబరులోనే ఓమన్ సుల్తాన్ హైథమ్‌బిన్ తారిక్ పర్యటనలోనే ప్రధానిమోడీని తమ దేశ పర్యటనకు రావాలని ఆహ్వానించారు. ఓమన్‌లోనే భారత సంతతికి చెందిన కుటుంబాలను కూడా కలుసుకుని వారినుద్దేశించి ప్రసంగిస్తారు. విదేశాల్లో ఉన్న భారత సంతతి కుటుంబాలే మన దేశానికి బ్రాండ్ అంబాసిడర్లు అని భారత అభివృద్ధిని తమ దేశాల్లో వివరించి చాటిచెప్పాలని, భారత ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రగతిని ప్రపంచం దశదిశాల వ్యాప్తిచేసేందుకు ప్రవాసభారతీయులే కీలకమని అన్నారు. భారత్‌లో ఓమన్ రాయబారి షేక్ హామైద్ బిన్ అలీబిన్‌సుల్తాన్ ఆల్‌మణి మోడీ పర్యటన ద్వైపాక్షిక సంబంధాలను కీలక మైలురాయికి చేర్చిందని, రెండుదేశాలమధ్య దౌత్యబంధాలు 70 సంవత్సరాలు పూర్తిచేసుకోవడం చరిత్రాత్మకమని రాయబారి పేర్కొన్నారు. మస్కట్‌ఎయిర్ పోర్టులో ప్రధానిమోడీకి ప్రవాసభారతీయులు ఘనస్వాగతం పలికారు. మోడీ మోడీ అంటూ నినాదాలుచేయడంతోపాటు భారత్ మాతాకి జై, వందేమాతరం అంటూ నినాదాలతో హోరెత్తించారు. అంతకుముందు ఇథియోపియా పర్యటనలో ప్రధానిమోడీ పార్లమెంటు ఉభయసభలనుద్దేశించి ప్రసంగించడంతోపాటు ఆదేశ అత్యున్నత పురస్కారాన్ని అందుకున్నారు. ఎయిర్‌పోర్టులో ప్రధానిమోడీని రిసీవ్‌చేసుకోవడంతోపాటు ఎయిర్‌పోర్టుకు మోడీని ఇథియోపియా ప్రధాని ఇలియాస్‌అబ్బీ అలి స్వయంగా కారు నడుపుకుంటూ తోడ్కొ ని వెళ్లి వీడ్కోలు పలికారు.

## రాజ్యాంగాన్ని పరిహాసం చేసిన కాంగ్రెస్: హరీష్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,డిసెంబర్17:** ఎమ్మెల్యేల అనర్హత వ్యవహారంలో స్పీకర్ తీర్పు రాజ్యాంగాన్ని కాంగ్రెస్ పరిహాసం చేసిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ఆరోపించారు. బుధవారం స్పీకర్ ఇచ్చిన తీర్పుపై హరీశ్ రావు స్పందించారు.

కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగంపై ఢిల్లీలో ఒక మాట..తెలంగాణలో మరోమాట మాట్లాడుతోందని ధ్వజమెత్తారు. రాజ్యాంగంపై రాహుల్ నినాదం తెలంగాణలో వర్తించదా అని ప్రశ్నించారు. స్పీకర్ నిర్ణయంతో కాంగ్రెస్ ద్వంద్వ విధానం బట్టబయలైందని అన్నారు. ఢిల్లీలో రాజ్యాంగం పరిరక్షణపై మాట్లాడే కాంగ్రెస్ రియల్ ఫేస్ తెలంగాణలో స్పీకర్ తీర్పుతో బయటపడిందన్నారు.

రాజకీయ లబ్ధి కోసం రాజ్యాంగ సంస్థలను కూడా దిగజార్చడం సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి చెల్లిందన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో రాజ్యాంగం స్పష్టంగా నిర్దేశించిన యాంటీ డిఫెక్షన్ నియమాలను పూర్తిగా పక్కన పెట్టి అధికార పార్టీకి అనుకూలంగా నిర్ణయం తీసుకోవడం రాజ్యాంగాన్ని కాలరాయడమేనన్నారు. సేవ్ ది కాన్‌స్టిట్యూషన్ నినాదం మాటలకే పరిమితమై, ఆచరణలో రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ప్రజలు స్పష్టంగా గమనిస్తున్నారని ఇది ఎంతో సిగ్గుచేటు అని, ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ అని వ్యాఖ్యానించారు.




బుధవారం న్యూఢిల్లీలో భారీ పొగమంచు మధ్యనే రాకపోకలు సాగిస్తున్న వాహనాలు

# ఎమ్మెల్యేల 'అనర్హత' పిటిషన్లు కొట్టివేత

>> లేవని స్పీకర్ తన తీర్పులో స్పష్టం చేశారు.వారు పార్టీ మారినట్లు నిర్దిష్ట ఆధారాలను పిటిషనర్లు సమర్పించలేకపోయారని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో,ఆ ఐదుగురు ఎమ్మెల్యేలు సాంకేతికంగా ఇంకా బీఆర్ఎస్ సభ్యులుగానే కొనసాగుతున్నారని స్పీకర్ నిర్ధారించారు. ఈ తీర్పు బీఆర్ఎస్ వర్గాలకు ఊహించని షాక్‌గా మారింది,స్పీకర్ ఇచ్చిన తీర్పుతో ఫిరాయింపు ఎమ్మెల్యేలకు భారీ ఊరట లభించింది. మొత్తం పది మంది ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లు దాఖలు కాగా, ఇందులో ఎనిమిది మందికి సంబంధించి విచారణ స్పీకర్ పూర్తి చేశారు.కడియం శ్రీహరి,దానం నాగేందర్‌పై దాఖలైన పిటిషన్లకు సంబంధించిన విచారణ ఇంకా పూర్తి కాలేదు.అనర్హత పిటిషన్లపై స్పీకర్ త్వరగా నిర్ణయం తీసుకునేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ బీఆర్ఎస్ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ పై ఈ నెల 19న మరోమారు విచారణ జరగనుంది. 8 మందికి సంబంధించి విచారణ పూర్తి చేసిన గడ్డం ప్రసాద్ కుమార్ బుధవారం ఐదుగురికి సంబంధించి తీర్పు ఇచ్చారు. కాలే యాదయ్య, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, సంజయ్ కుమార్‌కు సంబంధించి గురువారం తీర్పు ఇవ్వనున్నారు. పార్టీ మారినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలల్లో ఖైరతాబాద్ నుంచి దానం నాగేందర్, స్టేషన్ ఘన్ పూర్ నుంచి కడియం శ్రీహరి, భద్రాచలం నుంచి తెల్లం వెంకట్రావు, రాజేంద్రనగర్ నుంచి టి.ప్రకాష్ గౌడ్, బాన్సువాడ నుంచి పోచారం శ్రీనివాస్ రెడ్డి, చేవెళ్ల నుంచి కాలే యాదయ్య, జగిత్యాల నుంచి డాక్టర్ సంజయ్ కుమార్, గద్వాల నుంచి బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, శేరిలింగంపల్లి నుంచి ఆరెకపూడి గాంధీ, పటాన్‌చెరు నుంచి జి.మహిపాల్ రెడ్డి ఉన్నారు. ఈ పది మందిపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ నాయకులు స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదుపై స్పీకర్ సకాలంలో స్పందించి చర్యలు తీసుకోలేదని బీఆర్ఎస్ నాయకులు హైకోర్టును ఆశ్రయించారు. బీఆర్ఎస్ నాయకులు ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యేలపై విచారణ చేపట్టాలని హైకోర్టు స్పీకర్ ప్రసాద్ కుమార్‌కు సూచించింది. ఈ ఉత్తర్వులతో సంతృప్తి చెందని బీఆర్ఎస్ నాయకులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు ఈ ఏడాది జులై 31వ తదీన ఆ పది మంది ఎమ్మెల్యేలపై వచ్చిన ఫిర్యాదులను మూడు నెలల్లో తేల్చాలని స్పీకర్‌ను ఆదేశించింది. దీంతో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ బీఆర్ఎస్ నాయకులు ఇచ్చిన ఫిర్యాదులపై విచారణ వేగవంతం చేశారు. నిర్దేశించిన మూడు నెలల గడువులోపు విచారణ పూర్తి చేయకపోవడంపై నవంబర్‌లో సుప్రీంకోర్టు మరోసారి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. స్పీకర్ చర్యలను కోర్టు ధిక్కారంగా పరిగణిస్తున్నట్లు పేర్కొన్న సుప్రీంకోర్టు, త్వరగా నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేసింది. లేదంటే తీవ్ర పర్యవసానాలు ఎదుర్కోవాల్సి వస్తుందని కూడా స్పీకర్‌ను హెచ్చరించింది. నాలుగువారాల్లో నిర్ణయం తీసుకోండి. లేదా నూతన సంవత్సరం వేడుకలు ఎక్కడ జరుపుకోవాలనుకుంటున్నారో నిర్ణయించుకోండి అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసింది. నోటీసులు అందుకుని స్పందించిన 8 మంది ఎమ్మెల్యేలపై విచారణ పూర్తి చేసేందుకు మరో రెండు నెలలు సమయం కావాలని స్పీకర్ కార్యాలయం సుప్రీంకోర్టుకు విజ్ఞప్తి చేసింది. ఈ సందర్భంలోనే సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది.ఎనిమిది మంది ఎమ్మెల్యేలకు చెంది ఇప్పటికే క్రాస్‌ఎగ్జామినేషన్ పూర్తయింది. ఆ ఎమ్మెల్యేలపై నిర్ణయం రిజర్వ్ చేసిన స్పీకర్ ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిల విషయంలో రెండు సార్లు నోటీసులు ఇచ్చినా వివరణ ఇవ్వకుండా మరింత సమయం కావాలని కోరారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈ ఎనిమిది మంది ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని తమ వాదనల్లో స్పష్టం చేశారు. ఇప్పటికీ తాము సాంకేతికంగా బీఆర్ఎస్‌లోనే ఉన్నామని వెల్లడించిన ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో అధికారికంగా చేరలేదని స్పీకర్‌కు వివరణ ఇచ్చారు. తమ నియోజకవర్గాల అభివృద్ధి పనుల కోసమే ముఖ్యమంత్రితో సమావేశమైనట్లు తెలిపారు. కాగా, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిలపై దాఖలైన అనర్హత పిటిషన్లపై విచారణ ఇంకా పూర్తి కాలేదని, అది కొనసాగుతోందని స్పీకర్ కార్యాలయం తెలిపింది. దానం, కడియం స్పీకర్ నోటీసులపై వివరణ ఇచ్చేందుకు సమయం కోరినట్టు తెలుస్తోంది. వారు సమాధానం ఇచ్చాక త్వరలోనే వాటిపై కూడా నిర్ణయం వెలువడే అవకాశం ఉంది. కాగా, ఈనెల 19న సుప్రీంకోర్టు స్పీకర్ నిర్ణయంపై స్పందించనుంది. స్పీకర్ నిర్ణయాలకు సంబంధించి ప్రొసీడింగ్స్ కాపీలను గురువారం అసెంబ్లీ నుంచి ఇద్దరు ఉన్నతాధికారులు ఢిల్లీకి వెళ్లి సుప్రీంకోర్టులో సమర్పించనున్నారు.

### సిఎం రేవంత్ దావోస్ పర్యటనకు

# ఎసిబి కోర్టు అనుమతి

>> పాస్‌పోర్టు తిరిగి అప్పగించాలని కోర్టు ఆదేశించింది. దావోస్ సదస్సులో తెలంగాణకు పెట్టుబడులు ఆకర్షించేందుకు సీఎం రేవంత్ ప్రతినిధి బృందంతో కలిసి పాల్గొననున్నారు. గతేడాది కూడా ఆయన దావోస్‌కు వెళ్లి పెట్టుబడులపై ఒప్పందాలు కుదుర్చుకున్న విషయం తెలిసిందే. ఈ అనుమతితో సీఎం విదేశీ పర్యటనకు అడ్డంకులు తొలగాయి. రాష్ట్ర అభివృద్ధికి ఈ సదస్సు కీలకమవుతుందని అధికార వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

## మూడో విడత కూడా కాంగ్రెస్‌దే..

>> ఇరు పార్టీల కార్యకర్తల మధ్య జరిగిన వాగ్వాదం ఘర్షణకు దారి తీసింది. పోలీసులు అక్కడికి చేరుకుని ఇరు వర్గాలను చెదరగొట్టారు. నల్గొండ జిల్లా డిండి మండలం శాంతిగూడెంలోనూ రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలు పరస్పరం దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో ఒకరికి గాయం అయింది. అతడిని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం దర్శించర్ల గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్యకర్తలు పోలింగ్ బూత్ వద్ద ప్రచారం నిర్వహిస్తున్నారంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఆందోళనకారులను పోలీసులు చెదరగొట్టారు. నేరేడుచర్ల మండలం ఎల్బీ నగర్ పోలింగ్ కేంద్రాల వద్ద స్వల్ప ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. పోలింగ్ కేంద్రం వద్ద ప్రచారం నిర్వహిస్తున్నారని ఇరు పార్టీల నేతలు వాగ్వాదానికి దిగారు. సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ మండలం మెటల్‌కుంట పోలింగ్ కేంద్రం వద్ద కూడా ఉద్రిక్తత నెలకొంది. పోలింగ్ సమయం ముగిసిన ఓటు వేసేందుకు వెళుతున్న బీఆర్ఎస్ వర్గీయులను కాంగ్రెస్ నాయకులు అడ్డుకోవడంతో ఇరు వర్గాల మధ్య తోపులాట చోటు చేసుకుంది.ఓటు వేసేందుకు ఎలా అనుమతించారంటూ పోలింగ్ కేంద్రం ప్రహరీ దూకి లోపలికి వెళ్లేందుకు బీఆర్ఎస్ మద్దతుదారులు యత్నించడంతో తీవ్ర ఆందోళన నెలకొంది. ఒంటిగంట దాటిన తర్వాత ఓటు ఎలా వేస్తారని పరస్పరం విమర్శించుకోవడంతో ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగింది. ఆందోళనకు దిగిన ఇరు వర్గాలను పోలీసులు చెదరగొట్టి పరిస్థితిని సర్దుబాటు చేశారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం విలాసాగర్‌లో సర్పంచ్ అభ్యర్థి వద్ద పోలీసులు నగదు స్వాధీనం చేసుకన్నారు. స్థానిక పోలింగ్ కేంద్రం దగ్గరలో జనం గుమిగూడి ఉండటంతో పోలీసులు అక్కడికి వెళ్లారు. సర్పంచ్ అభ్యర్థి వద్ద రూ.28,500 నగదును స్వాధీనం చేసుకున్నారు.

## హిజాబ్ వివాదంపై యుపి మంత్రి దుమారం!

**పాట్నా, డిసెంబరు 17:** బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఒక మహిళా డాక్టర్ హిజాబ్‌ను తొలగించిన ఉదంతం దేశ రాజకీయాల్లో పెను దుమారం రేపుతోంది. ఈ ఘటనను సమర్థిస్తూ ఉత్తరప్రదేశ్ క్యాబినెట్ మంత్రి సంజయ్ నిషాద్ చేసిన అత్యంత వివాదాస్పద వ్యాఖ్యలు ఇప్పుడు మరింత ఆజ్యం పోశాయి. నితీష్ కుమార్ చర్యను వెనకేసుకొస్తూ ఆయన చేసిన అసభ్యకర వ్యాఖ్యలపై ప్రతిపక్షాలు, మహిళా సంఘాలు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నాయి. పాట్నాలో జరిగిన ఒక ప్రభుత్వ కార్యక్రమంలో నితీష్ కుమార్ నూతనంగా ఎంపికైన ఆయుష్ వైద్యులకు నియామక పత్రాలను పంపిణీ చేశారు.

ఈ క్రమంలో నుస్రత్ పర్వీన్ అనే మహిళా డాక్టర్ వేదికపైకి రాగా ఆమె ధరించిన హిజాబ్‌ను చూసిన నితీష్ కుమార్ ఏమిటిది అన్నట్లుగా సైగ చేశారు. ఆమె స్పందించేలోపే ఆయనే స్వయంగా ఆమె హిజాబ్‌ను కిందకు లాగి ముఖం కనిపించేలా చేశారు. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నితీష్ కుమార్ మానసిక స్థితిపై ప్రతిపక్షాలు ప్రశ్నలు కురిపించాయి. ఈ ఘటనపై స్పందించిన యూపీ మంత్రి సంజయ్ నిషాద్ ఒక లోకల్ ఛానెల్‌తో మాట్లాడుతూ దిగ్భ్రాంతికర వ్యాఖ్యలు చేశారు. ఆయన కూడా మనిషే కదా, ఇలా ఆయన వెంట పడకూడదు. కేవలం హిజాబ్‌ను తాకినందుకే ఇంత గొడవ చేస్తున్నారే ఒకవేళ మరెక్కడైనా తాకి ఉంటే ఇంకెంత రభస చేసేవారు అంటూ నవ్వుతూ వ్యాఖ్యానించారు.

## ఆదిలాబాద్‌లో నక్సలైట్ల అరెస్టును ఖండించిన మావోయిస్టు పార్టీ

**హైదరాబాద్, డిసెంబరు 17, ప్రభాతవార్త:** ఆదిలాబాద్‌లోని సిర్పూర్‌లో 16 మంది నక్సలైట్లను తెలంగాణ పోలీసులు అరెస్టు చేయడాన్ని మావోయి స్టు పార్టీ తీవ్రంగా ఖండించింది. పార్టీ అధికార ప్రతినిధి జగన్ పేరిట బుధవారం ఒక లేఖ విడుదలయ్యింది. కకర్ బుడ్డి, బాబ్జీ పేట్ గ్రామాల సమీపంలో నిరాయుధులుగా వున్న వారిని పోలీసులు అరెస్టుచేశారని, ఇదిఅప్రజా స్వామ్యమైనదిగా ఆయనతెలిపారు. తెలంగాణలో కొనసాగుతున్న ప్ర జా స్వామ్య వాతావరణానికి ఇది విఘాతంగా జగన్ తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు బిజెపి నిర్వహిస్తున్న ఆపరేషన్ కగార్‌కు మద్దతు ఇవ్వవ ద్దని ఆయన కోరారు. కేంద్రంలోని బిజెపి నక్సల్స్ ముక్త్, ప్రతిపక్షాల ముక్త్ లక్ష్యాలతో యుద్ధం చేస్తోందని, ఏక్‌భారత్, శ్రేష్ట భారత్, ఏక్ చునావ్ వంటి నినాదాలతో అన్నీ పార్టీలను నిర్వీర్యం చేస్తోందని జగన్ విమర్శించారు. ఎన్నికల కమిషన్, కోర్టులు, సిబిఐ, ఎన్ఐఎ వంటి రాజ్యాంగ సం స్థలను కేంద్రం తనఆధీనంలో పెట్టుకుని పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని ఖునీ చేస్తోం దని, ఇందుకు బిహార్ ఎన్నికలు సాక్ష్యమని ఆయన తెలిపారు. బిజెపి విధా నాలు కార్పొరేట్లకు మాత్రమే మేలుచేస్తున్నాయని ఆయన ఎద్దేవా చేశారు. ఆది లాబాద్‌లో అరెస్టు చేసిన నిరాయుధ నక్సలైట్లను వెంటనే కోర్టులో హాజరు పరచాలని ఆయన డిమాండ్ చేశారు. దీంతో పాటు తెలంగాణలో ప్రజా స్వా మ్యం బతికేలా ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు ఆందోళన చేయాలని ఆయన కోరారు.

## ఈగల్ దాడుల్లో అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్ల పట్టివేత

### 44 కిలోల గంజాయి స్వాధీనం

**హైదరాబాద్, డిసెంబర్ 17, ప్రభాతవార్త:** రాష్ట్రంలో గంజాయితో పాటు డ్రగ్స్ స్మగ్లర్ల భరతం పడుతున్న ఈగల్ (పూర్వపు టి. నాబ్) పోలీసులు బుధవారం నాడు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఆకస్మిక దాడులు నిర్వహించగా ఇద్దరు అంతరాష్ట్ర గంజాయి స్మగ్లర్లు పట్టుబడ్డారు. ఈ సందర్భంగా వీరి వద్ద నుంచి 22 లక్షల రూపాయల విలువచేసే 44 కిలోల గంజాయి జప్తు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను ఈగల్ డైరక్టర్ సందీప్ శాండిల్యా మీడియాకు వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రైల్వే స్టేషన్లలో ఈగల్ పోలీసులు, రైల్వే పోలీసులు తరచూ దాడులు నిర్వహిస్తుండడం తెలిసిందే. ఈ క్రమంలో బుధవారం ఉదయం ఈగల్ పోలీసులు, రైల్వే పోలీసులు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌పై దాడులు చేబట్టారు. ఇక్కడ అను మానిత ప్రయాణీకులను తనిఖీ చేయగా ఇద్దరువ్యక్తుల వద్ద సంచుల్లో వున్న 44 కిలోల గంజాయి పట్టుబడింది. గంజాయితో పట్టుబడ్డ వ్యక్తుల ను ఢిల్లీకి చెందిన మింటూ, నూర్ ఆలంగా గుర్తించారు. వీరిద్దరు ఢిల్లీకి చెందిన బడా డ్రగ్స్ స్మగ్లర్ రహమాన్ కోసం దందా చేస్తున్నట్లు తేలింది. విజయనగరం నుంచి సికింద్రాబాద్‌కు గంజాయితో వచ్చిన వీరు ఇక్కడినుంచి దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ రైల్లో ఢిల్లీకి గంజాయి తరించాలని పథకం పన్నారు. పట్టుబడ్డ ఇద్దరిపై ఎన్‌డిపిఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండుకు తరలించారు. కాగా ఇం దులో మింటుపై ఢిల్లీలో డ్రగ్స్ కేసు నమోదై వుండగా ఆ కేసులో ఇతను అరెస్టయి జైలుకు వెళ్లాడు. ఈ ముఠాకు నాయకుడుగా వున్న ఢిల్లీ వాసి రహమాన్ కోసం గాలింపు చేబట్టారు. కాగా రాష్ట్రంలో డ్రగ్స్‌ను నిర్మూలిం చేందుకు ఈగల్ పోలీసులు చేబట్టిన ఆపరేషన్లకు అందరు సహకరించాలని డైరక్టర్ సందీప్ శాండిల్యా కోరారు. డ్రగ్స్ గురించి ఎవరి వద్ద ఎలాంటి సమా చారం వున్నా 1908 లేదా 8712671111కు ఫోన్ చేయాలని టిఎస్‌నాబ్ వెబ్‌సైట్లో కూడా సమాచారం ఇవ్వవచ్చని ఆయన తెలిపారు. డ్రగ్స్ స్మగ్లర్ల సమాచారం అం దించిన వారి వివరాలు రహస్యంగా వుంచుతామని ఆయన వెల్లడించారు.

## ఢిల్లీలో భారీగా నకిలీ మందుల పట్టివేత

### ఇద్దరి అరెస్టు, కల్తీ ఆయింట్‌మెంట్ల బాక్సులు, ఇతర ఔషధాలు జప్తు

**హైదరాబాద్, డిసెంబర్ 17, ప్రభాతవార్త:** దేశ రాజధాని ఢిల్లీలో భారీగా నకిలీ మందులు పట్టుబడ్డాయి. ఢిల్లీ పోలీసులు, డ్రగ్స్ అధికారులు సం యుక్తంగా చేబట్టిన దాడుల్లో ఐదు కోట్ల రూపాయల విలువ చేసే ఔషధాలు, రా మెటీ రియల్, కల్తీ ఆయింట్‌మెంట్ల బాక్స్‌లు లభ్యమయ్యాయి. ఈ సందర్భంగా ఇద్దరు నిందితులను అరెస్టు చేయగా మరికొందరు పారిపోయారు. ఢిల్లీ సమీ పంలోని ఘజీయాబాద్‌లో నకిలీమందుల కార్ఖానా వున్నట్లు అందిన సమా చారంపై ఢిల్లీ పోలీసులు, డ్రగ్స్ అధికారులు సంయుక్తంగా దాడులు చేశారు. ఈ దాడుల్లో బెట్నోవెట్ సి, క్లోబ్ జి ఆయింట్‌మెం ట్ల బాక్స్‌లు నకిలీవి పెద్ద సంఖ్యలో లభ్యమయ్యాయి. ఘజీయాబాద్‌లో దాడులు చేశాక ఢిల్లీ లోని తెలివారలో గల ఓ గోదాములో నకిలీ మందులు వున్నాయన్న సమాచారంపై దాడులు చేయగా అక్కడ కూడా భారీగా కల్తీ సరుకు పట్టుబడింది. దీంతో తపాటు 3700 కిలోల రా మెటీరియల్ దొరి కింది. దీనిని నకిలీ మందుల తయారీకి వాడుతున్నట్లు తేలింది. చర్మ సంబంధ వ్యాధులకు వాడే ఆయిం ట్‌మెంట్లను ఈ ముఠా కల్తీ చేస్తున్నట్లు తేలింది. ఇక్కడ విశాల్ గుప్తా. గౌరవ్ భగత్ అనే ఇద్దరిని అరెస్టు చేశారు. 2019 నుంచి వీరు నకిలీ ఔషధాలు అమ్ముతున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఢిల్లీ డిసిపి (క్రైం) ఆదిత్య గౌతం ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి.

## రైళ్లలో పరిమితి మించిన లగేజికి అదనపు ఛార్జీలు

### ఇకపై 10 గంటలముందే రిజర్వేషన్ చార్టు తయారీ




**న్యూఢిల్లీ, డిసెంబరు 17:** పరిమితికి మించి రైల్వేల్లో లగేజిని తీసుకెళుతున్న సంఘటనలపై రైల్వేశాఖ దృష్టిసారించింది. అధిక లగేజిపై అదనపు ఛార్జిలు వసూలు చేసేందుకు నిర్ణయించింది. ఎసి మొదటి తరగతిలో 70 కిలోలవరకూ లగేజికి అనుమతి ఉంటే ఎసి టూటైర్‌లో 50 కిలోలవరకూ లగేజికి అనుమతి ఉంది. అలాగే ఏసీ త్రీటైర్‌లో 40 కిలోల లగేజివరకే అనుమతి ఉంది. జనరల్ బోగీలో 35 కిలోల లగేజివరకు మాత్రమే అనుమతి ఉంటుందని, ఆపై లగేజిలకు రైల్వే రవాణా నిబంధనలను అనుసరించి అదనపు ఛార్జిలు వసూలు చేస్తారని రైల్వేశాఖప్రకటించింది. అలాగే పరిమితికి మించిన సైజులో ఉన్న బ్యాగ్‌లపైనా జరిమానా ఉంటుందని రైల్వే శాఖ వెల్లడించింది.

**10 గంటలకు ముందే చార్ట్ తయారీ**

అలాగే రైలు ప్రయాణాల్లో అనిశ్చితిని తొలగించేందుకు రిజర్వేషన్ చార్టులను మరింత ముందుగానేప్రకటించాలనినిర్ణయించింది. ఇప్పటివరకూ రైలు బయలుదేరడానికి నాలుగు గంటలముందు తయారుచేసే రిజర్వేషన్ చార్టును ఇకపై 10గంటలముందుగానే ఖరారుచేయనున్నది. ఇందుకు సంబంధించి చార్ట్ తయారీ షెడ్యూలును రైల్వేబోర్డు అప్‌డేట్‌చేసింది. సుమారు 10 గం టలముందే టికెట్‌స్టేటస్‌ను చెక్‌చేసుకోవడం ద్వారా ప్రత్యామ్నాయ ప్రయాణ ఏర్పాట్లుచేసుకోడానికి వీలుంటుందని రైల్వేశాఖ భరోసా ఇస్తోంది. ఉదయం ఐదునుంచి మధ్యాహ్నం రెండు గంటలలోపు బయలుదేరే రైళ్లకు తొలిచార్టు ముందురోజు రాత్రి 8 గంటలకే రూపొందిస్తారు. మధ్యాహ్నం రెండునుంచి రాత్రి 11.59 గంటలవరకూ అర్థరాత్రి 12 గంటలనుంచి ఉదయం ఐదు గంటలవరకూ బయలుదేరే రైళ్ల తొలిచార్టునుకనీసం పదిగంటలముందు రూపొందించాలనిరైల్వేబోర్డు నిర్ణయించింది. అన్ని జోనల్ కార్యాలయాలకు లేఖలు రాసింది.

# ప్రశాంతంగా ముగిసిన పంచాయతి ఎన్నికలు

## కొత్త సర్వంచ్‌లు, వార్డు సభ్యులకు శుభాకాంక్షలు: మంత్రి సీతక్క

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, డిసెంబర్17:** గ్రామపంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా, సజావుగా, విజయవంతంగా పూర్తి చేసిన పంచాయతీరాజ్ శాఖ సిబ్బందికి రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క అభినందనలు తెలిపారు. గ్రామ స్థాయిలో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే ఈ కీలక ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో ముగియడం రాష్ట్రానికి గర్వకారణమని మంత్రి పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణలో నిరంతర పర్యవేక్షణ, పారదర్శకత, నిబద్ధతతో పనిచేసిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదినికు ప్రత్యేక అభినందనలు తెలిపారు. అదే విధంగా, ఎన్నికల అథారిటీగా కీలక బాధ్యతలు నిర్వహించిన పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ జి.సృజనకు అభినందనలు తెలిపారు. ఎన్నికల ప్రక్రియ విజయవంతంగా పూర్తయ్యేందుకు సహాయ సహకారాలు అందించిన పోలీస్, ఇతర శాఖల అధికారులకు, సిబ్బందికి మంత్రి సీతక్క కృతజ్ఞతలు తెలిపారు.



ముఖ్యంగా ఎక్కడా హింసాత్మక ఘటనలు జరగకుండా, రీపోలింగ్ అవసరం లేకుండా ఎన్నికలు పూర్తి కావడం అందరి సమిష్టి కృషికి నిదర్శనమని ఆమె అన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యులకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. నిన్నటి వరకు రాజకీయ పోటీలు ఉన్నా, నేటి నుంచి గ్రామాల సమగ్ర అభివృద్ధి కోసం పార్టీల కతీతంగా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రజలు ఇచ్చిన బాధ్యతను విశ్వాసంతో స్వీకరించి, పారదర్శక పాలనతో గ్రామాల్లో అభివృద్ధి కార్యక్ర మాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. పల్లెలే తెలంగాణ సౌభాగ్యం. పల్లెల అభివృద్ధి ద్వారానే రాష్ట్ర అభివృద్ధి పరిపూర్ణమవుతుందన్నారు . తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, విద్య, ఆరోగ్యం, మహిళా సాధికారత, మౌలిక వసతులు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజాసేవకు అంకితం కావాలని ఆమె కోరారు. గ్రామాల ప్రగతే లక్ష్యంగా, ప్రజల భాగస్వామ్యంతో బలమైన గ్రామపంచాయతీలను నిర్మిద్దామని మంత్రి పిలుపునిచ్చారు. గ్రామపంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా, సజావుగా నిర్వహించినందుకు పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ జి. సృజనకు మంత్రి సీతక్క ఫోన్ చేసి అభినందించారు. జిల్లా స్థాయి పంచాయతీ అధికారులు, సిబ్బందిని సమర్థంగా సమన్వయం చేస్తూ, ఎక్కడా ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా, విమర్శలు, ఆరోపణలకు తావులేకుండా ఎన్నికల ప్రతి దశను క్రమబద్ధంగా నిర్వహించి గ్రామపంచాయతీ ఎన్నికలను విజయవంతంగా పూర్తిచేసినందుకు మంత్రి సీతక్క ప్రత్యేకంగా ప్రశంసించారు. కొత్తగా ఏర్పడిన పాలకమండళ్ల అనంతరం కూడా ఇదే పనితీరును కొనసాగిస్తూ గ్రామీణ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందేలా కృషి చేయాలని మంత్రి సీతక్క ఆకాంక్షించారు.

# దేశ భద్రతకు ముప్పుగా 'శాంతి బిల్లు'

## పార్లమెంట్‌లో మండిపడ్డ ఎంపీ గడ్డం వంశీకృష్ణ

**హైదరాబాద్, డిసెంబరు 17,ప్రభాతవార్త:** అణుశక్తి రంగంలో ప్రైవేట్ సంస్థలకు బాధ్యతలు అప్ప గించేలా తీసుకొచ్చిన 'శాంతి బిల్లు' దేశ భద్రత, ప్రజల భద్రతకు తీవ్రమైన ప్రమాదమని పెద్దపల్లి లోక్‌సభ సభ్యులు గడ్డం వంశీకృష్ణ పార్లమెంట్‌లో తీవ్రంగా విమర్శించారు. బిల్లుపై చర్చ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ శాంతి బిల్లు అని పేరు పెట్టారు గానీ, ఇందులోని అంశాలు దేశానికి అశాంతిని తెస్తాయనీ విమర్శించారు. అణు ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది? సరఫరాదారులపై బాధ్యత తొలగిస్తే ప్రజల ప్రాణాలకు ఎవరు గ్యారంటీ ఇస్తారు?" అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దేశంలో ఉగ్రవాద దాడులు, నిరుద్యోగం, రూపాయి విలువ పతనం, ఇండిగో వంటి కార్పొరేట్ సంక్షోభాలపై ప్రభుత్వం జవాబుదారీతనం చూపడం లేదని విమర్శించారు.

గత 11 ఏళ్లుగా ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్ప టివరకు సమాధానం ఇవ్వలేదని అన్నారు. ఫ్రాన్స్, రష్యా, చైనా, దక్షి ణ కొరియా వంటి దేశాల్లో అణుశక్తి పూర్తిగా ప్రభుత్వ నియంత్రణలోనే ఉందని గుర్తు చేస్తూ, భారత్‌లో ఈ కీలక రంగాన్ని ప్రైవేట్ చేతుల్లో పెట్టడం ప్రమాదకరమని స్పష్టం చేశారు. అణు ప్రమాదం ఉద్దేశాన్ని చూడదు. అది ప్రైవేట్ ప్లాంటా, ప్రభుత్వ ప్లాంటా అన్న తేడా లేకుండా తరాల భవిష్యత్తును నాశనం చేస్తుంది. బాధ్యత చట్టాన్ని బలహీనపరచడం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటమే"అని ఆయన హెచ్చరించారు. అదానీ గ్రూప్ అణుశక్తి రంగంలో ఆసక్తి చూపిన వెంటనే ఈ బిల్లు రావడం యాదృచ్ఛికమా? అని ప్రశ్నించిన ఎంపి, గత పదేళ్ల తప్పిదాల నుంచి ప్రభుత్వం పాఠాలు నేర్చుకోవాలని సూచిం చారు. ప్రైవేటీకరణ అణుశక్తి రంగంలో ప్రపంచవ్యాప్తంగా విఫలమైందని పేర్కొన్నారు ఎంపి గడ్డం వంశీకృష్ణ, ఈ బిల్లును పునః పరిశీలించి ప్రైవేట్ సంస్థలు, సరఫరాదారులపై కఠిన బాధ్యతలు విధించాలని డిమాండ్ చేశారు.

### ఉద్గం పథకం పేరిట సైబర్ నేరగాళ్ల కొత్త మోసాలు

# లింకులు పంపి దోచేస్తున్న కేడీలు

## అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైం పోలీసుల సూచన

**హైదరాబాద్, డిసెంబర్ 17, ప్రభాతవార్త:** సైబర్ నేరగాళ్ల బరితెగింపు కొత్త రూపం సంతరిం చుకుంది. ఇప్పటి వరకు ట్రేడింగ్, డిజిటల్ అరెస్టు, మా ట్రిమోనియల్ వంటి నేరాలతో అమాయకులను నిండా ముంచిన నేరగాళ్లు ఇప్పుడు ఆర్‌బిఐ కొత్తగా ప్రవేశపెట్టిన ఉద్గం పథకాన్ని తమకు అనుకూ లంగా మార్చుకుని మోసాలకు దిగసాగారు. ఈ మోసాలను ఓసారి పరిశీలిస్తే దేశ వ్యాప్తంగా కోట్లాది మంది తమ బ్యాంకులోని ఖాతాలలో చిన్న మొత్తాలను అలాగే వదిలేసి ఖాతాలను నిర్వహించడం లేదు. ఇలాంటి ఖాతాలు కోట్ల సంఖ్యలో వున్నట్లు దీనివల్ల 30 వేల కోట్ల రూపాయలు బ్యా ంకుల్లో నిర్వహణ లేకుండా వున్నట్లు ఆర్‌బిఐ ప్రకటించింది. బ్యాంకుల ఖాతాలతో పాటు చిన్నా చితక ఎఫ్‌డిలు, డెవిడెండ్లు, షేర్లు, మ్యూచువల్ ఫండ్స్ కూడా లక్షల సంఖ్యలో వుండి పోయాయి. ఏళ్ల తరబడి వీటి నిర్వహణ చూడని ఖాతాదారులు వాటిని వెంటనే మూసివేయడం లేదా సవ్యంగా నిర్వహించి అందులోని డబ్బులను తీసుకోవాలని ఆర్‌బిఐ కోరింది. ఇందు కోసం ఉద్గం పేరిట ఓ పథకాన్ని ప్రవేశపెట్టింది. మీ ధనం... మీ హక్కు పేరిట ఆర్థిక శాఖ ఈ పథకం అమలు చేసింది. ఈ పథకం వచ్చే ఏడాది సెప్టెంబరు 30వ తేదీ వరకు వుంటుంది. రెండు నుంచి పదేళ్ల వరకు నిర్వహణలో లేని ఖాతాల కోసం ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. అయితే ఈ పథకాన్ని సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. ఆర్‌బిఐ పేరిట ఎస్ఎంఎస్‌లు లేదా లింకులు పంపుతూ అనేక మందిని మోసం చేస్తున్నారు. నిర్వహణ చూడని ఖాతాదారులు వీటిని పట్టించుకోవడం లేదు. బ్యాంకు ఖాతాలు కలిగి నిర్వహణ చూడని వారు తమకు వచ్చిన మెసేజ్‌లు, లింకులు నిజమైనవిగా భావిస్తూ సైబర్ నేరగాళ్ల లింకులను ఓ పెన్ చేస్తే అంతే సంగతులు. ఇలా లింకులను క్లిక్ చేసిన ఢిల్లీ, హరియాణా, తమిళనాడుకు చెందిన కొందరు తమ బ్యాంకుల్లో వున్న లక్షలాది రూపాయలు పోగొట్టుకున్నారు. ఐడి, పాస్ వర్డ్‌లు, ఓటిపిలు పంపుతూ నిమిషాల వ్యవధిలో ఖాతాలను ఈ నేరగాళ్లు ఖాళీ చేస్తున్నారు. ఈ తరహా మోసాలపట్ల అందరు అప్రమత్తంగా వుండాలని, ఫోన్‌లలో వచ్చే లింకులను క్లిక్ చేయవద్దని, ఓటిటిలు, పాస్ వర్డ్‌లు ఎవరికీ చెప్పవద్దని సైబర్ క్రైం పోర్టల్ అధికారులు, సైబర్ క్రైం పోలీసులుకోరుతున్నారు. ఎలాంటి అను మానం వున్నా 1930 లేదా సమీప పోలీసులకు ఫిర్యాదు చేయాలని వారు కోరుతున్నారు.

## చైనా నేరగాడితో దోస్తీ చేసిన ముంబయి సైబర్ నేరస్థుడి అరెస్టు

**హైదరాబాద్, డిసెంబర్ 17, ప్రభాతవార్త:** ఆదిత్యా బిర్లా గ్రూపు కంపెనీ పేరుతో సోషల్ మీడియాలో నకిలీ ప్రకటన వుంచి ట్రేడింగ్‌లో భారీ లాభాలు ఇస్తామని నమ్మించి అమాయకులను మోసం చేసిన ఓ నేరగాడిని సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. పట్టుబడ్డ నేరగాడు చైనా సైబర్ నేరగాడితో దోస్తీ చేసినట్లు తేలింది. పట్టుబడ్డ నేరగాడు హైదరాబాద్‌లో ఓ వ్యాపారిని 32 లక్షల రూపాయలు మోసం చేసినట్లు తేలింది. నెల రోజుల క్రితం సో షల్ మీడియాలో వచ్చిన ప్రకటనను నమ్మిన వ్యాపారి దీనిని క్లిక్ చేయగా సదరు నేరగాడు ఫోన్‌లో మాట్లాడాడు. అనంతరం సైబర్ నేరగాడు వ్యా పారిని మాటల్లో ముంచెత్తి ట్రేడింగ్‌లో లాభాలుంటాయని చెబుతూ తాను సూచించిన వాటిలో పెట్టుబడులు పెట్టాలని సూచించి 32 లక్షల రూపా యలు కాజేశాడు. దీని తరువాత సైబర్ నేరగాడు పత్తా లేకుండా పోవడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు ఆధారంగా వి చారించగా ఈ గోల్‌మాల్‌కు పాల్పడింది ముంబాయికి చెందిన ఒమర్‌గా తేలింది. అతను చైనా సైబర్ నేరగాడితో కలిసి కొంతకాలంగా భారత్‌లో గో ల్‌మాల్ కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు తేలింది. ఇతని ముఠాలో గుజరాత్‌కు చెందిన రిషీ తుషార్, వినాయక్ రాజేందర్‌లు వున్నారని తేలింది. వీరంతా చైనా నేరగాడికి మ్యూల్ ఖాతాలు ఇస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

దేశ వ్యాప్తంగా 12 కేసుల్లో వీరు నిందితులుగా తేలింది. ఈ క్రమంలో చైనా నేరగాడికి 50 లక్షల రూపాయలు క్రిప్టో కరెన్సీ ద్వారా ఇచ్చినట్లు తేలింది. పట్టుబడ్డ ఒమర్ నుంచి లాప్‌టాప్‌తో పాటు సెల్‌ఫోన్‌ను ఇం కొన్ని వస్తువులను జప్తు చేశారు.

# ఇన్నోవా కారు బీభత్సం

## నిద్రిస్తున్న తండ్రి, కుమారులపైకి దూసుకెళ్లిన కారు

### అక్కడికక్కడే ఇద్దరు మృతి.. మరొకరి పరిస్థితి విషమం




**మైలార్‌దేవ్‌పల్లి,డిసెంబరు 17 ప్రభాతవార్త :** అతి వేగంగా వచ్చిన ఇన్నోవా కారు స్వెట్టర్ షెడ్‌లోకి దూసుకెళ్లటంతో కొడుకు, తండ్రి మృతి చెందిన సంఘటన బుధవారం తెల్లవారు జామున మైలార్‌దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ కథనం ప్రకారం మధ్యప్రదేశ్‌కు చెందిన ప్రభు మహారాజ్ (50) తన కొడుకులైన సాధునాద్ (22). దీపక్ (19)లతో కలిసి మైలార్ దేవ్‌పల్లిలోని దుర్గానగర్‌లో షెడ్ ఏర్పాటు చేసుకుని ఉంటున్నారు. చలికాలం సందర్భంగా స్వెటర్లు విక్రయించి రాత్రి వేళల్లో షెడ్‌లో ముగ్గురు పడుకుంటారు. కాగా ఎప్పటి మాదిరిగానే మంగళవారం రాత్రి ముగ్గురు షెడ్‌లో నిద్రిస్తున్నారు. కాగా హైదరాబాద్ పాతబస్తీ సంతోష్‌నగర్‌కు చెందిన విద్యార్థి సయ్యద్ హుస్సేన్ (19) అతని నలుగురు స్నేహితులు బౌన్సర్లుగా పని చేస్తున్నారు. బుధువారం వేకువ జామున ఇన్నోవా కారును సయ్యద్ హుస్సేన్ నడుపుతుండగా అతని నలుగురు స్నేహితులతో కలిసి కాటేదాన్ నుంచి దుర్గానగర్ వైపు వెళుతున్నారు. కారు అతి వేగంగా వెళ్తున్న సమయంలో అదుపు తప్పి ప్రభు మహారాజ్, అతని ఇద్దరు కొడుకులు నిద్రిస్తున్న షెడ్‌లోకి దూసుకెళ్లింది. ఈ సంఘటనలో తీవ్ర గాయాలపాలైన తండ్రి ప్రభుమహారాజ్ (50), చిన్నకుమారుడు దీపక్ (22)లు మృతి చెందారు. పెద్దకొడుకు సాధునాథ్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. తండ్రి, కొడుకుల మృత దేహాలను ఉస్మానియా మార్చురికి తరలించారు. ప్రమాదానికి కారుకుడైన కారు నడుపుతున్న విద్యార్థి సయ్యద్ హుస్సేన్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచా రిస్తున్నారు. ఈ కేసును మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## సర్పంచ్ ఎన్నికల్లో 'జగన్‌పై చంద్రబాబు' విజయం!

### భద్రాద్రి కొత్తగూడెం, గుండ్లరేవు గ్రామంలో ఆసక్తికర పరిణామం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,డిసెంబర్17:** తెలంగాణ రాష్ట్రంలో మూడో దశ పంచాయతీ ఎన్నికల్లో ఒక ఆసక్తికరమైన ఘటన చోటుచేసుకుంది. బుధవారం జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో ఒక గ్రామంలో చంద్రబాబు అనే పేరు కలిగిన వ్యక్తి, జగన్ అనే పేరు కలిగిన వ్యక్తిపై విజయం సాధించారు. ఈ ఆసక్తికర పరిణామం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలూరుపాడు మండలం, గుండ్లరేవు గ్రామంలో చోటు చేసుకుంది. గుండ్లరేవు గ్రామంలో మూడో దశలో సర్పంచ్ ఎన్నికలు జరిగాయి. భూక్యా చంద్రబాబు, బానోత్ జగన్నాథం అలియాస్ జగన్ ఇద్దరు వ్యక్తులు పోటీ చేశారు. ఇద్దరూ కాంగ్రెస్ పార్టీలోని రెండు వర్గాల మద్దతుతో బరిలో నిలిచారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయ నాయకుల పేర్లతో వీరి పేర్లు ఉండటంతో గ్రామంలో ప్రచారం కూడా ఆసక్తికరంగా జరిగింది. వారి ప్రచారం కూడా చంద్రబాబు, జగన్ పేర్లతోనే ఎక్కువగా సాగింది. బుధవారం జరిగిన పోలింగ్‌లో బానోత్ జగన్‌పై భూక్యా చంద్రబాబు విజయం సాధించారు. దీంతో జగన్‌పై చంద్రబాబు విజయం అంటూ సోషల్ మీడియాలో ఆసక్తికర పోస్టులు వెల్లువెత్తాయి.

## పంచాయతీ పోలింగ్ సరళిని ఎన్నికల కమిషనర్‌తో కలసి పరిశీలించిన సిఎస్,డిజిపి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,డిసెంబర్17:** రాష్ట్రంలో గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా బుధవారం మూడవ విడత పోలింగ్ సరళిని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డిజిపి శివధర్‌రెడ్డిలు రాష్ట్ర ఎన్నికల కార్యాలయంలో ఏర్పాటు చేసిన వెబ్‌కాస్టింగ్ ద్వారా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదినితో పాటు పరిశీలించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వెబ్ కాస్టింగ్ టెక్నాలజీని మరింత విరివిగా ఉపయోగించి ఎన్నికలను మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల్లో టెక్నాలజీ వాడటం వల్ల గ్రామాలలో శాంతిభద్రత సమస్య తగ్గుతుందని, దీని వలన ప్రజలలో ఎన్నికలపై నమ్మకం కలిగి పోలింగ్ శాతం పెరిగే అవకాశముంటుందని ఆయన పేర్కొన్నారు. మొదటి, రెండు దశలలో జరిగిన పోలింగ్‌తో పోలిస్తే మూడవ దశలో పోలింగ్ శాతం పెరిగే అవకాశముందని ఆయన తెలిపారు. ఎన్నికలను సజావుగా నిర్వహించినందుకు జిల్లా కలెక్టర్లను, అధికారులను, పోలింగ్‌సిబ్బందిని సిఎస్ అభినందించారు. కాగా గ్రామ పంచాయతీరాజ్ ఎన్నికలకు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ విస్తృత బందోబస్తును ఏర్పాటు చేసినట్లు డిజిపి శివధర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శి శ్రీధర్, పంచాయతీరాజ్ కమిషనర్ శ్రీజన, రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి మందా మకరందం తదితరులు పాల్గొన్నారు.

## బోడజానంపేటలో రెండు ఓట్లతో గెలుపు

### రీకౌంటింగ్ చేయాలంటూ ఆందోళన, పోలీసుల లాఠీచార్జ్

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 17 ప్రభాతవార్త:** రెండు ఓట్లతో సర్పంచ్ అభ్యర్థి గెలిచిన ఘటన మహబూబ్నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గం బాలానగర్ మండలంలోని బోడ జానంపేట లో గ్రామపంచాయతీలో చోటుచేసుకున్నది. గ్రామంలో మొత్తం 569ఓటర్లు ఉన్న గ్రామపంచాయతీలో బుధవారం మూడో దశ ఎన్నికలు జరిగాయి. ఇందులో భాగంగా బి.ఆర్.ఎస్ మద్దతుదారుడు రాజేందర్ ఠాగూర్‌కు 152 ఓట్లు రాగా, కాంగ్రెస్ మద్దతు దారుడు పొట్లపల్లి యాదయ్యకు 150 ఓట్లు వచ్చాయి. మూడో స్థానంలో స్వతంత్ర అభ్యర్థిగా 146ఓట్లతో నరసింహులు నిలిచారు. అయితే రెండు ఓట్ల తేడాతో విజయంసాధించడంతో సమీప అభ్యర్థి ఆందోళనకు దిగారు. రీకౌంటింగ్ చేయాలని పట్టుబట్టారు. దీంతో అధికారులు రీకౌంటింగ్ చేసినా ఫలితంలో ఎలాంటి మార్పు రాలేదు. అయినా ఈ విషయాన్ని గమనించకుండా కొంతమంది ఆందోళనకు దిగినట్లు స్థానికులు చెబుతున్నారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఆందోళనకారులను చెదరగొట్టడంతో పరిస్థితి సర్దుమణిగింది. లాఠిచార్జ్ చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. రెండుసార్లు రీకౌంటింగ్ చేసినా ఫలితంలో ఎలాంటి మార్పురాకపోవడంతో రాజేందర్ ఠాకూర్‌ను సర్పంచ్ గా గెలిచినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. అయితే పోలీసులు అర్ధరాత్రి వరకు పికేటింగ్ నిర్వహించారు.

## 500 మంది మహిళలకు ఉచిత రొమ్ముకేన్సర్ చికిత్స సోనూసూద్ ఉదారం



**ముంబయి,డిసెంబరు 17:** బాలీవుడ్ నటుడు, రియల్ హీరోగా పేరొందిన సోనూసూద్ మరోసారి తన గొప్ప మనసు చాటుకున్నారు. రొమ్ము క్యాన్సర్‌తో బాధపడుతున్న 500 మంది మహిళలకు చికిత్స చేయించారు. తన ఫౌండేషన్ ద్వారా ఈ చికిత్సలకు అయిన ఖర్చును భరించామని సోనూసూద్ తెలిపారు. ఇది ప్రారంభమేనని భవిష్యత్తులో ఇలాంటికార్యక్రమాలు మరిన్ని చేపడతామని వివరించారు. మహిళలకు రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించడంపైన మరింత దృష్టి సారించినట్లు సోనూసూద్ పేర్కొన్నారు. రొమ్ము క్యాన్సర్ బాధిత మహిళలు 500 మందిని మేం కాపాడగలిగాం. శస్త్రచికిత్సతో వారందరికీ కొత్త జీవితం లభించింది. 500కుటుంబాలలో ఆనందం నింపినందుకు సంతోషంగా ఉంది.

ఐడిబిఐ బ్యాంక్
CIN No. L65190MH2004GOI148838
ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్
రిజిస్టర్డ్ ఆఫీస్: ఐడిబిఐ టవర్, డబ్ల్యుటిసి కాంప్లెక్స్, కఫ్ పరేడ్, ముంబయి-400005.
టెండరు ప్రకటన
NIT No.03/ Admin & IMD/ Electrical contract Services / 2025-26
హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో గల IDBI సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ (ICBF)లో ఎలక్ట్రికల్ ఇన్‌స్టాలేషన్స్ యొక్క AMC సేవలకు టెండర్.
IDBI బ్యాంక్ లిమిటెడ్ యొక్క అత్యున్నత శిక్షణా కేంద్రమైన IDBI సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ (ICBF), హైదరాబాద్‌లో ఎలక్ట్రికల్ ఇన్‌స్టాలేషన్స్ యొక్క AMC సేవల కోసం సీల్డ్ టెండర్లను ఆహ్వానిస్తోంది. టెండర్ సమర్పించడానికి చివరి తేది: జనవరి 12, 2026 - 15:00 గం.ల వరకు (మ. 3:00 గం.లు)
వివరాల కొరకు బ్యాంక్ వెబ్‌సైట్: www.idbibank.in ను దర్శించండి.
గమనిక: పైన పేర్కొన్న టెండర్లకు సంబంధించి ఏవైనా తదుపరి అనుబంధాలు/ సవరణలు/ తేదీల పొడగింపు/ స్పష్టీకరణలు/ బిడ్డర్ల ప్రశ్నలకు ప్రతిస్పందనలు మొదలైనవి బ్యాంక్ వెబ్‌సైట్‌లో మాత్రమే పోస్ట్ చేయబడతాయి. ప్రెస్‌లో ప్రత్యేక నోటిఫికేషన్ జారీ చేయబడదు.
తేది: 18-12-2025 సం/- డిప్యూటీ జనరల్ మేనేజర్, అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్, ఐసిబిఎఫ్, హైదరాబాద్



వార్త

మీలో మార్పు రావడం అన్నది ఎంత కఠినమైన విషయమో తెలుసుకోండి. అప్పుడు ఇతరుల్ని మార్చడం అన్నది ఎంత కష్టమైనదో మీకు తెలిసొస్తుంది.

న-జాకబ్ బ్రౌడీ


# పొగమంచు కాటేసింది!

పొగమంచు పగమంచుగా మారి తెల్లవారు జామున ప్రమాదాలకు కారణమౌతోంది. శీతాకాలపు చలితోపాటు పొగమంచు కారణంగారాత్రి వేళ ప్రయాణం చేస్తున్న వాహనాలకు ముందు దారి కనపడటం లేదు. దారి మసక మసకగా మంచుతెరలు, పొగమంచు తెరలు అడ్డొచ్చి ప్రయాణం ఒక అడుగుకూడా ముందుకు సాగడం లేదు. దారిలో ఎదురుగా ఏవాహనం వస్తోందో ఎటువైపు నుంచి వస్తోందో కానరావడం లేదు. ముందు వాహనం ఉందో, ఆటో ఉందో సైకిలే ఉందో కనపడక డ్రైవర్లు ప్రమాదానికి చేరువవుతున్నారు. ఢిల్లీ పౌరులకు ఒకపక్క కాలుష్య సమస్యలుంటే నగరమంతా పొగ మంచుకు తోడు ఇతరత్రా సమస్యలు పీడిస్తున్నాయి. రాజధాని డేంజర్ జోన్‌గా మారిందన్న విషయం తెలిసిందే. ఇలాంటి సంక్లిష్టమైన వాతావరణం ఉత్తరాది రాష్ట్రాల్లోనే ఎక్కువగా ఉంది. యమునా ఎక్స్‌ప్రెస్‌వే ఓ యమపాశంగా మారి తాజాగా జరిగిన ప్రమాదంలో కనీసం 13 మంది మృతిచెందారు. ఆ రహదారిపై దట్టంగా అలుముకున్న కాలుష్యంతో కూడిన పొగమంచు మనుషుల ప్రాణాలను పొట్టన పెట్టుకున్న సందర్భాలు కనపడుతున్నాయి. మంగళవారం తెల్లవారుజామున 4.30 గంటల ప్రాంతంలో దారి కనపించక ఆగ్రా నోయిడా రహదారిపై ఎనిమిది బస్సులు, మూడు కార్లు ఢీకొన్నాయి. ధ్వంసమై ఆనవాళ్లు లేకుండాపోయాయి. ఈ ప్రమాదంలో ఆవాహనాలన్నీ ఒకేసారి వరుసగా ఢీ కొనడంతో 13 మంది అక్కడికక్కడే చనిపోయారు. గాయపడిన 43 మంది క్షతగాత్రులను స్థానికంగా ఉండే ఆసుపత్రులలో వైద్యానికి చేర్చారు. ఉత్తరప్రదేశ్‌లోని బల్‌దేవ్ పోలీస్ స్టేషన్ పరిధిలో రహదారిపై 127వ నెంబరు మైలురాయి వద్ద ఈ ప్రమాదం జరిగింది. ముందుగా రెండు వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. అటుపై వస్తున్న మరి కొన్ని వాహనాలు స్పీడుగా వచ్చి గుద్దుకున్నాయి. రోడ్డు విజిబిలిటీ ఒక మీటర్ వరకే ఉంది. ఢీ కొన్న వాహనాలన్నీ తుక్కుతుక్కయిపోయాయి. నుజ్జునుజ్జయిన వాహనాలు అగ్నికీలలకు గురై పనికిరాకుండాపోయాయి. గత 7ఏళ్లుగా ఎన్నడూలేని స్థాయికి పడిపోయిన ఉష్ణోగ్రతలే కాకుండా దట్టమైన పొగమంచు చుట్టేసుకుని ఆ ప్రాంతంలో వాహనాలను నిలిపివేసింది. దానికితోడు తీవ్రస్థాయిలో వాయుకాలుష్యం కూడా. ఇప్పటికే ఢిల్లీ వాయు నాణ్యత తీవ్ర ప్రమాదకరస్థాయికి చేరుకొంది. వాయు నాణ్యత సూచీ గణనీయంగా పడిపోయింది. ఢిల్లీ ఆనంద్ విహార్ ప్రాంతంలో ఏక్యూఐ 493 మాత్రమే ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో పొగమంచు మరింత ప్రమాదకరమే. పొగమంచు కారణంగా జరిగే ప్రమాదమైనా తీవ్రమే. ముందు వాహనం ఆగిన ఆచూకీ తెలియక వెనుక స్పీడుగా వచ్చే వాహనం సడెన్ బ్రేక్ వేయడమూ కష్టమే. అందుచేతనే మొన్న జరిగిన ప్రమాద తీవ్రత అలాఉంది. ఇలా ఒకటికి మించి వాహనాలు వరుసబెట్టి ఢీ కొట్టుకుంటే మంటలు చెలరేగుతాయి. ఆ వాహనాల్లో ప్రయాణికులు ఉండి ఏమాత్రం మంటలు అంటుకున్నా సజీవ దహనం అయ్యేవారే. అదృష్టవశాతూ ప్రమాదస్థాయి అంత వరకే పరిమితమైంది. వాళ్లంతా ఇలాంటి పొగమంచు ప్రమాదం ఊహించక, చలికి జాగ్రత్తలు తీసుకుని మఫ్లర్లు, స్వెటర్లు, ధరించిఉన్నా ఇలాంటి ప్రమాదాలుజరుగకుండా, పొగమంచు చలిగాలులు ఎక్కువగా ఉన్నచోట రాత్రిపూట ప్రయాణాలు లేకుండా ఆ రహదారుల్లో నిషేధం విధించడం మంచిది. ఇలాంటి సందర్భాల్లో మంటలకు ఆహుతైన వారి మృతదేహాలను గుర్తించేందుకు మళ్లీ డిఎన్ఎ నమూనాల పద్ధతి అనుసరించాల్సిందే. క్షతగాత్రుల్లో కూడా కొంతమంది చికిత్స సమయంలో మృతిచెందారు. సంతాపాలు, దిగ్భ్రాంతులు, విచారాలు, పరిహారాలు కన్నా ప్రమాదాలు జరుగకుండా చూడడం ముఖ్యం. రాత్రి ప్రయాణాల మీద ఏమాత్రం అవగాహన ఉన్నా మరిన్ని జాగ్రత్తలు తీసుకునే వీలుంది. ఉత్తరాదికి చలిగాలులు, కాలుష్యం, పొగమంచు శాపంలా పరిణమించాయి. ఇతర ప్రాంతాల్లోనూ కొన్ని సమస్యలవల్ల ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయి. రోజుకో అతిపెద్ద ప్రమాదం వాటిల్లి ఎక్కువ మంది ప్రయాణికులను బలితీసుకుంటున్న విషయం విదితమే. ఢిల్లీలో కాలుష్యం కొరకరాని కొయ్యగా మారింది. ఎంతకూ దానిని రూపుమాపే మార్గాలు కనిపించడం లేదు. ఈ అంశంపై ఇటీవల పార్లమెంట్ ప్రాంగణంలో విపక్షాలు నిరసన ప్రదర్శన కూడా నిర్వహించాయి. పసికందులు కాలుష్యానికి బలైపోతున్నారని, వృద్ధులుకాలుష్య కారణంగా మరింత వృద్ధాప్యబాధలకు, ముఖ్యంగా శ్వాసకోశ సమస్యలకుగురై ఆస్పత్రుల పాలవుతున్నారని గగ్గోలు పెట్టారు. అంతకుముందే సుప్రీంకోర్టు కూడా ఢిల్లీకాలుష్యం అంశంపై ఓ స్థిర నిర్ణయానికి వచ్చింది. అందరూ అనుకున్నట్లు కాలుష్య పాపాన్ని ఆ ప్రాంత రైతుల మీద నెట్టి వేయరాదని గట్టిగా చెప్పింది. అదే పరిష్కారమైతే గతంలో కన్నా పంటకాలుష్య వ్యర్థాలు మండించడం తగ్గింది. కానీ ఢిల్లీ కాలుష్యస్థాయి ఏమాత్రం తగ్గలేదని అభిప్రాయపడింది. మొన్నటి పొగమంచు కారణంగా ఢిల్లీ విమానాశ్రయంలో 200 విమానాలు రద్దయ్యాయి. పంట వ్యర్థాల దగ్ధం చేయవద్దని ప్రభుత్వాలు రైతుల మీద జరిమానాలు వేసి తీవ్ర కార్యా చరణ చేపట్టడంతో అలాంటి చర్యలు బాగా తగ్గిపోయాయి. మహా ఉంటే కేవలం ఐదు శాతం మాత్రమే ఉండొచ్చునని కాలుష్య నివారణ సంస్థలు తేల్చి చెప్పాయి. కేంద్ర ప్రభుత్వం కూడా అంగీకరించింది. యమునా నదికాలుష్య విషయంపై ఎంతో ఆశపెట్టుకున్న కేంద్రం ఢిల్లీ కాలుష్యం గురించి ప్రత్యేక శ్రద్ధ ప్రణాళికలతో కార్యాచరణ చేపట్టాల్సిన ఆవశ్యకత ఉంది.



మానవ నాగరికతను చాలా వరకు ప్రభావితం చేసేది ఉత్తమ మహిళలే!

ఎమర్సన్



మనం తలపెట్టిన కార్యం మంచిదనే నమ్మకం మన కున్నప్పుడు అవాంతరాలెన్ని ఎదురైనప్పటికీ పట్టించుకోరాదు.

ఫిలప్ మాసింగర్

## ప్రజావాక్కు



### డిజిటల్ భద్రతకు ముందడుగు

డిజిటల్ యుగంలో మొబైల్ ఫోన్లు మన జీవితంలో విడదీయరాని భాగంగా మారాయి. అయితే, అదే సమయంలో మొబైల్ మోసాలు, నకిలీ సిమ్‌లు, గుర్తు తెలియని కాల్స్ వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యలకు సమాధానంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంచార్ సాతి యాప్ ప్రజల డిజిటల్ భద్రతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తోంది. సంచార్ సాతి యాప్‌ను టెలికాం విభాగం రూపొందించింది. ఈ యాప్ ద్వారా వినియోగదారులు తమ పేరు మీద ఎన్ని మొబైల్ కనెక్షన్లు ఉన్నాయో తెలుసుకోవచ్చు. చాలా సందర్భాల్లో వ్యక్తికి తెలియకుండానే అతని గుర్తింపు పత్రాలతో సిమ్ కార్డులు తీసుకుని అక్రమ కార్యకలాపాలకు ఉపయోగిస్తారు. అలాంటిసందర్భాల్లో ఈయాప్‌ఎంతో ఉపయోగకరం.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### గంజాయి సరఫరా

దేశంలో చట్టాలు కఠినమవుతున్నాయన్న భావన ఉన్నప్పటికీ, గంజాయి సరఫరా మాత్రం అడ్డుకట్టలేకుండా విస్తరిస్తోంది. పట్టణాల నుండి పల్లెల వరకు ఈ నిషేధిత మత్తు బారినపడుతున్నది ముఖ్యంగా యువత. ఇది చట్ట సంబంధ సమస్య మాత్రమేకాదు సమాజంపై పాకుతున్న మహమ్మారి. సరిహద్దు రాష్ట్రాల నుండి భారీగా రహస్య రవాణా, పట్టణాల్లో చిన్న నెట్‌వర్క్‌ల ద్వారా విక్రయం ఇవన్నీ సంఘటిత నేర వ్యవస్థగా మారాయి. అరెస్టులు జరిగినప్పటికీ, డిమాండ్ పెరగడం వల్ల ఈ వ్యాపారం ఆగట్లేదు. నిరుద్యోగం, ఒత్తిడి, దారితప్పిన వినోదం యువతను మత్తు వైపు నెడుతున్నాయి. క్షణిక సంతోషం కోసం మొదలైన అలవాటు త్వరలోనే బానిసత్వంగా మారి ఆరోగ్యం, కుటుంబం, భవిష్యత్తును ధ్వంసం చేస్తుంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### ప్రతిభను ప్రోత్సహించాలి

తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివిపైకి రావాలని ఆశించడం సహజమైనప్పటికీ వారికి ఏరంగంలో ఆసక్తి గలదో తెలుసుకోవాల్సిన అవసరంఉంది. అందుకు ఉపాధ్యాయులు విలువగలవిద్యను అందించి విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలి పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ విద్యార్థుల భవిష్యత్‌కు కీలకం కావాలి.

- ఆర్.వెంకటేష్ చరన్, బెంగళూరు

### ఉపాధికి హామీ లేని పథకం

రెండుదశాబ్దాలుగా దేశంలో గ్రామీణప్రాంతాల్లో ఉపాధికి హామీ ఇచ్చిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం తన పేరు, రూపు మార్చుకోబోతోంది. ఆ దిశగా ప్రవేశపెట్టబడే బిల్లుని కేంద్రం పార్లమెంట్ సభ్యులకు సర్క్యులేట్ చేసింది. ఈ బిల్లులో ప్రతిపాదనలు ఇంతవరకూ ఉన్న హామీని నీరుకార్చేవిగా కనబడుతున్నాయి. వంద రోజుల పని దినాలకు బదులుగా 125రోజులు పనికల్పిస్తామని చెప్పడం ఒక్కటేబాగుంది. మిగతా సవరణలు వికసిత భారతం సాధించే దిశగా గత రూపం కన్నా ఎలా మెరుగైనవో పాలకుల నుండి విని తెలుసుకోవాల్సి ఉంది. చేస్తున్న పెద్ద మార్పు ఈ పథకాన్ని డిమాండ్ ఆధారితం కాకుండా సరఫరా ఆధారితం చెయ్యడం. అంటే ఇప్పటిలా మా ఊరికి ఈ పని, ఇంతమందికి ఉపాధి కల్పిస్తూ, ఇన్ని రోజులకు అవసరం అని చెప్తే కేంద్రం మంజూరు చెయ్యడం కాదు. కేంద్రం ఇచ్చిన బడ్జెట్ మేరకు, కేంద్రమే గుర్తించిన ప్రాంతంలో ఆ ఫలానా పని పూర్తి మాత్రమే అయ్యేలా చూడడం.

- డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

### ఏకపక్ష నిర్ణయాలు

ప్రజాస్వామిక చరిత్రలో అతిపెద్దతప్పిదానికి కేంద్రం తలుపులు బార్లా తెరుస్తోందా అంటే అవుననే సమాధానమే వస్తుంది. ఉపాధిహామీ చట్టం రద్దు చేసి దానిస్థానంలో తెచ్చే పథకం వల్ల ఉపయోగం ఏమిటి? దానిస్థానంలో తెచ్చే పథకం ముఖ్య ఉద్దేశంఏమిటి అనేది కనీసం చర్చకూడా జరగకుండా చేయడం కేంద్రం ఏకపక్ష పోకడలకు గుర్తుగా చూడొచ్చు. అయితే ఎంతో ఉదాత్త ఆశయాలతో తీసుకొచ్చిన ఈపతకం ఆశయాల్ని గొంతు నులిమినట్టు చేసి దానిఉనికి ప్రమాదంలో పడేట్టు చేస్తున్నారు.

-భారత అవినాష్, జనగామ

### డిజిటల్ భద్రతకు ముందడుగు

డిజిటల్ యుగంలో మొబైల్ ఫోన్లు మన జీవితంలో విడదీయరాని భాగంగా మారాయి. అయితే, అదే సమయంలో మొబైల్ మోసాలు, నకిలీ సిమ్‌లు, గుర్తు తెలియని కాల్స్ వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈసమస్యలకు సమాధానంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంచార్ సాతి యాప్ ప్రజల డిజిటల్‌భద్రతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తోంది. సంచార్ సాతి యాప్‌ను టెలికాం విభాగం రూపొందించింది. ఈయాప్ ద్వారా వినియోగదారులు తమ పేరు మీద ఎన్ని మొబైల్ కనెక్షన్లు ఉన్నాయో తెలుసుకోవచ్చు.

- ఎం. సురేష్, నాగర్ కర్నూల్ జిల్లా

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

# 'బోండి బీచ్' అలజడితో మరింత అశాంతి!

**అమెరికా పెద్దన్న పాత్ర పోషిస్తూ రాజకీయంగా, ఆర్థికంగా లబ్ధి పొందాలనుకోవడం కూడా ఉద్రిక్తతలను పెంచుతున్నాయని కొందరి వాదన. కొత్తగా బంగ్లాదేశ్ అఫ్ఘాన్ దేశాలు అస్థిర పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. తాలిబన్లు ఇదివరకటి దుందుడుకు నడవడికను ప్రభుత్వం హస్తగతమవటంతో తగ్గించుకున్నా పాకిస్థాన్ అఫ్ఘాన్ రాజకీయ ఎత్తుగడలతో ఏకీభవించడం లేదు. భారతదేశానికి వ్యతిరేకంగా ఉగ్రవాదాన్ని తాలిబన్ల సహాయంతో నడిపించడానికి గండిపడటంతోపాటు అంతంత మాత్రంగా ఉన్న ప్రజాస్వామ్య పాలన మిలటరీ చేతుల్లోకి పరోక్షంగా వెళ్లడంతో ప్రజల దృష్టిని మళ్లించడానికి భారత్‌తో గొడవలు పెట్టుకొనే ఆస్కారం ఉంది. చైనా ఎలాంటి పాత్ర పోషిస్తుందో ఇరుగు, పొరుగు దేశాలు ఏ విధంగా వ్యవహరిస్తాయో భారత్ ఒక కంట కనిపెట్టి ఉండక తప్పదు.**



రావులపాటి సీతారాం రావు

సిడ్నీలోని బొండీబీచ్‌లో జరిగిన దారుణ మారణహోమంలో దాదాపు పదహారు మంది మరణించారు. మరో 60 మందికి గాయాలు అయ్యాయి. ఈ దుర్ఘటన ఈ నెల 14న జరిగింది. పది సంవత్సరాల బాలిక, 87ఏళ్ల వృద్ధుడు ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయారు. హనుక్కా ప్రారంభ దినోత్సవం సందర్భంగా యూదు జాతికి చెందిన వారిపై యాంటీ జ్యూయిష్ వారు చేసిన దాడి యిది. ఇందులో ఇద్దరు తండ్రీ కొడుకులు పాల్గొన్నారు. తండ్రిని అక్కడికక్కడే పోలీసులు చంపేశారు. గాయాలతో బయటపడిన కొడుకును హాస్పిటల్‌లో చేర్చారు. ఇతను ఆరు నెలల నుంచి ఆస్ట్రేలియా పోలీసుల డొమెస్టిక్ ఇంటలిజెన్స్ వారిదర్యాప్తులో ఉన్నాడు. అయినా ఈ భయంకర సంఘటన దాదాపు కాశ్మీరులోని పహల్గాం సంఘటన తరహాలోనే జరగడం దురదృష్టకరం. యాంటీ సెమిటిక్ పేరుతో ఈ ఘటనలు ముఖ్యంగా ఎక్కువ సంఖ్యలో ఆస్ట్రేలియాలో నివసిస్తున్న యూదుమతస్థుల మీద జరుగుతున్నాయి. 1996 సంవత్సరంలో టాస్మానియా పోర్ట్ ఆర్థర్‌లో జరిగిన సంఘటనలో 35 మంది ప్రాణాలు కోల్పోవటంఈ సందర్భంగా జ్ఞప్తికి తెచ్చుకోక తప్పదు. ఈ మధ్యకాలంలో జ్యూయిష్ వారి మీద తరచూ ఇలాంటి దాడులు జరగటం, ఆస్ట్రేలియాలో ఇలాంటి ఘటనల వెనుక ఇరాన్ హస్తం ఉందనే అనుమానంతో ఇరానియన్ రాయబారితోసహా మరో ముగ్గురిని దేశం నుంచి బయటకు పంపారు. అక్టోబరు 27, 2023 హమాస్ టెర్రరిస్టు సంస్థ ఇజ్రాయిల్‌పై దాడులు తర్వాత, గాజా పాలస్తీనుల మీద సంఘటనలు 2023-24 మధ్య 2000 కేసులు దాకా రిపోర్టు అయ్యాయి. యాంటీ సెమిటిజం వారి తరపున పోరాడుతున్న వారు ఇచ్చిన సంఖ్యే ఇది. ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్ ఈ దుర్ఘటన నేపథ్యంలో సమైక్యంగా ఉండాలని ప్రజలను ఉద్దేశించి ప్రకటన చేయడం గమనార్హం. ఈ తరహా జాతి వ్యతిరేక ఘటనలు ఆస్ట్రేలియాలో ఎక్కువ సంఖ్యలోయూదు జాతివారు ఉండటం వల్ల జరుగుతుండటంతో ఆ దేశానికి పెద్ద సమస్యగా మారింది. ఇజ్రాయిల్ ప్రధాని ఆస్ట్రేలియా ప్రధాని పాలసీల వల్లనే ఈ జాతి పట్ల వ్యతిరేక ఘటనలు జరుగుతున్నాయని విమర్శించటం హమాస్ సంస్థదాడులు, ఇజ్రాయిల్ ప్రతిదాడుల తర్వాత ఈ విమర్శ విడ్డూరంగా ఉందని పశ్చిమ దేశాల నిపుణులు భావిస్తున్నారు. ఆస్ట్రేలియా ప్రధాని విమర్శలు ప్రతి విమర్శలు పట్టించుకోకుండా, అక్కడున్న యూదు జాతిని సంరక్షించాల్సిన బాధ్యత తీసుకోక తప్పదు. లోకల్ సమస్యలు గ్లోబల్ సమస్యలుగా మారుతున్నాయి. దాదాపు అన్ని ముఖ్య దేశాల్లో జాతుల పరస్పర వ్యతిరేక చర్యలు పెరగడం గమనిస్తున్నవారు జాతుల వ్యతిరేక, అనాగరిక చర్యలను గర్హిస్తున్నారు. రాజకీయ నాయకులు తమ స్వలాభం కోసం ఇలాంటి హింసాకాండను రెచ్చగొడుతున్నారని కూడా భావిస్తున్నారు. ఇజ్రాయిల్, గాజా ప్రాంతంలోని పాలస్తీనియన్ల, కాశ్మీర్‌లో హిందువులపై పాకిస్థాన్ ప్రోత్సాహంతో ఉగ్రవాదం చర్యలూ బంగ్లాదేశ్, అఫ్ఘానిస్థాన్‌లలో జరుగుతున్న సంఘటనలన్నిటికీ రాజకీయ, ఆర్థిక కారణాలే అని నిపుణుల భావన. ఇలాంటి ఘోర సంఘట నల మధ్య కూడా మానవత్వం ఎక్కడో ఒక చోట తళుక్కు న మెరవక మానదు. యూదులపై సిడ్నీలో



జరిగిన దాడి యావత్ప్రపంచాన్ని కుదిపేసింది. కానీ నేను న్నాను ఉగ్రవా దులకు ఎదురొడ్డి బాధితులను కాపాడటానికి అంటూ ఒక హీరో అడ్డుగోడగానిల్చి చరిత్ర సృష్టించాడు. ఉగ్రవాదులను దాడిని ఎదుర్కొంటూ నేను చనిపోవచ్చు, నా కుటుంబానికి తెలియచేయండి, అని అన్నమాటలు అక్కడి వారి గుండెల ను కలిచివేశాయి. ఆ హీరో పేరు అహ్మద్ అల్ అహ్మద్! అహ్మద్ సిరియా నుంచి దశాబ్దం క్రితం ఆస్ట్రేలియాకు బతుకు తెరువు నిమిత్తం వచ్చాడు. స్థానికంగా పండ్ల దుకా ణం పెట్టి జీవితాన్ని సాగిస్తున్నాడు. ఉగ్రదాడి నాడుఅహ్మద్ బోండి బీచ్‌లో తన బంధువు దోజీ అల్కాండ్‌తో కలిసి కాఫీ షాపులో ఉన్నాడు. కాల్పుల శబ్దాల తర్వాత అహ్మద్ తేరు కొని ఉగ్రవాదులను ఎలాగైనా అడ్డుకోవాలని తన ప్రాణాలు పోయినా పర్వాలేదు అనుకొని ముందడుగు వేశాడు. నేను ఎదుర్కోవటంలో చనిపోతే ఇతరుల ప్రాణాలు రక్షించడానికి నేను నేలకొరిగాను అని నా కుటుంబానికి చెప్పు అని తన బంధువుతో చెప్పి, కాల్పులు జరుపుతున్న దుండగుడిని అడ్డుకున్నాడు. దీంతో దుండగుడు పారిపోవటంతో ఎందరి ప్రాణాలనో కాపాడగలిగాడు. అడ్డుకుంటున్న సమయంలో అహ్మద్‌గాయపడ్డాడు. కాల్పులు జరిపిన ఇద్దరు దుండ గులలో ఒకనికి సాజిత్ అక్రమ్ (తండ్రి) ఇండియన్ పాస్ పోర్టుతో ఫిలిప్పీన్స్‌కు నవంబరు 1 నాడు కొడుకు నవీన్ (ఇతనికి ఆస్ట్రేలియన్ పాస్‌పోర్టే ఉంది)తో వెళ్లి 28 నవంబరు నాడు తిరిగి వచ్చాడు. ఫిలిప్పీన్స్ మిలటరీ ట్రయినింగ్ కోసం వెళ్లినట్లు ధ్రువపడలేదు. ఫిలిప్పీన్స్‌లో ఇస్లామిక్‌స్టేట్ గ్రూపుతో సంబంధమున్న మిలిటెంట్లు దాడిచేశారని ఆస్ట్రేలియా ప్రధాని ప్రకటించారు. ఈ మధ్య జరుగుతున్న సంఘటనలు ముఖ్యంగా యూదులపై పెరుగుతున్న దాడుల నేపథ్యంలో ఆస్ట్రేలియా ప్రభుత్వం గన్ కంట్రోల్‌ను పటిష్టం చేసింది. పోర్ట్ ఆర్థర్ ఉదంతం తర్వాత గన్ కంట్రోల్ విషయంలో చట్టాలు కూడా రూపొందించారు. కఠినమైన లైసెన్సింగ్ విధానాన్ని కూడా పాటిస్తున్నారు. అయితే ఈబోండీ బీచ్ దాడి తర్వాత గన్ సేఫ్టీ విషయంలో ఆస్ట్రేలియాలో అనేక సందేహాలు తలెత్తుతున్నాయి. ఇప్పుడు ఆస్ట్రేలియా చేయాల్సింది ఒకటే. మరింత కఠినతరంగా ఇలాంటి ఘటనలు జరుగకుండా చర్యలు తీసుకోవడంతోపాటు సైద్ధాంతిక ముసుగులో జరిగేలా దాడులను ఆపేందుకు పటిష్టమైన నిఘా వ్యవస్థతోపాటు దుండగులను ఏరిపారేసి కఠినంగా శిక్షించినప్పుడే ఎక్కువ సంఖ్యలో ఈ దేశంలో ఉన్నయూదులకు ఊరట లభిస్తుంది. కానీ కొన్ని దేశాలు కచ్చితంగా ఇలాంటి ఘటనలు సంభవించినప్పుడల్లా మరిం తగా అలజడులతోపాటు అంతర్జాతీయ సమస్యగా మార్చే ఎత్తుగడలు రాజకీయం చేస్తాయి. ఇజ్రాయిల్ ఇప్పటికీ హమాస్ సంస్థతోపాటు ఇస్లామిక్ దేశాలు ముఖ్యంగాఇరాన్, టర్కీలను వేలెత్తి చూపుతున్నది. ఇరాన్ నిస్సందేహంగా మిలిటెంట్లకు సహకార సంపత్తులు ఇస్తున్నదని దర్యాప్తు సంస్థలు చెబుతున్నాయి. ఇప్పుడిప్పుడే చల్లబడుతున్న ఇజ్రాయిల్, రష్యా, ఉక్రెయిన్ దేశాలు మళ్లీ బరిలోకి దిగి ఏం చేస్తాయో అన్న భయాలు తలెత్తున్నాయి. అమెరికా పెద్దన్న పాత్ర పోషిస్తూ రాజకీయంగా, ఆర్థికంగా లబ్ధి పొందాలనుకోవడం కూడా ఉద్రిక్తతలను పెంచుతున్నాయని కొందరి వాదన. కొత్తగా బంగ్లాదేశ్ అఫ్ఘాన్ దేశాలు అస్థిర పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. తాలిబన్లు ఇదివరకటి దుందుడుకు నడవడికను ప్రభుత్వం హస్తగతమవటంతో తగ్గించుకున్నా పాకిస్థాన్ అఫ్ఘాన్ రాజకీయ ఎత్తుగడలతో ఏకీభవించడం లేదు. భారతదేశానికి వ్యతిరేకంగా ఉగ్రవాదాన్ని తాలిబన్ల సహాయంతో నడిపించడానికి గండిపడటం తోపాటు అంతంత మాత్రంగా ఉన్న ప్రజాస్వామ్య పాలన మిలటరీ చేతుల్లోకి పరోక్షంగా వెళ్లడంతో ప్రజల దృష్టిని మళ్లించడానికి భారత్‌తో గొడవలు పెట్టుకొనే ఆస్కారం ఉంది. చైనా ఎలాంటి పాత్ర పోషిస్తుందో ఇరుగు, పొరుగు దేశాలు ఏ విధంగా వ్యవహరిస్తాయో భారత్ ఒక కంట కనిపెట్టి ఉండక తప్పదు. ●

# వలసదారుల హక్కులను పరిరక్షించాలి

రామ కిష్టయ్య సంగన భట్ల

ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు వివిధ కారణాల వల్ల వలస వెళ్తుంటారు. ఈ వలసలు వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి గానీ, జీవితాన్ని కాపాడుకోవడానికి గానీ జరుగుతుంటాయి. ఇలాంటి వలసదారుల హక్కులను గుర్తించడం, వారి కష్టాలను అర్థం చేసుకోవడం, వారికి సహాయం చేయడం కోసం అంతర్జాతీయ వలసదారుల దినోత్సవం ప్రతి సంవత్సరండిసెంబర్ 18న జరుపుకుంటారు. డిసెంబర్ 18ను అంతర్జాతీయ వలసదారుల దినోత్సవంగా 2000లో ఐక్యరాజ్యసమితి ప్రధాన అసెంబ్లీ ప్రకటించింది. 1990లో ఇదే తేదీన అంతర్జాతీయ వలసదారుల హక్కుల పరిరక్షణకు సంబంధించిన కన్వెన్షన్ ఆమోదించబడింది. ఈ నేపథ్యంతో వలసదారుల హక్కులను, వారితో ఉన్న సమస్యలను చర్చించేందుకు ఈ రోజు గుర్తింపును పొందింది. తక్కువ ఉపాధి అవకాశాలు, దారిద్ర్యం వలన వేలాది మంది మెరుగైన జీవనోపాధి కోసం వలస వెళ్లాల్సి వస్తుంది. వాతావరణ మార్పులు, ప్రకృతి వైపరీత్యాలు (ఎడతెరిపి లేని వరదలు, కరువులు, అగ్నిపాతాలు) ప్రజలను వలసలకు బలవంతం చేస్తాయి. కొంతమంది జీవితం కోసం శరణార్థులుగా వలస వెళ్తే, మరికొందరు భద్రత కోసం కొత్త ప్రాంతాలను ఆశ్రయిస్తారు. అంతర్జాతీయ స్థాయిలో మెరుగైన విద్య, నైపుణ్యాభివృద్ధి కోసం యువత వలసలు చెయ్యటం సర్వసాధారణం. వలసదారులు వారి కృషితో అతిథి దేశాలకు ఆర్థికంగా విశేష ప్రయోజనం కలిగిస్తారు. రెమిటెన్సుల రూపంలో స్వదేశాలకు పెద్ద మొత్తంలో ఆర్థిక మద్దతును అందిస్తారు. వారి సాంస్కృతిక సంపదతో కొత్త ప్రాంతాలను సుసంపన్నం చేస్తారు. సంగీతం, భాష, ఆహారపు అలవాట్లు వంటి అంశాల్లో కొత్త మార్పులను తీసుకురావడంలో వీరు కీలక పాత్ర పోషిస్తారు. వలసదారులు వారి




మేధస్సు, సాంకేతిక నైపుణ్యాలను అతిథి దేశాలకు అందించడంతో పాటు స్థానిక సమాజ అభివృద్ధికి తోడ్పడతారు. వలస దారులు తరచూ వివక్షకు గురవుతుంటారు. తక్కువ వేతనాలు, నిస్సహాయ పరిస్థితులు, చట్టపరమైన రక్షణల లోపం కారణంగా వారు తీవ్ర కష్టాలను అనుభవిస్తున్నారు. భాషా, ధార్మిక భిన్నత్వాలు వలసదారులను ఒంటరితనానికి గురిచేస్తాయి. అనేక దేశాలు వలసదారుల హక్కులను పరిగణలోకి తీసుకోవడం లేదా వారి అవసరాలను సరైన విధంగా సమర్థించడం లేదని విమర్శలు వస్తున్నాయి. కొన్ని సార్లు వలస దారులు స్థిరమైన ఉపాధి లేకుండా ఆర్థిక అనిశ్చితిలో చిక్కుకుపోతున్నారు. భారతదేశం ప్రాచీన కాలం నుండి వలసదారులను స్వీకరించే సంప్రదాయాన్ని కలిగి ఉంది. ఉపాధి కోసం కార్మిక వలసలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా గల్ఫ్ దేశాలకు వలసపోయే భారతీయుల సంఖ్య గణనీయంగా ఉంది. వీరు భారతీయ ఆర్థిక వ్యవస్థకు ముఖ్యమైన విదేశీ మారక ద్రవ్యాన్ని తెస్తున్నారు. తమిళనాడు, పశ్చిమ బెంగాల్, అరుణాచల ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో వివిధ ప్రాంతాలనుండి వచ్చిన శరణార్థులుభారత ప్రభుత్వం ద్వారా మద్దతు పొందుతున్నారు. వలసదారుల కష్టాలను సమాజం గుర్తించడం, వారిపై ఉన్న అపనమ్మకాల్ని తొలగించడం ఈదినోత్సవం ప్రధాన లక్ష్యం. వలసదారు ల రక్షణ, హక్కులకోసం అంతర్జాతీయ స్థాయిలో పటిష్ఠ మైన విధానాలను రూపొందించేందుకు ఇది ప్రేరణగా పని చేస్తుంది. వలసదారులు స్థానిక సమాజంలో సమగ్ర పరచ బడేందుకు అవసరమైన చర్యలను ప్రోత్సహించడానికి ఈ రోజు దోహదపడుతుంది. వలసదారులు ప్రపంచ ఆర్థిక, సాం స్కృతిక, సామాజికరంగాలకు ఎంతగానో తోడ్పడుతున్నారు. వారి కృషిని గౌరవించడం మన కర్తవ్యం. అంతర్జాతీయ వలసదారుల దినోత్సవం ఈ అంశంపై మరింత అవగాహన కలిగించి, వారి హక్కులకు శ్రద్ధ వహించే దిశగా సమాజాన్ని ప్రోత్సహిస్తుంది. వలసదారులను అర్థంచేసుకుని, వారికి సహా

# ఉద్యోగ కల్పనలో వెనుకబడుతున్నామా?

డాక్టర్ ఎనుగొండ నాగరాజ నాయుడు

ఒక ఆటవిక సమాజంలో వేటే వృత్తి అయినందువలన వేటాడిన జంతువును సమానంగా పంచుకునేవారు ఆ తర్వాత వచ్చిన బానిస వ్యవస్థలో బానిసలను దోపిడీ చేయడం, తరువాత వచ్చిన భూస్వామ్య వ్యవస్థలో రైతులదోపిడీ, ఇప్పుడున్న పెట్టుబడిదారీవ్యవస్థలో శ్రామికుల దోపిడీ, పెట్టుబడిదారులను తప్ప ఇంకెవరిని బాగుపడనీయని పరిస్థితి. ఉద్యోగ కల్పనలేని ఉత్పత్తులను చేసి మిలియనీర్లు బిలియనీర్లు అయిపోతూ దేశ సంపదను తమ గుప్పెట్లో పెట్టుకుని ప్రిడేటరీ గ్రోత్‌ను కొనసాగిస్తూ ఎల్లప్పుడూ దేశంలో నిరుద్యోగ సమస్యతో యువత, అప్పుల ఊబిలో ప్రభుత్వాలు కూరుకుపోతున్నాయి. మన దేశంతోపాటు స్వాతంత్ర్యం సంపాదించుకున్న చైనాలో ప్రభుత్వ నియంత్రణలో పెట్టుబడిదారులు ఉన్నందువలన ప్రపంచంలో 80 దేశాలకు అప్పులు ఇవ్వగలిగింది. పెట్టుబడిదారులను నియంత్రించిన చైనాలో ప్రిడేటరీ గ్రోత్ కనిపించదు. ఉద్యోగ సమస్యను తీర్చుతూ సంతులిత సమ్మిళిత ఆర్థిక అభివృద్ధిని సాధించగలిగింది. మన దేశం కూడా 2023 నాటికి చైనా నుండి 11.1 బిలియన్ డాలర్లు అప్పుగా తీసుకున్నది. అయితే చైనా మాత్రం అనేక దేశాలకు అప్పులిస్తుంటే మన దేశం మాత్రం అప్పుల ఊబిలో కూరుకుపోయింది. 2015లో దేశ విదేశీ అప్పులు 56లక్షల కోట్ల రూపాయలు అయితే 2024 నాటికి 185.94 లక్షల కోట్ల రూపాయలకు పెరిగింది. 10 ఏళ్లలో విదేశీ అప్పు రెట్టింపు అయింది. సగటు భారతీయుని తలసరి అప్పు 1.27 లక్ష వరకు ఉన్నది. ఈ నేపథ్యంలో మన నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలో పెరిగిన జీడీపీ ఎవరిది? దేశంలో రావలసిన పన్నులు కార్పొరేట్లకు రాయితీల రూపంలో వదులుకోవడంవలన ప్రభుత్వం అప్పు చేయవలసి వస్తున్నది. కార్పొరేట్లకు పన్ను రాయితీలో ఎన్‌డిఏ వన్ హయాంలో 4.3 లక్షల కోట్ల రూపాయలు. 2019-21 మధ్యన 1.85 లక్షల కోట్ల రూపాయలు పన్నుల ఆదాయాలు ప్రభుత్వానికి తగ్గిపోయాయి. ఇలా ప్రభుత్వ ఆదాయాలు తగ్గిపోవడం వలన అప్పులపై ఆధారపడే పరిస్థితి ఏర్పడింది. మరోవైపు ప్రజలు ద్రవ్యోల్బణానికి గురై జీవన ప్రమాణాన్ని కోల్పోతుండగా ఉపాధి కల్పనకు చేసే ప్రభుత్వ వ్యయం గణనీయంగా పడిపోతున్నది. ఉదాహరణకు 27 కోట్ల మందికి ఉపాధి కల్పిస్తున్న మహాత్మా గాంధీ రూరల్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ ప్రోగ్రాం కింద 2024-25 సంవత్సరానికి 86 వేల కోట్ల రూపాయలు మాత్రమే బడ్జెట్లో కేటాయించడం జరిగింది. పేదలను కూలీలను ఒకరకంగా ధనికులను మరొక రకంగా చూస్తున్న ప్రభుత్వం ఓట్ల కోసం ఉచితాలను కల్పిస్తూ ఉపాధి కల్పన లేకుండా చేస్తున్నది. 1980లో జాతీయ ఆదాయంలో పెట్టుబడి శ్రామిక వాటా నిష్పత్తి 75 శాతం ఉండగా 2024 నాటికి 29 శాతానికి



పడిపోయింది. ఫలితంగా ప్రజల్లో ఆదాయాలు లేక కొనుగోలు శక్తి లేక వినియోగం తగ్గిపోయి ప్రపంచ దేశాలలో మానవాభివృద్ధిలో అత్యంత అల్ప స్థాయిలో భారతీయులు ఉన్నారు. 77వ నేషనల్ శాంపుల్ సర్వే ప్రకారం గ్రామీణ ప్రాంతాలలో 35శాతం కుటుంబాలు సగటున సుమారు 60వేల రూపాయల వరకు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. ముఖ్యంగా ఈ రుణగ్రస్థత 2016 నుంచి 2022 మధ్యకాలంలో పెరిగిపోయింది. వీరు ముఖ్యంగా 40శాతం రైతులు, 30శాతం ఇతరులు ఉన్నారు. సంస్థాగత రుణాలు అంటే బ్యాంకులు తదితర వాటి నుంచి గ్రామీణ వాసులకు లభించిన రుణగ్రస్థత 18 శాతం కూడా లేదు. ఈ గ్రామీణ రుణగ్రస్తతను పెరుగుదలను నాబార్డ్‌ధ్రువీకరించింది. ఇప్పుడు దేశంలో అందరికీ అందని అభివృద్ధి జరుగుతున్నది. అందువలన ఆదాయ అసమానతలు పెరిగిపోతున్నాయి. దేశ సంపదలో 58శాతం కేవలం 10శాతం మందికే చేరుతోందని వరల్డ్ యూనిక్వాలిటీ నివేదిక వెల్లడించింది దేశం ఆర్థికంగా ఎంతో వృద్ధి చెందినా అభివృద్ధి ఫలాలు అందరికీ అందడం లేదన్న ఆరోపణల్లో అసత్యం లేదని ఈ వినేదిక తెలియజేస్తోంది. గరిష్ట కనిష్ట ఆదాయాల మధ్య వ్యత్యాసం బాగా పెరిగిందని ఈ నివేదిక వివరించింది. సంక్షేమ పథకాలను గురించి పదేపదే చెబుతూ సంబంధిత అభివృద్ధికోసమే వీటిని అమలు చేస్తున్నామని చెబుతున్నారు. సంక్షేమ పథకాల ఫలాలు ఎవరికి చెందాలో వారికి చేరకపోవడం వల్ల సమ్మిళిత అభివృద్ధి జరగడం లేదు. అగ్రశ్రేణిలో ఉన్న పది శాతం ధనవంతులకు అట్టడుగున ఉన్న 50 శాతం మంది పేదల మధ్య 2014 నుంచి 2024 వరకు ఆదాయంలో అంతరాల స్థిరంగా కొనసాగుతున్నాయని ఆ నివేదిక సూచించింది. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన 2014నాటి నుంచి మొదటి 10 సంవత్సరాలలో వ్యత్యాసాలు బాగా పెరిగాయి. అంతరాలను తగ్గించడానికి కృషి చేస్తున్నట్లు ప్రధానమంత్రి ప్రతి సందర్భంలోనూ పేర్కొంటున్నారు. అయితే ప్రభుత్వం చేపట్టే పథకాల నిధులన్నీ అగ్రశ్రేణిలో ఉన్న పది శాతం మందికే చేరుతుందని అసమానతల నివేదిక పేర్కొంటుంది. అలాగే దేశంలో కుబేరుల సంఖ్య బాగా పెరుగుతోందని గడిచిన పదేళ్లలో కొత్త కుబేరులు తయారయ్యారని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రైట్స్ ఏడిఆర్ ఎన్నికల సందర్భంగా విడుదలచేసే నివేదికలో పేర్కొంటుంది. గతంలో బిలియనీర్ల సంఖ్య చాలా తక్కువగా ఉండేది. ఇప్పుడు అలాంటి బిలినియర్లసంఖ్య గణనీయంగాపెరిగింది. రాష్ట్రాల్లో పెట్టుబడుల కోసం విదేశాల్లో పర్యటించేమంత్రులు ముఖ్యమంత్రుల సంఖ్య గతంలో కన్నా బాగాపెరుగుతుంది. అయినా మన పాలకులు దేశంలో దోపిడీతో జరుగుతున్న వృద్ధినే ప్రిడేటరీ గ్రోత్ పాలకులు కంపెనీలకు అనేక రాయితీలు కల్పించుతున్నారు. ఎన్నో లక్షల కోట్ల పెట్టుబడులు పెడుతున్నామని కార్పొరేట్లు చెబుతున్నారు. అయితే వారు ఆటోమేటిక్ యంత్రాలు లేదా కృత్రిమ మేధాతో పనులు చేపట్టి ఉత్పత్తి కార్యక్రమాలు చేయడం వలన ఉద్యోగకల్పన అంతంతమాత్రంగానే ఉంది. దీనికి తోడు ఒక్క 2024లోనే ప్రపంచ వ్యాప్తంగా సాఫ్ట్వేర్ కంపెనీలో ఒక లక్ష యాభైవేల ఉద్యోగస్తులను తీసేశారు. ఇంకో 5ఏళ్లలో తొమ్మిది లక్షల 20 వేల ఉద్యోగాలు పోతాయని తెలుస్తున్నది. ఈపరిస్థితులలో కంపెనీలుంటే మనపాలకులు మాత్రం వారికి అనేక రాయితీలు అందిస్తున్నారు. మనదేశంలో నూతన ఆర్థికవిధానాలు లిబరలైజేషన్ ప్రైవేటైజేషన్ గ్లోబలైజేషన్ చేపట్టిన తర్వాత ప్రభుత్వం. పెట్టుబడుల విధానాలే మారిపోయాయి. ఇలాంటి పెట్టుబడిదారీ విధానాన్ని అధిగమించి ప్రిడేటరీఎకానమీని నియంత్రించే విధానాన్ని రూపొందించుకోవాలి. ●



# ప్రధాని మోడీకి ఇథియోపియా అత్యున్నత పురస్కారం!

## 'ది గ్రేట్ ఆనర్ నిషాన్ ఆఫ్ ఇథియోపియా' ప్రదానం

**అడ్డిస్ అబాబా, డిసెంబరు 17:** భారత ప్రధాని నరేంద్ర మోడీకి మరో అరుదైన అంతర్జాతీయ గౌరవం లభించింది. ఆఫ్రికా దేశమైన ఇథియోపియా అత్యున్నత పౌర పురస్కారం "ది గ్రేట్ ఆనర్ నిషాన్ ఆఫ్ ఇథియోపియా"ను ఆయనకు ప్రదానం చేసింది. మంగళవారం అడ్డిస్ అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఇథియోపియా ప్రధాని అబే అహ్మద్ అలీ చేతుల మీదుగా మోడీ ఈ అవార్డును అందుకున్నారు. భారత్‌ఇథియోపియా భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ఆయన చేసిన విశేష కృషికి, ప్రపంచ నేతగా ఆయన దార్శనిక నాయకత్వానికి గుర్తింపుగా ఈ పురస్కారాన్ని అందించినట్లు భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందుకున్న తొలి ప్రపంచ దేశాధినేత లేదా ప్రభుత్వాధినేత ప్రధాని మోదీ కావడం విశేషం. ఈ గౌరవాన్ని తాను 140 కోట్ల మంది భారతీయులకు అంకితం ఇస్తున్నట్లు ప్రధాని మోదీ ప్రకటించారు. "ప్రపంచంలోని పురాతన నాగరికతలలో ఒకటైన ఇథియోపియా నుంచి ఈ పురస్కారం అందుకోవడం గర్వంగా ఉంది. ఈ గౌరవాన్ని 140 కోట్ల మంది భారత ప్రజలకు అంకితం చేస్తున్నా"నని ఆయన పేర్కొన్నారు. స్నేహితుడు, సోదరుడు అయిన ప్రధాని అబే అహ్మద్ ఆహ్వానం మేరకు తాను ఇథియోపియా పర్యటనకు వచ్చానని మోదీ గుర్తు చేసుకున్నారు.

ఈ పర్యటన సందర్భంగా భారత్ ఇథియోపియా ద్వైపాక్షిక సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి పెంచుతున్నట్లు ఇరు దేశాలు ప్రకటించాయి. వందేళ్లకు పైగా భారతీయ ఉపాధ్యాయులు ఇథియోపియా అభివృద్ధిలో భాగమయ్యారని, ఇరు దేశాల మధ్య బలమైన బంధానికి విద్య పునాది వేసిందని మోదీ అన్నారు. కాగా, ప్రధాని మోదీకి లభించిన 28వ అత్యున్నత విదేశీ పురస్కారం ఇది.

## వ్యూహాత్మక భాగస్వామ్యంగా ద్వైపాక్షిక బంధం

### ఇథియోపియా పార్లమెంటులో ప్రధాని మోడీ

**అడ్డిస్ అబాబా, డిసెంబరు 17:** ఇథియోపియా పర్యటనలో ఉన్న భారత ప్రధాని నరేంద్ర మోడీఆ దేశ పార్లమెంట్ సంయుక్త సమావేశంలో ప్రసంగిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇథియోపియాతో ఉన్న ద్వైపాక్షిక బంధాన్ని వ్యూహాత్మక భాగస్వామ్య బంధంగా వృద్ధిచేయాల్సి ఉందని పిలుపునిచ్చారు. సింహాల దేశంలో అడుగుపెట్టడం పట్ల తన సొంత గడ్డపైనే ఉందన్న భావన కలుగుతోందన్నారు. తన స్వస్థలమైన గుజరాత్ కూడా సింహాలకు నిలయం కావడమే ఇందుకు కారణమని మోడీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇథియోపియా ప్రజాస్వామ్య ప్రయాణాన్ని ప్రశంసించిన ఆయన 140 కోట్ల భారతీయ ప్రజల తరఫున స్నేహపూర్వక సోదరభావ శుభాకాంక్షలు తెలిపారు. ఇరుదేశాల జాతీయ గీతాలు ప్రజల్లో మాతృభూమి పట్ల గర్వాన్నీ, దేశభక్తినీ ప్రేరేపిస్తాయని కొనియాడారు. ప్రధాని మోడీ ప్రసంగించిన పార్లమెంట్లలో ఇది 18వది కావడం విశేషం. భారత జాతీయ గేయమైన వందేమాతరం , ఇథియోపియా జాతీయ గేయం రెండూ మాతృభూమిని తల్లిగా సూచిస్తాయని మోడీ అభివర్ణించారు. మన వారసత్వం, సంస్కృతి, ప్రకృతి అందాల పట్ల గర్వపడటమే కాకుండా దేశాన్ని పరిరక్షించేందుకు అవి మనకు ప్రేరణ ఇస్తాయని మోడీ పేర్కొన్నారు. తనకు లభించిన ఇథియోపియా అత్యున్నత పౌర పురస్కారాన్ని వినయంతో స్వీకరిస్తున్నట్టు తెలిపారు.

భారతీయుల తరఫున ఈ గౌరవాన్ని చేతులు జోడించి దేశ గౌరవాన్ని చాటుకున్నారాయన. ఇరు దేశాల మధ్య సాంస్కృతిక సారూప్యతలను ఈ సందర్భంగా ప్రత్యేకంగా కొనియాడారు. ఇథియోపియాలో అతిపెద్ద విదేశీ పెట్టుబడిదారులలో భారతీయ కంపెనీలూ ఉన్నాయని ప్రధాని మోడీ గుర్తు చేశారు. ఇరు దేశాలూ అభివృద్ధి చెందుతున్న దేశాలు కాబట్టి పరస్పర సహకారం అందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ ద్వైపాక్షిక సంబంధాన్ని వ్యూహాత్మక భాగస్వామ్యంగా వృద్ధి చేయాలని తాము నిర్ణయించుకున్నట్టు పేర్కొన్నారు. ఈ రెండు దేశాలు వాతావరణంతో పాటు స్ఫూర్తినీ పంచుకుంటాయని ఈ సందర్భంగా మోడీ తెలిపారు.

# వంతారా సందర్శించిన మెస్సీకి అనంత్ అంబానీ భారీ గిఫ్ట్



**జామ్‌నగర్, డిసెంబరు 17:** తన గోట్ ఇండియా టూర్ లో భాగంగా అర్జెంటీనా ఫుట్‌బాల్ స్టార్ ప్లేయర్ లియోనల్ మెస్సి గుజరాత్‌లోని జామ్‌నగర్‌ను సందర్శించిన విషయం తెలిసిందే. ముకేశ్ అంబానీ చిన్న కుమారుడు అనంత్ అంబానీ స్థాపించిన వన్యప్రాణుల సంరక్షణ, పునరావాసం, పరిరక్షణ కేంద్రం అయిన వంతారా ను విజిట్ చేశారు. అక్కడ జంతువులతో మెస్సి సరదాగా సమయాన్ని గడిపారు. వంతారాను విజిట్ చేసిన మెస్సికి అనంత్ అంబానీ అదిరిపోయే గిఫ్ట్ ఇచ్చారు. తన గుర్తుగా రిచర్డ్ మిల్లె వాచ్‌ని ఫుట్‌బాల్ స్టార్‌కు బహుమతిగా ఇచ్చారు. వంతారా సందర్శనకు వెళ్లేటప్పుడు మెస్సి చేతికి ఎలాంటి వాచ్ లేదు. అనంత్‌తో మీటింగ్ తర్వాత అతడి చేతిపై ఓ అరుదైన, అత్యంత ఖరీదైన గడియారం దర్శనమిచ్చింది. ఆ వాచ్ రిచర్డ్ మిల్లె టూర్‌బిల్లాన్ ఆసియా ఎడిషన్. ఇలాంటివి ప్రపంచంలో కేవలం 12 పీస్‌లు మాత్రమే ఉంటాయి. దీని ధర దాదాపు 1.2 మిలియన్ డాలర్లుగా నివేదికలు పేర్కొంటున్నాయి.

అంటే మన భారత కరెన్సీలో దాదాపు రూ. 10.91 కోట్లు అన్నమాట. ఈ గడియారాన్ని అనంత్ అంబానీ మెస్సికి బహుమతిగా ఇచ్చినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. ఇక అనంత్ అంబానీ సైతం ఇలాంటి మరోవాచ్‌ను ధరించడం విశేషం. రిచర్డ్ మిల్లె 056 సఫైర్ టూర్‌బిల్లాన్ అనంత్ చేతికి కనిపించింది. దీని విలువ దాదాపు దాదాపు 5 మిలియన్ డాలర్లుగా తెలుస్తోంది. అంటే రూ.45.59 కోట్లన్నమాట. ప్రస్తుతం ఈ న్యూస్ నెట్టింట తెగ వైరల్ అవుతోంది.

# మరో 15 దేశాలపై ఆంక్షలు విధించిన అధ్యక్షుడు ట్రంప్



**వాషింగ్టన్, డిసెంబరు 17:** అమెరికా తన ప్రయాణ ఆంక్షలున్న దేశాల జాబితాను మరింత పొడిగించింది. జాతీయ భద్రత, వీసా నిబంధనల ఉల్లంఘనలను కారణంగా చూపుతూ మరో 7 దేశాలతో పాటు, పాలస్తీనియన్లపై పూర్తిస్థాయి ప్రయాణ నిషేధం విధించింది. మరో 15 దేశాలపై పాక్షిక ఆంక్షలు విధిస్తూ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మంగళవారం కీలక ప్రకటనపై సంతకం చేశారు. ఈ కొత్త నిబంధనలు జనవరి 1 నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ తాజా నిర్ణయంతో అమెరికా ప్రయాణ ఆంక్షలు విధించిన దేశాల సంఖ్య మొత్తం 39కి చేరింది. కొత్తగా పూర్తి నిషేధం ఎదుర్కొంటున్న దేశాల్లో బుర్కినా ఫాసో, మాలి, నైగర్, దక్షిణ సూడాన్, సిరియా ఉన్నాయి. వీటితో పాటు పాలస్తీనా అథారిటీ జారీ చేసిన ప్రయాణ పత్రాలు ఉన్నవారిని కూడా ఈ జాబితాలో చేర్చారు. గతంలో పాక్షిక ఆంక్షలు ఎదుర్కొన్న లావోస్, సియెర్రా లియోన్‌లపై ఇప్పుడు పూర్తి నిషేధం విధించారు. ఇటీవల వాషింగ్టన్ డీసీలో ఇద్దరు నేషనల్ గార్డ్ సభ్యులను ఆఫ్ఘన్ జాతీయుడు హత్య చేయడం, సిరియాలో ఇస్లామిక్ స్టేట్ జరిపిన దాడిలో ఇద్దరు అమెరికన్ సైనికులు, ఒక పౌర ఉద్యోగి మరణించడం వంటి ఘటనల నేపథ్యంలో ట్రంప్ సర్కార్ ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. వలస విధానాలను కఠినతరం చేయాలనే తమ వాదనకు ఈ ఘటనలు బలం చేకూర్చాయని ట్రంప్ యంత్రాంగం భావిస్తోంది. ఇక పాక్షిక ఆంక్షలు విధించిన 15 దేశాల జాబితాలో అంగోలా, నైజీరియా, సెనగల్, టాంజానియా, జింబాబ్వే వంటి దేశాలు ఉన్నాయి. క్రియాశీల ఉగ్రవాద ముప్పు, అంతర్గత ఘర్షణలు, వీసా గడువు ముగిసినా దేశం విడిచి వెళ్లని వారి సంఖ్య ఎక్కువగా ఉండటం.

# 'అణుశక్తి'లోకి ఎఫ్‌డిఐలు

- లోక్‌సభ ముందుకు బిల్లు.. తప్పుపట్టిన ప్రతిపక్షాలు
- స్టాండింగ్ కమిటీకి పంపాలని నిర్ణయం
- బీమాలో వందశాతం ఎఫ్‌డిఐలు.. బిల్లుకు ఆమోదం
- వాడుకలో లేని, కాలం చెల్లిన 71 చట్టాలు రద్దు
- దర్యాప్తు సంస్థల తీరుపై ప్రతిపక్షాల నిరసనలు

**న్యూఢిల్లీ, డిసెంబరు 17:** న్యూక్లియర్ ఎనర్జీ రంగంలోకి ప్రైవేటు కంపెనీలకు భాగస్వామ్యం కల్పిస్తూ ప్రతిపాదించిన 'శాంతి' (సస్టైనబల్ హార్నెసింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా) బిల్లు 2025ను బుధవారం కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఇది అమల్లోకి వస్తే... భారత ఇంధన రంగంలో సరికొత్త శకానికి నాంది పలుకుతుందని పేర్కొంది. 2070నాటికి నెట్ జీరో ఉద్గారాల లక్ష్యాన్ని చేరుకోవాలని భావిస్తోంది. ప్రస్తుతం దేశంలో అణు విద్యుత్ సామర్థ్యం 8.2 జిడబ్ల్యు మాత్రమే. దీనిని 2047నాటికి 100జిడబ్ల్యుకు పెంచడమే తాజా బిల్లు లక్ష్యం. ఈ చట్టం ద్వారా న్యూక్లియర్ ఎనర్జీ కేవలం విద్యుత్ రంగానికే కాకుండా వైద్యం, వ్యవసాయం, పరిశోధన రంగాల్లో కూడా విప్లవాత్మక మార్పులు తీసుకురానుంది. దశాబ్దాలుగా ప్రభుత్వ గుత్తాధిపత్యంలో ఉన్న న్యూక్లియర్ ఎనర్జీ రంగాన్ని ప్రైవేటు సంస్థలకు అందుబాటులోకి తీసుకురావడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశంగా తెలుస్తోంది. ఈ బిల్లు చట్టంగా మారితే పాతబడిన అటామిక్ ఎనర్జీ యాక్ట్ 1962, సివిల్ లయబిలిటీ ఫర్ న్యూక్లియర్ డ్యామేజ్ యాక్ట్ 2010 రద్దవుతాయి. విదేశీ పెట్టుబడులకు ఆటంకంగా మారిన నిబంధనలు తొలగించి, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా కొత్త నిబంధనలను కేంద్రం రూపొందించింది. అణుశక్తి నియంత్రణ మండలికి తాజా బిల్లు ద్వారా చట్టబద్ధమైన అధికారులు లభిస్తాయి. ఈబిల్లుపై ప్రతిపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. ప్రజా భద్రతతోపాటు జాతీయ భద్రతను దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేశాయి. తక్షణమే ఈ బిల్లును సమగ్ర పరిశీలన కోసం పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి నివేదించాలని డిమాండ్ చేశారు. ఎంపి శశిథరూర్ మాట్లాడుతూ, జవాబుదారీతనం నిబంధనలు లేకుండా ప్రైవేటు సంస్థలకు మొత్తం అణు ఇంధన చక్రాన్ని అప్పగించడం మంచిది కాదన్నారు. రాజకీయ ప్రయోజనాల కంటే భవిష్యత్తు తరాల భద్రతను దృష్టిలో ఉంచుకుని బిల్లును జాగ్రత్తగా, నిష్పక్షపాతంగా పున:పరిశీంచాలని థరూర్ విజ్ఞప్తి చేశారు. అంతకు ముందు బీమా రంగంలో వంద శాతం ఎఫ్‌డిఐలకు అనుమతిస్తూ ప్రతిపాదించిన బిల్లును లోక్‌సభ మూజువాణితో ఆమోదించింది. అయితే, ఈ బిల్లుపై బుధవారం రాజ్యసభలో వాడివేడిగా చర్చ సాగింది. ఇదిలా ఉండగానే పౌరుల జీవన సౌలభ్యాన్ని పెంచే ఉద్దేశ్యంతో వాడుకలో లేని, కాలం చెల్లిన 71 చట్టాలను రద్దు చేస్తూ ప్రతిపాదించిన బిల్లును కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ ప్రవేశపెట్టగా, మూజువాణితో ఆమోదించింది.

**దర్యాప్తు సంస్థల తీరుపై కాంగ్రెస్ మండిపాటు:** నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియాగాంధీ, రాహుల్ గాంధీలకు కోర్టు ఉపశమనం ఇచ్చిన నేపథ్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఇడి)ని కేంద్ర ప్రభుత్వం దుర్వినియోగం చేశారని ఆరోపిస్తూ కాంగ్రెస్ ఎంపిలు బుధవారం పార్లమెంట్ ఆవరణలో నిరసన తెలిపారు. "సత్యమేవ జయతే, జత్యం గెలుస్తుంది" అని రాసి ఉన్న బ్యానర్ చేతబూని మకర ద్వార్ మెట్ల ముందు ఎంపిలు నిలబడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మోడీ ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

**మోడీ, అమిత్ షా రాజీనామా చేయాలి:** నేషనల్ హెరాల్డ్ కేసులో ఎట్టకేలకు న్యాయమే గెలిచిందని ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. బుధవారం ఉదయం అభిషేక్ మను సింఘ్వి, కెసి వేణుగోపాల్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. రాజకీయంగా ప్రతీకారం తీర్చుకోవడానికి, గాంధీల కుటుంబాన్ని వేధింపులకు గురిచేయడానికే సోనియా, రాహుల్ గాంధీలపై కేసులు బనాయించారని ఆరోపించారు. హెరాల్డ్ కేసు విషయంలో కోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం, నిజమే ఎల్లప్పుడూ గెలుస్తుందని మరోసారి రుజువైందన్నారు. అక్రమ కేసులు బనాయింపజేసిన ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా రాజీనామాలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తాము పార్లమెంట్ లోపల, వెలుపల వారితో పోరాడుతూనే ఉంటాం. వారికి తగిన గుణపాఠం నేర్పుతామని స్పష్టం చేశారు.



# ప్రమాదకరస్థాయికి వాయుకాలుష్యం

## ఇంటినుంచే పనివిధానంన- బయటి వాహనాలకు నో ఎంట్రీ

**న్యూఢిల్లీ, డిసెంబరు 17:** దేశ రాజధాని ఢిల్లీని వాయు కాలుష్యం ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. గత కొన్ని రోజులుగా వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయిలో నమోదవుతోంది. పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో ప్రభుత్వం కఠినమైన గ్రాప్4 ఆంక్షలను కొనసాగిస్తోంది. కాలుష్య నియంత్రణ చర్యల్లో భాగంగా, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలన్నీ తప్పనిసరిగా 50 శాతం సిబ్బందితో వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని పాటించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నిబంధనను ఉల్లంఘించిన కంపెనీలపై జరిమానాలు విధిస్తామని హెచ్చరించింది. గ్రాప్4 ఆంక్షల కింద బీఎస్6 ప్రమాణాల కంటే తక్కువ ఉన్న ఇతర రాష్ట్రాల వాహనాలు ఢిల్లీలోకి ప్రవేశించకుండా నిషేధం విధించారు. అలాగే పొల్యూషన్ అండర్ కంట్రోల్ సర్టిఫికెట్ లేని వాహనాలకు పెట్రోల్ బంకుల్లో ఇంధనం నింపరు. 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతులలో తరగతులు నిర్వహించాలని పాఠశాలలను ఆదేశించారు. ఈ నెల 15న ఢిల్లీలో గాలి నాణ్యత సూచీ 498కి చేరి అత్యంత ప్రమాదకర స్థాయికి పడిపోయింది. దట్టమైన పొగమంచు కారణంగా రహదారులు కనిపించక అనేక ప్రమాదాలు జరిగాయి. విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రస్తుత ఆంక్షల వల్ల ఉపాధి కోల్పోయిన నమోదిత నిర్మాణ కార్మికులకు రూ.10,000 పరిహారం అందిస్తామని ఢిల్లీ ప్రభుత్వం ప్రకటించింది. ఈ సంక్షోభంపై స్పందించిన ఢిల్లీ పర్యావరణ శాఖ మంత్రి మంజిందర్ సింగ్ సిర్సా తొమ్మిది పదినెలల్లో ఏ ప్రభుత్వమూ కాలుష్యాన్ని పూర్తిగా నిర్మూలించలేదని వ్యాఖ్యలుచేయడంతో ఆప్, కాంగ్రెస్ పార్టీలచేతికి విమర్శనాస్త్రాలు లభించినట్లయింది.

# మహిళల ఖాతాల్లోకి చేరాల్సిన నగదు పురుషుల ఖాతాల్లోకి..

## డబ్బును తిరిగి చెల్లించాలంటూ నోటీసులు.. బీహార్‌లో చోటు చేసుకున్న ఘటన!

**పాట్నా, డిసెంబర్ 17:** బీహార్ ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన పథకంలో భాగంగా ఎన్డీయే ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున రాష్ట్రంలోని 75 లక్షల మంది మహిళల బ్యాంకు ఖాతాలకు నగదు బదిలీ చేసిన విషయం తెలిసిందే. అయితే ఆ సమయంలో కొంతమంది పురుషుల ఖాతాల్లోకి కూడా డబ్బులు బదిలీ అయినట్లు గుర్తించిన అధికారులు వాటిని రాబట్టేందుకు అపసోపాలు పడుతున్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం బీహార్ ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్‌యోజన పథకంలో భాగంగా అక్కడి ప్రభుత్వం మహిళలకు ఒక్కొక్కరి ఖాతాలకు రూ.10వేలు బదిలీ చేసింది. ఆ సమయంలో సాంకేతిక లోపం కారణంగా దర్భంగా జిల్లాలోని అహియారి గ్రామంలోని పలువురు పురుషుల ఖాతాల్లోకి రూ.10 వేలు బదిలీ అయ్యాయి. అనంతరం ఈ పొరపాటును గుర్తించిన జిల్లా అధికారులు ఖాతాల్లో జమ అయిన డబ్బును తిరిగి చెల్లించాల్సిందిగా గ్రామంలోని పలువురు పురుషులకు నోటీసులు జారీ చేశారు. అయితే ప్రభుత్వం తమ ఖాతాలలో వేసిన పదివేలు ఖర్చు అయినట్లు వారు చెబుతున్నట్లు ఓ అధికారి వెల్లడించారు. ఆ డబ్బుతో బాతులు, మేకలు కొనుగోలు చేశామని, ఇప్పుడు ఆ నగదు తిరిగివ్వడానికి కుదరదని వారు తేల్చి చెబుతున్నారన్నారు. దీంతో గ్రామంలోని పురుషుల నుంచి డబ్బు తిరిగి రాబట్టడం ఇబ్బందికరంగా మారిందన్నారు. మరో వైపు తమ వద్ద అంత మొత్తంలో డబ్బు లేదని, అధికారులు చేసిన తప్పిదం వల్ల ఇలా జరిగింది కాబట్టి తమ ఖాతాల్లో పడిన మొత్తం నగదును మాఫీ చేయాలని అహియారి గ్రామంలోని పురుషులు ముఖ్యమంత్రి నితీష్‌ను కోరుతున్నారు.

# సెవెన్ సిస్టర్స్ వ్యాఖ్యలపై భారత్ తీవ్ర అసహనం

## బంగ్లాదేశ్ హైకమిషన్‌కు సమన్లు..



**న్యూఢిల్లీ, డిసెంబరు 17:** పొరుగు దేశం బంగ్లాదేశ్‌లో మారుతున్న రాజకీయ పరిణామాలు, భారత్‌కు వ్యతిరేకంగా వినిపిస్తున్న రెచ్చగొట్టే వ్యాఖ్యల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకుంది. భారత్‌లో ఉంటున్న బంగ్లాదేశ్ హైకమిషనర్ మహమ్మద్ రిజాజ్ హామీదుల్లాకు విదేశాంగ శాఖ అత్యవసర సమన్లు జారీ చేసింది. ఢాకాలోని భారత దౌత్య కార్యాలయానికి వస్తున్న బెదిరింపులు, అలాగే బంగ్లా రాజకీయ నాయకుల నుంచి వస్తున్న విద్వేషపూరిత ప్రకటనలపై భారత్ తన నిరసనను గళమెత్తింది. బంగ్లాదేశ్‌లో నేషనల్ సిటిజన్ పార్టీ నాయకుడు హస్నత్ అబ్దుల్లా చేసిన వ్యాఖ్యలు ఈ వివాదానికి ప్రధాన కారణంగా మారాయి. బంగ్లాదేశ్ 55వ విజయ్ దివస్ వేడుకల సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఈశాన్య రాష్ట్రాలైన సెవెన్ సిస్టర్స్ ను భారత్ నుంచి వేరు చేస్తామంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఢాకాలో నిర్వహించిన ఒక నిరసన ర్యాలీలో ఆయన ప్రసంగిస్తూ భారత్‌కు వ్యతిరేకంగా ఉన్న శక్తులకు బంగ్లాదేశ్ ఆశ్రయం ఇస్తుందని, ఈశాన్య రాష్ట్రాలను విడగొట్టేందుకు తాము సహకరిస్తామంటూ రెచ్చగొట్టేలా మాట్లాడారు. నేపాల్‌తో భేటీలో యూనస్ వివాదాస్పద వ్యాఖ్యలు ఇందుకు మరింత బలం చేకూరుస్తున్నాయి. ఈ పరిణామాలపై భారత విదేశాంగ శాఖ తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. బంగ్లాదేశ్‌లో తాత్కాలిక ప్రభుత్వం శాంతిభద్రతలను కాపాడాలని, ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా చూడాలని సూచించింది. మరోవైపు బంగ్లాదేశ్ నుంచి చొరబాట్లు లేదా ఉగ్రవాద శక్తుల కదలికలు ఉండవచ్చనే అనుమానంతో అస్సాంలోని కాచర్ జిల్లా సరిహద్దుల్లో ప్రభుత్వం నిషేధాజ్ఞలు విధించింది. అక్రమ రవాణా, సరిహద్దు దాటే కార్యకలాపాలను అరికట్టేందుకు అధికారులు హై అలర్ట్ ప్రకటించారు.

షేక్ హసీనా ప్రభుత్వం పతనమైన తర్వాత బంగ్లాదేశ్‌లో మత ఛాందసవాదం పెరుగుతోందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 1971 విముక్తి యుద్ధ వారసత్వాన్ని చెరిపివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, భారత్‌తో సంబంధాలను తెంచుకుని పాకిస్థాన్ వైపు మొగ్గు చూపే ధోరణి కనిపిస్తోందని విశ్లేషిస్తున్నారు.

మైనారిటీలపై దాడులు, భారత దౌత్యవేత్తలకు బెదిరింపులు వంటివి రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలను క్లిష్టతరం చేస్తున్నాయి. ప్రస్తుతం భారత్ ఈ వ్యవహారాన్ని అత్యంత సీరియస్‌గా తీసుకుంది.

# ఆ వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పను

- మహారాష్ట్ర మాజీ సిఎం పృథ్వీరాజ్ చవాన్
- సైన్యాన్ని అవమానించడమే: బిజెపి ఫైర్



**పుణె,న్యూఢిల్లీ, డిసెంబరు 17:** ఆపరేషన్ సిందూర్‌పై తను చేసిన వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పనని మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నేత పృథ్వీరాజ్ చవాన్ పునరుద్ఘాటించారు. తాను తప్పుగా ఏమీ మాట్లాడలేదని, కాబట్టి క్షమాపణ చెప్పాల్సిన అవసరం లేదని అన్నారు. దీంతో, బీజేపీ నేతలు ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారం అధికార బీజేపీ, కాంగ్రెస్ మధ్య తీవ్ర రాజకీయ దుమారానికి దారితీసింది. కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ పార్లమెంట్ వెలుపల మీడియాతో మాట్లాడుతూ సైనాన్ని అవమానించే, సైనికుల పరాక్రమాన్ని కించపరిచే హక్కు లేదని, ఇలాంటి వ్యాఖ్యలు చేసే వారికి దేశ ప్రయోజనాలు పట్టవని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీకి మన బలగాలను అవమానించడం అలవాటుగా మారిందని ఆయన విమర్శించారు. బీజేపీ ప్రతినిధి షెహజాద్ పూనావాలా నేరుగా సీనియర్ నేత రాహుల్ గాంధీని లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారు. తన పార్టీ సభ్యుడి వ్యాఖ్యలను ఖండించకపోవడం రాహుల్ గాంధీ మైండ్ సెట్‌ను తెలియజేస్తోందని అన్నారు. సైన్యాన్ని అవమానించడం కాంగ్రెస్ పార్టీ తీరని ఆగ్రహం వ్యక్తం చేశారు. చవాన్‌తో పాటు రాహుల్ గాంధీ కూడా గతంలో ఇలాంటి వ్యాఖ్యలు చేశారని గుర్తుచేశారు.

# సంక్షిప్తంగా..

## 'వందేమాతరం' ఆలపించిన ఇథియోపియన్ సింగర్లు!



**ఆదిస్ అబాబా, డిసెంబర్ 17:** ఇథియోపియన్ సింగర్లు భారత జాతీయ గేయం 'వందేమాతరం' పాడుతున్న వీడియోను ప్రధాని నరేంద్రమోడీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. జాతీయ గేయం 150 యేళ్ల పూర్తి చేసుకున్న ఈ సందర్భంలో వారు వందేమాతరం గేయాన్ని ఆలపించడం తనను కదిలించిందని రాసుకొచ్చారు. మూడు దేశాల పర్యటనలో భాగంగా మోడీ ఇథియోపియాకు చేరుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ దేశ ప్రధాని డాక్టర్ అబి అహ్మద్ అలీ మోడీకి విందు ఏర్పాటు చేశారు. ఆ కార్యక్రమంలో ఇథియోపియన్ సింగర్లు వందేమాతరం గీతాన్ని ఆలపించగా వీడియోను ప్రధాని ఎక్స్‌లో పోస్ట్ చేయడంతో అది వైరల్‌గా మారింది. వీడియోలో సింగర్లు జాతీయగేయాన్ని ఆలపిస్తుండగా మోడీ చప్పట్లు కొడుతూ ఉత్సాహంగా కనిపించారు.

## ఓటర్ జాబితాలో చంపేసారు.. అంత్యక్రియలు చేయాలంటూ వార్డు కౌన్సిలర్ నిరసన



**కోల్‌కత్తా, డిసెంబరు 17:** పశ్చిమ బెంగాల్ లో ఎన్నికల సంఘం నిర్వహించిన ఓటర్ జాబితా సమగ్ర సర్వే (సర్) పై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బతికి ఉన్న వారి పేర్లనూ అధికారులు తొలగించారంటూ టీఎంసీ నేతలు మండిపడుతున్నారు. అధికారుల తీరుకు నిరసనగా దాంకుని మున్సిపాలిటీ 18 వార్డు కౌన్సిలర్ సూర్య దే శ్మశానంలో ఆందోళన చేపట్టారు. సమగ్ర సర్వే తర్వాత ఎన్నికల సంఘం ప్రకటించిన ముసాయిదా ఓటర్ జాబితాలో తన పేరు లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను మరణించానని పేర్కొంటూ ఓటర్ జాబితాలో నుంచి తన పేరును అధికారులు తొలగించారని ఆరోపించారు. ఓటర్ జాబితాలో తనను చంపేసిన ఎన్నికల సంఘం అధికారులు వెంటనే వచ్చి తన అంత్యక్రియలు చేయాలంటూ అనుచరులతో కలిసి శ్మశానంలో బైఠాయించారు.

## అహ్మదాబాద్‌లో పది స్కూళ్లకు బాంబు బెదరింపులు

**అహ్మదాబాద్, డిసెంబరు 17:** నగరంలోని 10 స్కూళ్లకు బుధవారం ఉదయం బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. దాంతో ఆయా స్కూళ్ల పరిధిలోని పోలీసులు అప్రమత్తమయ్యారు. ఆ స్కూళ్ల వద్ద గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు. అణువణువు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎలాంటి బాంబులు లేవని తేలడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. థాల్టేలోని జెబర్ స్కూల్, ఉద్గమ్ స్కూల్, గురుకుల్ రోడ్‌లోని మహారాజ అగ్రసేన్ స్కూల్, మకర్బాలోని దీతిజు ఇంటర్నేషనల్ స్కూల్, వస్త్రపూర్‌లోని నిర్మాణ్ స్కూల్, విజాల్‌పూర్‌లోని జైడల్ స్కూల్, అదలాజ్‌లోని డివైన్ స్కూల్, డివైన్ చైల్డ్ స్కూల్, కాలోల్‌లోని ఆవిష్కార్ స్కూల్, బోడక్దేవ్‌లోని అహ్మదాబాద్ ఇంటర్నేషనల్ స్కూల్, బోపాల్‌లోని న్యూ తులిప్ స్కూళ్లకు ఇవాళ ఉదయం బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి.

## పెంపుడు జాగిలాన్ని డిపెండెంట్‌గా గుర్తించాలంటూ కేసు

**వాషింగ్టన్, డిసెంబరు 17:** పెంపుడు కుక్కను చట్టపరంగా తనపై ఆధారపడిన డిపెండెంట్‌గా గుర్తించాలని కోరుతూ అమెరికాలోని అమండా రేనాల్డ్స్ అనే మహిళ అక్కడి పన్నుల విభాగం (ఐఆర్‌ఎస్)పై దావా వేశారు. తన ఎనిమిదేళ్ల గోల్డెన్ రిట్రీవర్ జాతి కుక్క "ఫిన్నెగన్ మేరీ రేనాల్డ్స్"కు ఆహారం, నివాసం, వైద్య సంరక్షణ వంటి అన్ని అవసరాలను తానే చూసుకుంటున్నానని ఆమె తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఫోర్బ్స్ కథనం ప్రకారం తన కుక్క కోసం ఏటా 5,000 డాలర్లకు పైగా (సుమారు రూ. 4.5 లక్షలు) ఖర్చు చేస్తున్నానని, ఇది ఇంటర్నల్ రెవెన్యూ కోడ్ సెక్షన్ 152 ప్రకారం డిపెండెంట్ నిర్వచనానికి సరిపోతుందని ఆమె వాదిస్తున్నారు. పెంపుడు జంతువులను ఆస్తిగా పరిగణించే ప్రస్తుత చట్టాలు వాటిని పిల్లల మాదిరిగా పెంచుకుంటున్న యజమానుల వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించడం లేదని అమండా తెలిపారు.

## అండమాన్ నికోబార్ దీవులకు ఎవరైనా పేర్లు పెట్టొచ్చు..

**పోర్ట్‌బ్లెయిర్, డిసెంబర్ 17:** అండమాన్ నికోబార్‌లోని వందలాది దీవులకు పేర్లు పెట్టే అవకాశాన్ని అక్కడి యంత్రాంగం కల్పించింది. ముఖ్యంగా జనావాసాలు లేని 586 దీవులకు పేర్లు సూచించాలని సామాన్యులకు విజ్ఞప్తి చేసింది. స్థానిక ఆదివాసీ వారసత్వం, స్వాతంత్ర్య సమరయోధులు, ప్రముఖ వ్యక్తులు, అమరులు, ప్రత్యేకమైన వృక్ష, జంతుజాలం, జాతీయ ప్రాముఖ్యత కలిగిన చారిత్రక సంఘటనలు, భౌగోళిక లక్షణాలు కలిగిన పేర్లను సూచించవచ్చని తెలిపింది. కేంద్రపాలిత ప్రాంతమైన అండమాన్ నికోబార్ దీవుల భూభాగం 8249 చదరపు కిలోమీటర్లు. ఇక్కడ మొత్తం 836 దీవులు ఉన్నాయి. వీటిలో 31 ద్వీపాలు మాత్రం నివాసయోగ్యంగా ఉన్నాయి. ప్రస్తుతం 586 దీవులకు పేర్లు లేవు.



బుధవారం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న యువజన కాంగ్రెస్

## రాజకీయ ప్రతీకార చర్యలకు దిగడం బిజెపి మానుకోవాలి

### రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి

**హైదరాబాద్,డిసెంబరు 17,ప్రభాతవార్త :** నిరాధారణ ఆరోపణలతో రాజకీయ ప్రతీకారచర్యలకు దిగడం బిజెపి మానుకోవాలనీతెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి హితవుచెప్పారు. సత్యమేవ జయతే అంటూ బిజెపి వ్యతిరేకనిరసన కార్యక్రమాన్ని బుధవారం ఆయన ఆధ్వర్యంలో లిబర్టీ ట్యాంక్ బండ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద చేపట్టారు. శివచరణ్‌రెడ్డి మాట్లాడుతూ నేషనల్ హెరాల్డ్ కేసు విషయంలో ఢిల్లీ న్యాయ స్థానం సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పక్షాన న్యాయ సమ్మతమైన తీర్పును ఇవ్వడం భారత న్యాయవ్యవస్థ స్వతంత్రతకు నిదర్శనం అంటూ కొనియాడారు. రాజకీయ ప్రతీకారంతో నిరాధార ఆరోపణలతో బిజెపి ప్రభుత్వం కాంగ్రెస్ నాయకత్వాన్ని దెబ్బతీయాలనుకోవడం సిగ్గుచేటు అన్నారు. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం,ధరల పెరుగుదల,సామాజిక అసమానతలపై సోనియా గాంధీ ,రాహుల్ గాంధీ ప్రశ్నిస్తే వాటికి సమాధానం చెప్పలేని మోడీ ప్రభుత్వం అక్రమ కేసులతో ఆయనను అణచివేయాలని చూసిందని ఆరోపించారు. కానీ న్యాయం ఎప్పుడూ సత్యం వైపే ఉంటుందని,ఈ నేషనల్ హెరాల్డ్ కేసు తీర్పే నిదర్శనం చెప్పారు. న్యాయం,నిజాయితీ ప్రజాస్వామ్యం కోసం పోరాడుతున్న రాహుల్ గాంధీ వెంట కాంగ్రెస్ పార్టీ వెంట యావత్ భారత దేశ ప్రజలంతా ఉంటారని స్పష్టం చేశారు. మోడీ నిరంకుశ పాలనకు త్వరలోనే దేశ ప్రజలంతా గోరి కడతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, పలు జిల్లాల, నియోజకవర్గాల అధ్యక్షులు, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## ఆరోపణల నేపథ్యంలో జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ హెడ్ క్వార్టర్‌కు అటాచ్

### మరో ట్రాఫిక్ ఎస్సై, కోర్టు కానిస్టేబుల్, హోంగార్డు సైతం

**హైదరాబాద్(జూబ్లీహిల్స్), డిసెంబరు 17, ప్రభాతవార్త:** అవినీతి ఆరోపణల నేపథ్యంలో జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌తోపాటు ఎస్సై, కోర్టు కానిస్టేబుల్, హోంగార్డులను కార్ హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ చేస్తూ నగర పోలీసు కమిషనర్ సజ్జనార్ ఉత్తర్వులు జారీచేశారు. ఇటీవల చోటుచేసుకున్న వరుస సంఘటనలతోపాటు వార్త పత్రికల్లో ప్రచురితమైన కథనాల నేపథ్యంలో కమిషనర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో భాగంగా పట్టుబడిన వాహనదారులకు ఎలాంటి తనిఖీ రశీదు ఇవ్వకుండా తరువాత వారితో బేంసారాలు చేసి డబ్బులు, బిర్యానీలు తీసుకుంటున్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారంలో కీలక పాత్ర పోషించిన ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నర్సిం గ్రావు, ఎస్సై అశోక్, కోర్టు కానిస్టేబుల్ సుధాకర్‌లపై ఆరోపణలు వెల్లువె త్తాయి. దీనికితోడు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌కు పైలెట్‌గా వ్యవహరిస్తున్న హోంగార్డు కేశవులు సైతం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డ వాహనదారులతో ఇన్ స్పెక్టర్ పేరుతో బేరసారాలు చేయడంతోపాటు చలాన్లు ఉన్న వాహన దారుల నుంచి డబ్బులుగుంజిన వ్యవహారం వీడియోవైరల్ అయ్యింది. దీంతో పోలీసు కమిషనర్ వీరి నలుగురిని కార్ హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. **ఉన్నతాధికారులకు మరిన్ని ఫిర్యాదులు:** గత కొద్ది కాలంగా జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులపై తీవ్రమైన ఆరోపణలు వస్తున్నాయి. ఇక్కడున్న మరికొంత మంది అధికారులు, సిబ్బంది వ్యవహారశైలిపై సైతం ఇప్పటికే నగర పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదులు అందినట్లు తెలుస్తుంది. నెలవారి మామూళ్లు వసూలు చేయడం, నోటీసులు ఇచ్చి వేధింపులకు గురిచేయడం, వేడుకలకు సెక్టార్‌ల వారీగా పై అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే అనుమతిం చడం తదితర ఆరోపణలకు సంబంధించి కమిషనర్‌కు కొందరు ఫిర్యాదు చేశారు. దీనికితోడు మరో అధికారి ఫిలింనగర్ ప్రాంతంలో కలెక్టర్‌ను పెట్టుకొని మరి వసూళ్లకు పాల్పడుతున్నాడనే ఆరోప ణలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. దీనికితోడు ఇక్కడున్న కొందరు వ్యాపార సముదాయాలకు చెందిన వారు ఈ వ్యవహారాన్ని పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి ఇటీవల తీసుకెళ్లినట్లు సమా చారం. దీంతో జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను ప్రక్షాళన చేయాలనే ఆలో చనతో ఉన్నతాధికారులు ఉన్నట్లు తెలుస్తుంది. ఈ క్రమంలోనే నిఘా వర్గాల నుంచి ఇప్పటికే ఉన్నతాధికారులు నివేదికలు సేకరించినట్లు సమాచారం.అందుకు అనుగుణంగా మరింత మందిపై వేటు పడే అవకాశం ఉందని శాఖా పరంగా గుసగుసలు వినిపిస్తున్నాయి.

## స్పీకర్ తీర్పు రాజ్యాంగానికి విరుద్ధం

### ఫిరాయింపు ఎమ్మెల్యేలపై న్యాయ పోరాటం చేస్తాం

### స్పీకర్ తీర్పుపై మండిపడ్డ బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,డిసెంబర్17:** ఐదుగురు ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌ను స్పీకర్ గడ్డం ప్రసాద్ కొట్టివేయడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద మండిపడ్డారు. ట్రిబ్యునల్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించడంలో స్పీకర్ విఫల మయ్యాడని విమర్శించారు. ఐదుగురు ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత వేటును తిరస్కరిస్తూ స్పీకర్ గడ్డం ప్రసాద్ బుధవారం తీర్పు వెలువరించిన అనంతరం.. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌తో కలిసి కేపీ వివేకానంద మాట్లాడారు. ఫిరాయింపులను అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి బాహాటంగా సమర్థించుకున్నారని గుర్తుచేశారు. సీఎం సమర్థింపులకు అనుగుణంగాస్పీకర్ తీర్పు నిచ్చారని మండిపడ్డారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై స్పీకర్ గడ్డం ప్రసాద్ ఇచ్చిన తీర్పును చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని కేపీ వివేకానంద అన్నారు. ఫిరాయించిన ఎమ్మెల్యేలు బాహాటంగానే కాంగ్రెస్‌లో ఉన్నారని, ఫిరాయించిన ఎమ్మెల్యేలు గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ కోసం పనిచేశారని చెప్పారు. కాంగ్రెస్ ఫ్లెక్సీలు, పోస్టర్లలో ఫిరాయించిన ఎమ్మెల్యేల ఫొటోలు ఉన్నాయని తెలిపారు. స్పీకర్ తీర్పుపై సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఐదుగురు ఫిరాయింపు ఎమ్మెల్యేలపైనే తీర్పు ఇచ్చారని కేపీ వివేకానంద తెలిపారు. మిగతా ఐదుగురు ఎమ్మెల్యేలపై అడిగితే స్పీకర్ నుంచి సమాధానం లేదని అన్నారు. న్యూఇయర్ వేడుకలు ఎక్కడ జరుపుకుంటారో నిర్ణయించుకోండి అని సుప్రీంకోర్టు తీవ్రంగా హెచ్చరించడంతో స్పీకర్ ఈ తీర్పును వెలువరించారని అన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై విచారణను పొడిగిస్తే చర్యలు తీసుకుంటామని సుప్రీంకోర్టు హెచ్చరించిందని గుర్తుచేశారు.

స్పీకర్ నోటీసులకు కడియం శ్రీహరి, దానం నాగేందర్ నుంచి ఎలాంటి జవాబు రాలేదని అన్నారు. కడియం శ్రీహరి, దానం నాగేందర్‌పై స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. అసెంబ్లీ రూల్స్ బుక్ ప్రకారం జడ్జిమెంట్ కాపీ తమకు ఇవ్వాలని కేపీ వివేకానంద డిమాండ్ చేశారు. స్పీకర్ జడ్జిమెంట్ కాపీని వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తామన్నారని తెలిపారు. కానీ జడ్జిమెంట్ తయారైందా లేదా అనే అనుమానం కలుగుతోందని అన్నారు. ఫిరాయించిన ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో ఉన్నామంటున్నారని, సీఎం రేవంత్ రెడ్డి మాత్రం ఆ 10 మంది ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లోనే ఉన్నారని చెబుతున్నారని పేర్కొన్నారు. ఈ 10 మంది ఎమ్మెల్యేలు ఏ ముఖం పెట్టుకుని ప్రజల్లో తిరుగుతారని నిలదీశారు. మా పోరాటం ఫలితంగానే స్పీకర్ ఈ తీర్పు అయినా ఇచ్చారని అన్నారు. తెలంగాణ స్పీకర్ కార్యాలయం సుప్రీంకోర్టులో పరువు తీస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేల ఫిరాయింపులపై న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

# గాంధీ నెహ్రూ చరిత్ర లేకుండా మోడీ కుట్ర

### కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి




**హైదారాబాద్,డిసెంబరు 17,ప్రభాతవార్త:** దేశస్వాతంత్రం కోసం పోరాటం చేసిన గాంధీ,నెహ్రూల చరిత్ర ఆనవాళ్ళు లేకుండా సీతా రాముల పేరుతో మూడు సార్లు ప్రధాన మంత్రైన మోడీ కుట్ర చేస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత,మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి విమర్శించారు. గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ మహాత్మా గాంధీ నెహ్రూరాహుల్ గాంధీ కుటుంబం చరిత్ర లేకుండా చేయండి అని మోడీకి అధికారం ఇచ్చారా? ప్రజల పరిపాలన చేయమని అధికారం ఇచ్చారా?దేశాభివృద్ది కోసమని గద్దెపై కూర్చోబెట్టారాడిల్లీ బిజెపి దీనికి సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. దేశం స్వాతంత్ర్యం కోసం మహాత్మా గాంధీ 1930లో దేశ ప్రజల కోసం సత్యాగ్రహం చేశారు, నెహ్రూ 12 ఏండ్లు జైలు జీవితం అనుభవించారు చివరకు స్వతంత్ర్యం కోసం చిన్న వయస్సులోనే ఇందిరాగాంధీ ఆరేళ్ల ప్రజల కోసం జైలుకు వెళ్లారని ఆయన చరిత్రను వివరించారు. మోదీ,అమిత్ షా లు అప్పుడు పుట్టనే లేదనీ,కానీ వాళ్ళను టార్గెట్ చేస్తున్నారనీ,దేశ ప్రజలు గమనించాలనీ ఆయన కోరారు. ఉప్పు సత్యాగ్రహం లో సీతా రాముల పేరుతో ప్రజల్ని మహాత్మాగాంధీ ఏకంచేయగాఇప్పుడు బిజెపి నేతలు రాముడి పేరు చెప్పి వైషమ్యాలు పెంచి రాజకీయం చేస్తున్నారనీ ఆవేదన చెందారు. రోజు కోట్ల మందికి ఉపాధి పొందుతున్న పథకం మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకంసోనియా గాంధీ తెచ్చిన పథకమని ఆయన తెలిపారు, మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకంలో గాంధీ పేరు తొలగించారు కానీ ముందు ముందు ఈ పథకం లేకుండా మోదీ చేసే అవకాశం ఉందని కూడా ప్రజలు గ్రహించాలనీ ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. మహాత్మా గాంధీ నెహ్రూ రాహుల్ గాంధీ కుటుంబ చరిత్ర చెప్పేందుకు సంగారెడ్డి నియోజక వర్గం లక్ష మంది ప్రజలతో సభ పెడుతున్నానని తెలిపారు. ప్రపంచం అంతా మహాత్మా గాంధీ అడుగు జాడల్లో నడుస్తుంటే బిజెపి పార్టీ మాత్రం మహాత్మా గాంధీ చరిత్ర అణగదొక్కాలని చూస్తుందని ఆరోపించారు.రాహుల్ గాంధీనీ దేశ ప్రజలు వచ్చే ఎన్నికల్లో300 ఎంపి సీట్లతో ప్రధాని నీ చేస్తారుఅప్పుడు అదానీ,అంబానీ ,సిబిఐ, ఇడిలు మీ ముఖం ఎక్కడపెట్టుకుంటారని ప్రశ్నించారు. పార్లమెంట్‌లో ప్రజా సమస్యలపై చర్చించే పరిస్థితే లేదని ఆయన ఆవేదన చెందారు. మోదీ పాలనలో ప్రజల అవసరాలు,రైతులు, మహిళాయువత ఉద్యోగాలపై చర్చ లేదు. స్వాతంత్రం కోసం ఆస్తి, ప్రాణాలు దారాదత్తం చేసిన నెహ్రూ ను టార్గెట్ చేసి పని చేస్తుంది బిజెపి రాజకీయాలు చేస్తోందని ప్రజలకు ఉపాధి కల్పించడంలేదని దేశంలో దారిద్ర్యం తాండవిస్తోందని ఆవేదన చెందారు. వందేమాతరం పై చర్చలో ప్రియాంక గాంధీ ధీటుగా సమాధానం చెప్పిందని గుర్తుచేశారు. నెహ్రూను తూలనాడటం ముగిసింది ఇప్పుడు మహాత్మా గాంధీవరకు వచ్చారని అన్నారు. మహాత్మాగాంధీ ఉన్నప్పుడు పుట్టని వాళ్ళు ఆయన మీద నెహ్రూ మీద మాట్లాడుతున్నారు. స్విస్‌బ్యాంకుల్లో డబ్బు తెచ్చి రూ. 15 లక్షలు పేదల అకౌంట్ లో వేస్తా అన్నారనీ వేశాడా అని ఆయన అడిగారు. 15లక్షల డిపాజిట్‌పై దీని మీద పార్లమెంట్‌లో చర్చ పెట్టాడా మోడీ అని జగ్గారెడ్డి నిలదీశారు. ప్రజలను ఏకం చేయడానికి గాంధీ రాముడి పేరు వాడారు కానీ బిజెపి దేశ ప్రజల్ని విభజించడం కోసం రాముడి పేరు వాడుతున్నారు. రాముడి పేరుతో మూడో సారి అధికారంలోకి వచ్చారని ఎద్దేవా చేశారు.

# ఉపాధి పథకానికి మహాత్మాగాంధీ పేరును తొలగించడం అనుచితం

### గ్రామీణ్ విబి జీరామ్‌జీ బిల్లు 2025తో రాష్ట్రాలపై మరింత భారం

### మోడీ ప్రభుత్వంపై ఎంపీ మల్లు రవి ఘాటు విమర్శలు



**హైదరాబాద్, డిసెంబరు 17,ప్రభాతవార్త:** ఉపాధిహామీ పథకానికి మహాత్మాగాంధీ పేరును తొలగించడం దారుణమని తెలంగాణ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ కన్వీనర్ డా.మల్లు రవి వ్యాఖ్యానించారు. గ్రామీణ్ విబిజి రామ్‌జీ బిల్లు 2025తో రాష్ట్రాలపై మరింత భారం పెరుగుతుందని వివరించారు. ఎంపి మల్లు రవి న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో బుధవారం విలేఖరులతో మాట్లాడుతూ ఉపాధిహామి పేరు మార్చడంతో పాటు రాష్ట్రాలకు ఇచ్చే డబ్బులు కూడా తగ్గిస్తోంది. దీనివల్ల రాష్ట్రాలపై భారం పెరగబోతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. డబ్బుల విషయంలో రాష్ట్రాలకు లింకు పెట్టడం మంచిది కాదు. ఈ నిర్ణయం ద్వారా ఈ పథకాన్ని నీరుగార్చాలని ఎన్డీయే ప్రభుత్వం చూస్తోంది. అందుకే ఈ బిల్లును కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తోంది. ఎంత వ్యతిరేకించినా,ఈ బిల్లును తీసుకొచ్చిదానిపైన చర్చ చేయడానికి 4 గంటల సమయం కేటాయించారు. ఎన్డీయే ప్రభుత్వానికి మెజార్టీ ఉంది కాబట్టి ఇలాంటి దారుణమైన నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదని మల్లు రవి వ్యాఖ్యానించారు. దేశానికి స్వాతంత్రం తీసుకురావడంలో గాంధీజీది ప్రధాన భూమిక. అందుకే ఆయన్ను యావత్తు దేశం గౌరవిస్తోంది. ఫాదర్ ఆఫ్ ది నేషన్ అని అంటున్నాం. అలాంటి మహాత్మా గాంధీ పేరుని మార్చడాన్ని ఒక్క కాంగ్రెస్ పార్టీనే కాకుండాఅన్ని పార్టీల్లో ఉన్న లీడర్స్, బిజెపి లో బ్యాలెన్స్‌గా ఉన్న నాయకులు కూడా వ్యతిరేకిస్తున్నారు. స్వతంత్ర పోరాటానికంటే ముందు ఒక్కసారి మాత్రమే గాంధీజీ ఏఐసిసిలో క్రియాశీలకంగా వ్యవహరించారు. దాని తర్వాత స్వతంత్ర పోరాటం కోసం నెహ్రూ, పటేల్, ఇతర జాతీయ నాయకులందరినీ ఐక్యపరిచారు. భారతదేశంలో ఉన్నటువంటి పేద ప్రజలందరినీ స్వతంత్ర పోరాటంలోకి వచ్చే విధంగా చేసినటువంటి గొప్ప జాతీయ నాయకుడు మహాత్మా గాంధీ. గాంధీ నడిపిన స్వతంత్ర పోరాటంలో ఇప్పుడున్న బిజెపి, అంతకు ముందున్న జనసంఘ్, హిందూ మహాసభ గానీ ఎప్పుడూ స్వతంత్ర పోరాటంలో పాల్గొనలేదని మల్లు రవి స్పష్టం చేశారు.దేశానికి స్వతంత్రం వచ్చిన తర్వాత 1948లో నాథూరాం గాడ్సే మహాత్మా గాంధీని చంపటాన్ని దేశ ప్రజలు ఎప్పటికీ మర్చిపోలేరు.

ఈ దుర్మార్గమైన చర్య తర్వాత దేశంలో ఆర్ఎస్ఎస్‌ను కొంతకాలం బ్యాన్ చేశారు. ఇవాళ ఆర్ఎస్ఎస్ బిజెపి ప్రభుత్వాన్ని నడిపిస్తుందన్న సంగతి మనందరికీ తెలుసు. బిజెపి అధికారం చేపట్టిన 12 సంవత్సరాల తర్వాత గాంధీజీ పేరును మారుస్తున్నారు. దీని వెనక ఆర్ఎస్ఎస్ ఉంది. ఈ దుర్మార్గమైన చర్యని సమర్థిస్తే దేశ ప్రజలు ఒప్పుకుంటారా అని ప్రశ్నించారు. అధికారంలో మీరు ఉండొచ్చు కానీ మహాత్మా గాంధీ లాంటి జాతిపిత పేరును తీసేయటం చరిత్రాత్మక తప్పిదంగా నేను భావిస్తున్నాను. దేశానికి స్వతంత్ర వచ్చాక చాలా పార్టీలు పాలించాయి. కానీ ఎవ్వరూ ఇలాంటి నిర్ణయాన్ని తీసుకోలేదు. ఇప్పుడు బిజెపి ప్రభుత్వం ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా ఈ నిర్ణయం తీసుకుంది. భవిష్యత్తులో భారీ మూల్యాన్ని చెల్లించాల్సి వస్తుంది. అందుకే మహాత్మా గాంధీ పేరుని తీసేయకుండా.. పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. కొత్త బిల్లు వల్ల చాలా నష్టాలు ఉన్నాయి. గతంలో కేంద్ర ప్రభుత్వమే నూటికి నూరు శాతం ఈ పథకం కోసం నిధులు కేటాయించేది.

కానీఇప్పుడు 60 శాతానికి తగ్గించి, రాష్ట్రాలను 40 శాతం భరించాలని అంటున్నారు. దీనివల్ల రాష్ట్రాలపై ఆర్థిక భారం పెరుగుతుంది. అలాగే గతంలో గ్రామపంచాయతీలో పనులను నిర్ణయించి దాన్ని వివిధ దశల్లో కేంద్రానికి పంపేవారు. వర్క్ డిమాండ్ ఆధారంగా నిధులు కేటా యించేవారు. కానీ ఇప్పుడు కేంద్రం పరిమిత నిధులు కేటాయిస్తామని అంటోంది. దీనివల్ల నిరుపేదలు నష్టపోతారు. పని కల్పించకపోతే.. పేదల హక్కులను ఎలా కాపాడతారని మల్లు రవి ప్రశ్నించారు. అందుకే ఈ బిల్లుని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని ఎంపీ మల్లు రవి చెప్పారు.

పార్లమెంట్ సభ్యుడిగా తాను కూడా తీవ్రంగా ఖండిస్తున్నానని స్పష్టం చేశారు. దీనిపైనా పార్లమెంట్‌లో మాట్లాడి తమ వైఖరి చెబుతానని వెల్లడించారు. అలాగే తెలంగాణలో జరుగు తున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులను భారీ సంఖ్యలో గెలిపి స్తున్నారని చెప్పారు. కొన్ని చోట్ల ఇతర పార్టీలు బల పర్చిన అభ్యర్థులు విజయం సాధిస్తున్నారని ప్రజా స్వామ్యంలో ప్రతిపక్షం ఉండాలనేది తన అభిప్రాయమన్నారు.

## స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లపై 50శాతం సీలింగ్ తొలగించాలి

### రాజ్యాంగ సవరణ చేయాలని కేంద్ర మంత్రికి ఎంపి ఆర్.కృష్ణయ్య వినతి



కేంద్ర మంత్రి రంజన్ సింగ్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్, డిసెంబర్ 17 ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికల్లో అమలవుతున్న రిజర్వేషన్లపై 50 శాతం సీలింగ్ అడ్డంకిని తొలగిస్తూ, బీసీలకు జనాభా మేరకు రిజర్వేషన్లు కల్పించేందుకు రాజ్యాంగ సవరణ చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు.ఈ మేరకు ఆర్. కృష్ణయ్య నాయకత్వంలోని ప్రతినిధి బృందం బుధవారం న్యూఢిల్లీలోని పార్లమెంట్ భవన్ లో కేంద్ర పంచాయతీ రాజ్ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ (లాలన్ సింగ్)ను వారి కార్యాలయం లో కలసి వినతిపత్రం సమర్పించింది. ఈ సం దర్భంగా ఈ అంశంపై సుదీర్ఘంగా చర్చ జరిగింది. స్థానిక సంస్థల పాలనలో బీసీలకు న్యాయ బద్ధ మైన ప్రాతినిధ్యం కల్పించాలంటే 50 శాతం సీలింగ్‌ను తొలగించడం అనివార్యమని వంత్రికి వివరణ ఇచ్చారు. సుప్రీంకోర్టు తీర్పుల నేపథ్యంలో బీసీ రిజర్వేషన్ల అమలుకు రాజ్యాంగ పరిమితులు అడ్డంకిగా మారుతున్నాయని, వాటిని తొలగించాల్సిన అవసరాన్ని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.

ఇందుకోసం రాజ్యాం గంలోని ఆర్టికల్ 243D, 243Tలను సవరించాలని మంత్రిని కోరారు. బీసీల జనాభా, సామాజిక పరిస్థితులు, రాజకీయ వ్యవస్థలో ఉన్న అసమానతలను పరిగణనలోకి తీసుకుని, స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా ఆధారిత పూర్తి స్థాయి రిజర్వేషన్లు కల్పించేలా రాజ్యాంగ సవరణ చేయడం ద్వారానే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుందని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దేశంలోని అనేక రాష్ట్రాల్లో తెలంగాణ, మహారాష్ట్ర, ఒడిశా, కర్ణాటక, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో స్థానిక సంస్థల రిజర్వేషన్లకు సంబంధించిన చట్టాలను న్యాయస్థానాలు రద్దు చేసిన ఉదాహరణలను కూడా మంత్రికి వివరించారు.రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా, జనాభా మేరకు ప్రజలకు ప్రాతినిధ్యం కల్పించడమే నిజమైన ప్రజాస్వామ్య స్ఫూర్తి అని స్పష్టం చేశారు. రాజకీయ వ్యవస్థలో రిజర్వేషన్లపై 50శాతం సీలింగ్ సముచితమైన విధానం కాదని పేర్కొంటూ, ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని మంత్రిని కోరారు.ఈప్రతినిధి బృందంలో అంగిరేకుల వర ప్రసాద్ యాదవ్, కొండ దేవయ్య, రాకేష్ దత్తా, ఏకరినివాస్, బచ్చు అవినాష్, జెర్రి ఎ౹ాతుల పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

**కేంద్ర మంత్రి హామీ:** రిజర్వేషన్లపై 50 శాతం సీలింగ్ అంశంపై ప్రధాని గారితో చర్చించి, రాజ్యాంగ సవరణకు సంబంధించిన విషయాన్ని కేంద్ర ప్రభుత్వ స్థా యిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకుం టామని కేంద్ర పంచాయతీరాజ్ మంత్రి తెలి పారు. ఆర్.కృష్ణయ్య నాయకత్వంలోని ప్రతి నిధి బృందానికి ఈ మేరకు మంత్రి భరోసా ఇచ్చారని వారు తెలిపారు.

## గాంధీభవన్ నుంచి బిజెపి కార్యాలయం వరకు నేడు నిరసన


### జిల్లా కేంద్రాలలో కూడా బిజెపి కార్యాలయాల ముందు..

### నేటి ఉపాధిహామీ పేరుమార్పు నిరసన ఆదివారానికి వాయిదా: టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, డిసెంబరు 17,ప్రభాతవార్త:** జాతీయ ఉపాధిహామీ పథకం పేరులో మహాత్మాగాంధీని తొలగించడం ఉపాధి నిధులకు కోతపెట్టి రాష్ట్రాలపై భారం మోపడం వంటి చర్యలను నిరసిస్తూ తెలంగాణ వ్యాప్తంగా జిల్లా కేంద్రాలలో చేయతలపెట్టిన నిరసన దీక్షను ఆదివారం నాటికి వాయిదా వేయడం జరిగిందనీ, గురువారం బిజెపి రాజకీయ వేధింపులకు వ్యతిరేకంగా బిజెపి కార్యాలయాల ముందు నిరసన చేపట్టాలని టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ పిలుపు నిచ్చారు. ఏఐసిసి పిలుపు మేరకు టిపిపిసిసి ఆధ్వర్యంలో గాంధీ భవన్ నుంచి బిజెపి కార్యాలయం వరకు గురువారం ఉదయం 10 నుంచి నిరసన జరగనుందని తెలిపారు. నేషనల్ హెరాల్డ్ కేసు విషయంలో బిజెపి రాజకీయ కక్షతో ఏఐసిసి అగ్ర నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీని ఇడి కేసులు పెట్టి వేధించిన తీరుకు ఢిల్లీ కోర్టు ఇచ్చిన తీర్పు చెంపపెట్టువంటిదని ఆయన పేర్కొన్నారు. కేసులను తప్పుపట్టిన అంశాలను ప్రజలకు వివరించేందుకు నిరసన ర్యాలీ చేపట్టనున్న టిపిసిసి ఈ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌తెలిపారు. గురువారం నాడు అన్ని జిల్లా కేంద్రాలలో బిజెపి కార్యాలయాల వద్ద టిపిసిసి మార్గదర్శకంలో డిసిసి నేతృత్వంలో ధర్నాలు చేపట్టాలని కోరారునేషనల్ హెరాల్డ్ కేసులో గత పదేళ్ళుగా ఏఐసిసి అగ్ర నేతలు సోనియాగాంధీ,రాహుల్ గాంధీలను వేధించిన విషయం దేశ ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందని మహేష్ పేర్కొన్నారు.బుధవారం కోర్ట్ సోనియాగాంధీ, రాహుల్ గాంధీలపై ఇడికేసులను తప్పు పట్టిన నేప థ్యంలో బిజెపి రాజకీయ ప్రత్యర్థులపై చేసిన అరాచకాలపై ప్రజలను చైతన్యం చేయాల్సి ఉందని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు. డిసిసిలు కూడా ఉదయం 10గంటలకు ఆయా జిల్లాలో బిజెపి కార్యాలయాల ముందు ధర్నాలు చేసి నిరసన కార్యక్రమాలు చేపట్టాలనీ ఆదేశించారు.

## విద్యార్థినుల భద్రతకు తక్షణ చర్యలు తీసుకోవాలి

### కోఠి మహిళా వర్శిటీ,ఉస్మానియా విద్యార్థుల క్యాంపస్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన నేరెళ్ల శారద



కోఠి మహిళా యూనివర్శిటీని సందర్శించి విద్యార్థులతో తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద

**హైదరాబాద్ (బేగంపేట),డిసెంబరు 17,ప్రభాతవార్త** మహిళా విద్యార్థుల బద్రతకు తక్షణ చర్యలు తీసుకోవాలని, భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాలని తెలంగాణా రాష్ట్ర మహిళా కమీషన్ ఛైర్ పర్సన్ నేరెళ్ల శారద అన్నారు. బుధవారం కోఠి మహిళా యూనివర్శిటీ డిగ్రీ విద్యార్థుల మెస్‌తో పాటు పీజీ విద్యార్థుల ఉస్మానియా క్యాంపస్‌ను నేరెళ్ల శారద ఆకస్మికంగా తనిఖీ చేసారు.ఈ సందర్భంగా ఆమె విద్యార్థినులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను తెల్సుకున్నారు.ఇటీవల మీ డియాలో వచ్చిన మెస్ ఇంచార్జి కి సంబంధించిన వార్తలపై ఛైర్ పర్సన్ విచారణ జరిపారు. విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలపై సానుకూలంగా స్పందిస్తూ తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.వారికి బద్రత విషయంలో ఉన్న ఇబ్బందులను తెల్సుకున్నారు. అనంతరం మెస్‌ను పరిశీలించి భోజన నాణ్యతతో పాటు పరిసరాల పరిశుభ్రతను, సదుపాయాలను తనిఖీ చేసారు.కళాశాల ప్రిన్సిపాల్ ,హాస్టల్ సంబంధిత అధికారులతో సమావేశమై విద్యార్థినుల బద్రత,సౌకర్యాలు, పర్యవేక్షణ వ్యవస్థలపై తీసుకుంటున్న చర్యలపై ప్రశ్నించారు.వారి బద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని హెచ్చరించారు.ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.వారుభయపడకుండా స్వేచ్ఛగా సురక్షిత వాతావరణంలో చదువుకునేలా ఏర్పాట్లు చేయాలన్నారు.విద్యార్థులకు ఎలాంటి సమస్యలు తలెత్తినా నేరుగా మహిళాకమీషన్ కార్యాల యానికి రావాలంటూ కమీషన్ ఛైర్‌పర్సన్ విద్యార్థులకు సూచించారు.మహిళాకమిషన్ ఎల్ల ప్పుడు మహిళలకు అందుబాటులో ఉంటుందని హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉంటుందని చెప్పారు.

## సెంట్రల్ జోన్ వైస్ ఛాన్స్‌లర్ల సమావేశానికి హాజరు కావాలని గవర్నర్‌కు వినతి

**హైదరాబాద్ (తార్నాక), డిసెంబరు 17 ప్రభాతవార్త** : ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఫిబ్రవరి 19 నుంచి 20 వరకు జరగనున్న భారతీయ విశ్వవిద్యాలయాల అసోసియేషన్ సెంట్రల్ జోన్ వైస్ ఛాన్స్ లర్ల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని ఓయూ ఉపకులపతి ఆచార్య కుమార్ మొలుగరం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను ఆహ్వానించారు. ఈ మేరకు నగరంలోని రాజ్ భవన్ లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిశారు. అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్శిటీస్ సౌజన్యంతో జరిగే ఈ సమావేశం జ్ఞానం, ఆవిష్కరణల ద్వారా స్వయం సమృద్ధ భారత్ ఆవిష్కరణ అనే అంశంపై చర్చించనుంది. కృత్రిమ మేధ, క్వాంటమ్ సాంకేతికతను అందిపుచ్చుకునేలా ఉన్నత విద్యా సంస్థలను తీర్చిదిద్దటం, సమకాలీన పద్దతులు, ఆవిష్కరణలు, ఉన్నత విద్యాసంస్థల్లో సాంకేతికత పరివర్తన పై రెండురోజుల పాటు ఆయా విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్స్ లర్లు, నిపుణులు చర్చిస్తారని ఓయూ వీసీ.. ప్రొఫెసర్ కుమార్ మొలుగరం తెలిపారు.

ఈ సమావేశాలకు ఉపకులపతులతో పాటు డైరెక్టర్లు, ఏఐయూ సెంట్రల్ జోన్ లోని అకడమిక్ నాయకత్వం పాల్గొననుంది. ఈ సమావేశాల్లో జరిగే చర్చల సారాంశం ఆధారంగా 100వ ఏఐయూ వార్షిక జనరల్ బాడీ సమావేశం, జాతీయ ఉపకుల పతుల సమావేశానికి నివేదిక సమర్పిస్తారు. ఫలితంగా ఉన్నత విద్యలో జాతీయ స్థాయి విధాన నిర్ణయాల చర్చకు ఉపయోగపడుతుంది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ప్రారంభ కార్యక్రమానికి హాజరు కావటం ద్వారా ఆయా విశ్వవిద్యాలయాల విద్యా నాయకత్వానికి దిశా నిర్దేశం చేయాలని ఈ సందర్భంగా ప్రొఫెసర్ కుమార్ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కోరారు.



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఆహ్వాన పత్రాన్ని అందజేస్తున్న ఓ.యూ వి.సి ప్రొ.కుమార్ మొలగరం

## స్పీకర్‌పై వ్యక్తిగత విమర్శలు తగదు

### ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్

**హైదరాబాద్,డిసెంబరు 17,ప్రభాతవార్త:** ఎమ్మెల్యే అనర్హత పిటిషన్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ నిర్ణయానికి అంతా కట్టుబడి ఉండాల్సిందేననీ సభాపతి ఇరుపక్షాల వాదనలు విని మెరిట్ ఆధారంగా తీర్పు ఇచ్చారనీ స్పీకర్ పైన బిఆర్ఎస్ ఎమ్మెల్యేలువ్యక్తిగత విమర్శలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామనీ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. సిఎల్‌పిలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ బిఆర్ఎస్‌పార్టీ కూడా ఫిరాయింపులపైన మాట్లాడటం ఆశ్చర్యమన్నారు. టిడిపి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌ను క్యాబినెట్ లోకి తీసుకోవడం మరిచిపోయారా అని ఆయన నిలదీశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని మంత్రి వర్గంలోకి తీసుకున్న విషయం మరిచిపోయారా? అనిఆయన అడిగారు. 10ఏళ్లలో 39మంది ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలను బిఆర్ఎస్‌లో చేర్చుకోవడం మరిచిపోయారా అని ఆయన చరిత్రను వివరించారు. గత పదేళ్లలో ఫిరాయింపులపైన ప్రతిపక్షాలు ఫిర్యాదుచేసినా స్పీకర్లు పట్టించుకోలేదని తెలిపారు. ఫిరాయింపులపైన మాట్లాడుతున్న కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేక్ కూడా టిడిపి నుంచి టీఆర్ఎస్‌లోకి ఫిరాయించాడని వివరించారు. కోరుట్ల బిఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉండి కల్వకుంట్ల విద్యాసాగర్ రావు ఎమ్మెల్సీ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ కు పాల్పడి సస్పెండ్ అయ్యాడు. ఆయన కొడుకు సంజయ్ ఇప్పుడు ఫిరాయింపులపైన మాట్లాడుతున్నాడని ఎద్దేవా చేశారు. ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాతే బిఆర్ఎస్ పిటిషన్లను స్పీకర్ డిస్మిస్ చేశారు. స్పీకర్ తీర్పు పైన బిఆర్ఎస్ హైకోర్టుకు వెళ్లొచ్చు,ఇంకా పై కోర్టులకు వెళ్లొచ్చుతమకు అనుకూలంగా తీర్పు వస్తే ఒక విధంగా , రాకపోతే మరో విధంగా బిఆర్ఎస్ మాట్లాడుతోందని దుయ్యబట్టారు. స్పీకర్ ఏకపక్షంగా నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మూడు దశల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఘన విజయం సాధించారని ఆయన చెప్పారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పైన కడుపు మంటతో బిఆర్ఎస్ నాయకులు కళ్లలో నిప్పులు పోసుకుంటున్నార ఆగ్రహం వ్యక్తంచేశారు. కెసిఆర్‌లా మా సీఎం అప్రజాస్వామికంగా పాలన చేయడం లేదని ఆయన చెప్పారు పదేళ్లలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు స్పీకర్ తీర్పుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎలాంటి సంబంధం లేదన్నారు, మెస్సీ లాంటి దిగ్గజ్జ ఫుట్ బాల్ ఆటగాడు హైదరాబాద్‌కు వచ్చినా ఓర్వలేకపోతున్నారు బిఆర్ఎస్ నేతలు అని ఆయన ఆవేదన చెందారు.

# రాష్ట్రంలోని గురుకులాల్లో ఫుడ్‌పాయిజన్ పై విచారణ

## నిర్లక్ష్య అధికారులపై చర్యలు: మైనార్టీ సంక్షేమ మంత్రి అజారుద్దీన్



**హైదరాబాద్, డిసెంబర్ 17, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని సంక్షేమ గురుకులాల్లో జరుగుతున్న ఫుడ్ పాయిజన్ సంఘటనలపై విచారణకు ఆదేశించినట్లు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్ తెలిపారు. ఈ ఫుడ్ పాయిజనింగ్ ఘటనల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ మేరకు హైదరాబాద్‌లో ఒక ప్రకటనలో విద్యార్థులకు పెట్టె భోజనం 30 నిమిషాల ముందు అక్కడ అధికారులు, సిబ్బంది తినాలని నిబంధన పెట్టినట్లు తెలిపారు.ఫుడ్ పాయిజన విషయంలో మరింత అప్రమత్తంగా ఉండి, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గురుకులాల్లో కేవలం 40 పోస్టులు మాత్రమే ఖాళీలు ఉన్నాయన్నారు. పోర్టల్ లో వక్ఫ్ భూముల వివరాలు నమోదు చేయడానికి మరికొంత సమయం ఇవ్వాలని కేంద్రానికి లేఖ రాశామని చెప్పారు. మైనారిటీ బడ్జెట్ పెంచేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ఉన్న వక్ఫ్ భూములపై దృష్టి పెట్టామని పేర్కొన్నారు. ఈ వక్ఫ్ భూముల పరిరక్షణ కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలియచేశారు. వక్ఫ్ భూముల రిజిస్ట్రేషన్ కోసం యాప్ సరిగా పనిచేయడం లేదని ఈ విషయమై ఇప్పటికే ప్రధానితో పాటు, కేంద్రప్రభుత్వ పెద్దలకు లేఖలు రాశామన్నారు. ప్రత్యేకించి ఉమ్మిద్‌పోర్టల్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అయితే ఈ పోర్టల్ లో గత పది రోజులుగా సాంకేతిక సమస్యలు ఏర్పడ్డాయని, వీటిని అధిగమించేందుకు మరి కొంత సమయం పడుతుందని అజారుద్దీన్ తెలిపారు. వక్ఫ్‌భూముల ఎన్‌రోల్‌మెంట్‌కు సమయం పడుతుందని, తప్పుడు పత్రాలతో భూములను అప్లోడ్ చేస్తే రిజెక్ట్ అవుతాయన్నారు.మొత్తం 63,180 ఎకరాల ఆస్తులు ఉన్నాయని, వీటిలో 46 వేల ఎకరాల భూములు పోర్టల్ నమోదు కాలేదని చెప్పారు.

# ఏఐ సృష్టించిన వర్చువల్ కేరక్టర్‌తో యువతి వివాహం



**టోక్యో, డిసెంబర్ 17:** సాంకేతిక కొత్త పుంతలు తొక్కుతున్న వేళ మనుషుల మధ్య సంబంధాలు కూడా వినూత్న రూపం సంతరించుకుంటున్నాయి. జపాన్‌కు చెందిన 32 ఏళ్ల యువతి నోగుచి అనే మహిళ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సృష్టించిన ఒక వర్చువల్ క్యారెక్టర్‌ను వివాహం చేసుకుని అందరినీ ఆశ్చర్యపరిచింది. అచ్చం సంప్రదాయ వివాహంలా తెల్లటి గౌను, కిరీటం ధరించి, తన కాబోయే భర్తగా భావిస్తున్న స్మార్ట్‌ఫోన్‌లోని ఏఐ క్యారెక్టర్ వైపు చూస్తూ ఆమె భావోద్వేగానికి గురైంది. కాల్ సెంటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న నోగుచి క్లాస్ అనే వీడియో గేమ్ క్యారెక్టర్‌తో మాట్లాడటం ప్రారంభించింది. చాట్‌జీపీటీ సాయంతో ఆ క్యారెక్టర్‌కు తనకి ష్టమైన రీతిలో పర్సనాలిటీని రూపొందించుకుంది. క్రమంగా ఆ ఏఐ పాత్రతో ప్రేమలో పడిన ఆమె, అది ప్రపోజ్ చేయడంతో పెళ్లికి అంగీకరించింది. అక్టోబర్‌లో జరిగిన వీరి వివాహ వేడుకల్లో, నోగుచి ఆగుమెంటెడ్ రియాలిటీ స్మార్ట్ గ్లాసెస్ ధరించి, టేబుల్‌పై ఉంచిన స్మార్ట్‌ఫోన్‌లోని క్లాస్ క్యారెక్టర్‌కు ఉంగరం తొడిగింది. ఏఐ రూపొందించిన పెళ్లి ప్రతిజ్ఞలను ఒ వ్యక్తి చదివి వినిపించారు. జపాన్‌లో ఈ తరహా వివాహాలకు చట్టబద్ధమైన గుర్తింపు లేనప్పటికీ, వర్చువల్ క్యారెక్టర్లతో బంధాలు ఏర్పరుచుకునే వారి సంఖ్య పెరుగుతోంది. అక్కడి యువతలో ఫిక్టోరొమాంటిక్ (కల్పనిక పాత్రలతో ప్రేమ) సంబంధాల పట్ల ఆసక్తి పెరుగుతున్నట్లు సర్వేలు చెబుతున్నాయి. మానవ సంబంధాలకు ఓపిక అవసరమనీ, కానీ ఏఐతో అలాంటి అవసరం లేకపోవడమే ఈ ధోరణికి కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ బంధం తను వాస్తవ ప్రపంచం నుంచి దూరం చేసేది కాదని, తన జీవితానికి మద్దతుగా నిలిచేటట్టు మాత్రమేనని నోగుచి చెప్పింది.క్లాస్‌తో బంధం మొదలయ్యాక తన మానసిక ఆరోగ్యం మెరుగుపడి ఉందని, జీవితం పట్ల సానుకూల దృక్పథం ఏర్పడిందని ఆమె వివరించింది.

# గిట్టుబాటు ధర కల్పించాల్సిన బాధ్యత పసుపు బోర్డు తీసుకోవాలి

## రాష్ట్ర ఆర్థికవృద్ధికి ప్రధాన ఇంజిన్‌గా వ్యవసాయం

## టర్మరిక్ వాల్యు చైన్ సమ్మిట్‌లో వ్యవసాయ మంత్రి తుమ్మల




**హైదరాబాద్, డిసెంబరు 17, ప్రభాతవార్త:** తమ ప్రభుత్వ విజన్‌లో వ్యవసాయాన్ని కేవలం సంక్షేమ రంగంగా కాకుండా, రాష్ట్ర ఆర్థిక వృద్ధికి ప్రధాన ఇంజన్‌గా చూస్తున్నామని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. బుధవారం సిసిఐ తెలంగాణ, నేషనల్ టర్మిరిక్ బోర్డు సంయుక్తంగా నిర్వహించిన టర్మరిక్ వాల్యు చైన్ సమ్మిట్-2025 లో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పసుపు పంటను ప్రపంచ మార్కెట్లలో పోటీ పడే స్థాయికి తీసుకెళ్లేందుకు సమిష్టి చర్యలు అవసరమన్నారు. ప్రభుత్వ అగ్రి విజన్‌లో పసుపుకి కూడా పాత్ర ఉందని చెప్పారు. మెడిసిన్, న్యూట్రాస్యూటికల్స్, ఫంక్షనల్ ఫుడ్స్ వంటి రంగాల్లో పసుపు వినియోగం పెరుగుతోందని వెల్లడించారు. పసుపు రైతుల సంక్షేమానికి కేంద్రం ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలని తెలిపారు. పసుపును అధికంగా పండించే రాష్ట్రాలలో తెలంగాణ కూడా ఒకటని, ఆర్మూర్ పసుపుకు జిఐ ట్యాగ్ రావడం రైతులకు గర్వకారణమన్నారు. నేషనల్ టర్మరిక్ బోర్డు ఏర్పాటు చేసినప్పటికీ, అది పూర్తిస్థాయిలో కార్యాచరణలోకి రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ బోర్డు కార్యాలయ పరిమితుల్లో కాకుండా, రైతులకు పాలసీ దిశ చూపే సంస్థగా పనిచేయాలన్నారు. పరిశోధనను పొలాలకు తీసుకెళ్లాలన్నారు. మార్కెటింగ్, బ్రాండింగ్, ఎగుమతుల్లో నాయకత్వం వహించాలని సూచించారు. తెలంగాణలో అనుకూల వాతావరణం, శ్రమించే రైతులు ఉన్నప్పటికీ ధరల హెచ్చు, తగ్గుల కారణంగా పసుపు సాగు విస్తీర్ణం తగ్గడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఒక క్వింటా పసుపు ఉత్పత్తికి రూ.9 వేల వరకు ఖర్చు అవుతుండగా, మార్కెట్‌లో రూ.12 వేలు మాత్రమే ఉండటం రైతులను నిరుత్సాహపరుస్తోందన్నారు.

నేషనల్ టర్మరిక్ బోర్డు విజన్ 2047కు అనుగుణంగా పనిచేసి, ధరల స్థిరత్వం, ముందస్తు మార్కెట్ సంకేతాలు అందించాలన్నారు. ప్రామాణిక మాయిశ్చర్ మీటర్లు, ఒకే రకమైన తేమ ప్రమాణాలు, పారదర్శక మార్కెట్ వ్యవస్థ అమలు చేయాల్సి ఉందని చెప్పారు. అధిక కర్క్యుమిన్ రకాలతో పాటు, నాణ్యమైన టెస్టింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసి, ప్రపంచ ప్రమాణాలకు తగ్గ పసుపు ఉత్పత్తికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో టర్మరిక్ బోర్డు చైర్మన్ గంగారెడ్డి, సెక్రటరీ భవానీ, వ్యవసాయ సెక్రటరీ సురేంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

**జిల్లాల వారీగా,పార్టీల వారీగా 3వ విడత పంచాయతీ ఎన్నికల ఫలితాలు**

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,డిసెంబర్17:

| జిల్లాలు | కాంగ్రెస్ | బిఆర్ఎస్ | బిజెపి | ఇతరులు |
|---|---|---|---|---|
| ఆదిలాబాద్(151) | 31 | 61 | 11 | 47 |
| భద్రాద్రి కొత్తగూడెం(156) | 101 | 19 | - | 35 |
| హనుమకొండ(68) | 40 | 24 | 3 | 1 |
| జగిత్యాల(119) | 56 | 32 | 4 | 16 |
| జనగామ(91) | 47 | 37 | 0 | 2 |
| జయశంకర్ భూపాలపల్లి(81) | 54 | 17 | 1 | 6 |
| జోగులాంబ గద్వాల(75) | 23 | 30 | 0 | 18 |
| కామారెడ్డి(168) | 119 | 20 | 3 | 17 |
| కరీంనగర్(111) | 38 | 37 | 20 | 11 |
| ఖమ్మం(191) | 123 | 42 | - | 16 |
| కుమరంభీం అసిఫాబాద్(108) | 34 | 32 | 9 | 11 |
| మహబూబాబాద్(168) | 103 | 42 | - | 7 |
| మహబూబ్‌నగర్(133) | 63 | 50 | 5 | 11 |
| మంచిర్యాల(102) | 39 | 18 | - | 33 |
| మెదక్(183) | 73 | 86 | 9 | 15 |
| ములుగు(46) | 24 | 8 | - | 6 |
| నాగర్‌కర్నూల్(158) | 98 | 31 | 1 | 17 |
| నల్లగొండ(269) | 160 | 58 | 1 | 34 |
| నారాయణపేట(110) | 52 | 27 | 15 | 14 |
| నిర్మల్(133) | 26 | 6 | 73 | 25 |
| నిజామాబాద్(165) | 76 | 33 | 12 | 28 |
| పెద్దపల్లి(91) | 66 | 21 | 3 | 0 |
| రాజన్న సిరిసిల్ల(87) | 14 | 38 | 9 | 22 |
| రంగారెడ్డి(174) | 81 | 48 | 26 | 11 |
| సంగారెడ్డి(234) | 151 | 66 | 5 | 7 |
| సిద్దిపేట(163) | 67 | 60 | 5 | 18 |
| సూర్యపేట(146) | 99 | 28 | 0 | 7 |
| వికారాబాద్(157) | 93 | 48 | 4 | 8 |
| వనపర్తి(87) | 46 | 21 | 3 | 15 |
| వరంగల్(109) | 73 | 35 | 0 | 1 |
| యాదాద్రి భువనగిరి(124) | 71 | 35 | 7 | 10 |
| మొత్తం(4,158) | 2235 | 1153 | 241 | 489 |

## 500 గిగావాట్ల స్థాపిత సామర్థ్యంలో..

# 50 శాతం దాటిన శిలాజేతర ఇంధన వాటా

## 3 గిగావాట్ల నుండి 129.92 గిగావాట్లకు పెంపు

## సూర్య ఘర్‌కు సబ్సిడీగా రూ.13,464.6 కోట్లు విడుదల

**హైదరాబాద్, డిసెంబరు 17, ప్రభాతవార్త** భారతదేశ సౌరశక్తి ప్రయాణం ప్రపంచంలో స్వచ్ఛ ఇంధన ఉత్పత్తిలో అగ్రగామిగా ఆవిర్భవించడానికి శక్తినిస్తోంది. దేశ వ్యాప్తంగా సౌర ఇంధన రంగం వేగంగా విస్తరిస్తోంది. 2014లో 3 గిగావాట్ల నుంచి ఈ ఏడాది 10 నెలల నాటికి 40 రెట్లకు పైగా పెరుగుదల చోటు చేసుకుని 129.92 గిగావాట్లకు చేరింది. ఈ వేగవంతమైన వృద్ధితో పవన, జల, జీవద్రవ్య ఇంధన సామర్థ్యాలను సౌరశక్తి అధిగమించింది. కేంద్ర ఇంధన పునరుత్పాదక అధికారుల సమాచారం మేరకు పునరుత్పాదక ఇంధన రంగంలో అతిపెద్ద వాటాను సౌరశక్తి అందిస్తోంది. దేశ వ్యాప్తంగా 500 గిగావాట్ల సామర్థ్యంలో మొత్తం స్థాపిత సామర్థ్యంలో శిలాజేతర ఇంధన వాటా 50 శాతం దాటింది. ఈ నెల నాటికి పీఎం సూర్యఘర్ కింద దాదాపు 24 లక్షల గృహాలపై 7 గిగావాట్ల స్వచ్ఛ ఇంధన సామర్థ్యంతో సౌర విద్యుత్ ఏర్పాటైంది. ఇందుకోసం రూ.13,464.6 కోట్ల సబ్సిడీ విడుదలైంది. ఇక పీఎంకుసుమ్ పథకం వ్యవసాయంలో స్వచ్ఛ ఇంధన వినియోగాన్ని పెంచింది. కాంపొనెంట్ బీ కింద దాదాపు 9.2 లక్షల స్టాండ్ అలోన్ సోలార్ పంపులను అందుబాటులోకి తెచ్చింది. అలాగే అక్టోబరు 31 నాటికి దేశంలోని 13 రాష్ట్రాల్లో 40 గిగావాట్ల సంయుక్త సామర్థంతో కూడిన 55 సోలార్ పార్కులకు ఆమోదం లభించింది. గత దశాబ్ద కాలంగా సౌరశక్తి ఉత్పత్తి కేంద్రాల పెరుగుదల దేశ మొత్తం స్థాపిత విద్యుత్ సామర్థ్యాన్ని రెట్టింపు చేయడంలో కీలకపాత్ర పోషించింది. ప్రస్తుతం సౌరశక్తి సామర్థం 129 గిగావాట్లు ఉండగా, శిలాజేతర విద్యుత్ సామర్థం 259 గిగావాట్లు దాటింది. ఇది అక్టోబర్ నాటికి దేశ మొత్తం స్థాపిత విద్యుత్ సామర్థ్యంలో 50 కంటే అధికం. దేశంలో వేగవంతమైన విస్తరణను, ప్రపంచ సహకారంతో జత చేయడం ద్వారా భారతదేశం ప్రపంచానికి ప్రమాణాలను నిర్దేశించే దృఢమైన, స్థిరమైన, సౌరశక్తితో కూడిన ఇంధన భవిష్యత్తుకు పునాది వేస్తోందని కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఇక పంచామృత్ ఫ్రేమ్‌వర్క్‌లోని ఐదు కీలక అంశాల్లో 2030 కల్లా 500 గిగావాట్ల శిలాజేతర ఇంధన ఆధారిత స్థాపిత విద్యుత్ సామర్థ్యం సౌర, పవన, జీవద్రవ్య, జల, అణు శక్తిని కలుపుకొని దేశ విద్యుత్‌లో స్వచ్ఛ ఇంధన వాటాను గణనీయంగా పెంచడం లక్ష్యంగా ఉంది. 2030 నాటికి శిలాజేతర వనరుల నుంచి స్థాపిత విద్యుత్ సామర్థంలో 50 శాతం వాటా ఇంధన పోర్ట్‌ఫోలియోను వైవిధ్యపరిచి, శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించనుంది. అలాగే మొత్తం కర్బన ఉద్గారాలను 1 బిలియన్ టన్నుల మేర తగ్గించడం, స్వచ్ఛ ఇంధనం, మెరుగైన సామర్థ్య చర్యల ద్వారా గ్రీన్‌హౌస్ ఉద్గారాలను తగ్గించాలని నిర్ణయించింది. ఇక 2070 కల్లా కర్బన తొలగింపుతో ఉద్గారాలను సమతుల్యం చేయడం ద్వారా సుస్థిర అభివృద్ధి సాధించాలనే దీర్ఘకాలిక లక్ష్యంతో ఉన్నట్లు కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

# రాష్ట్రంలో సీడ్ బిల్లుకు కసరత్తు పూర్తి

## రైతు కమిషన్ అధ్యక్షుడు కోదండ రెడ్డి

**హైదరాబాద్, డిసెంబరు 17, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సీడ్‌బిల్లు తీసుకొచ్చేందుకు కసరత్తు పూర్తిచేశామనీ రైతు కమిషన్ చైర్మెన్ కోదండరెడ్డి తెలిపారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫైల్ మంత్రి వద్ద పెండింగ్‌లో ఉందని చెప్పారు. హైదరాబాద్‌లోని రైతు కమిషన్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ విత్తన రైతులకు నష్టాలు వస్తున్నాయనీ, కంపెనీలు మాత్రం లాభాలు పొందుతున్నాయని చెప్పారు. 40 శాతం విత్తనాలు తెలంగాణలోనే సాగవుతున్నాయని చెప్పారు. ములుగు జిల్లాలో మొక్కజొన్న విత్తనాలు సాగు చేసిన రైతులు కొందరు చనిపోయారనీ, చాలామంది మంచాన పడ్డారని తెలిపారు. పశువులు కూడా మృత్యువాతపడ్డాయన్నారు. రైతులకు కమిషన్ ఆధ్వర్యంలో ములుగు విత్తన రైతులకు మల్టీనేషనల్ కంపెనీల నుంచి రూ.4 కోట్ల పరిహారం ఇప్పించామని తెలిపారు. దేశ చరిత్రలో రైతులకు నష్టపరిహారం ఇప్పించడం ఇదే తొలిసారని చెప్పారు. కేంద్ర విత్తన చట్టం 2025 ముసాయిదాలో అనేక లోపాలున్నాయన్నారు. విత్తనమనేది చాలా ముఖ్యమైన అంశమని, దానిపై రాష్ట్రాలకు కొన్ని హక్కులు కల్పించేలా ముసాయిదా చట్టంలో మార్పులు చేయాలని కేంద్రానికి సూచించారు. కల్తీ విత్తనాలను కొన్ని కంపెనీలు బ్రాండ్ వేసుకొని అమ్మటం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. నాసిరకం విత్తనాలను అరికట్టేందుకు విత్తన ముసాయిదా చట్టంలో మార్పులు చేయాలని కేంద్రానికి సూచించారు. వ్యవసాయరంగం రాష్ట్ర పరిధిలో ఉన్న నేపథ్యంలో కొత్త చట్టంలో రాష్ట్రాలకు హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. విదేశాల నుంచి దిగుమతి అయిన గోధుమల్లో వయ్యారి భామ, మరికొన్ని విత్తనాల్లో సర్కారీ తుమ్మ వచ్చాయనీ, వాటిద్వారా రాష్ట్రమంతా ఆ మొక్కలు వ్యాపించాయని ఎత్తిచూపారు. అందుకే విత్తనాల సర్టిఫికేషన్‌లో కఠిన నిబంధనలను పెట్టాలని సూచించారు.

# పత్తి కొనుగోళ్లలో జీరో దందా

**హైదరాబాద్, డిసెంబరు 17, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పత్తి కొనుగోళ్లలో జీరో దందా జోరుగా నడుస్తుంది. ముఖ్యంగా జిల్లాలోని వివిధ మండలాల్లో, గ్రామాల్లో అనధికారికంగా పత్తికొనుగోళ్ల వ్యాపారం జరుగుతున్నట్లు తెలియవచ్చింది. ఈ అక్రమ వ్యాపారంలో బ్రోకర్లు, దళారులు ప్రధాన పాత్ర పోషిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. పత్తి అమ్మకం కోసం సీసీఐ తెచ్చిన కపాస్ కిసాన్‌ను యాప్‌తో రాష్ట్రంలోని మారుమూలలతో పాటు, వివిధ ప్రాంతాల్లో నెట్ వర్క్ సక్రమంగా లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నెట్‌వర్క్ కవరేజ్ సరిగా లేకపోవడం వల్ల యాప్‌లో నమోదు చేసుకోలేక, స్లాట్‌లను బుక్ చేసుకోలేక పోతున్నారు. దీంతో గత్యంతరం లేక పలువురు రైతులు పత్తిని అమ్ముకునేందుకు ప్రైవేట్ వ్యక్తులను ఆశ్రయించాల్సి వస్తోంది. దీన్ని అసరాగా చేసుకుని లైసెన్స్ లేకుండా నియమ నిబంధనలు పాటించకుండా అక్రమ మార్గాన పత్తిని కొనుగోలు చేస్తున్నారు. రైతులకు రసీదు కూడా ఇవ్వకుండా దళారులు బ్రోకర్లు వ్యాపారాన్ని నడుపుతున్నారు. రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకొని కొందరు బ్రోకర్లు దళారులు ఆడింది ఆటగా, పాటగా నడిపిస్తున్నారు. ఎలక్ట్రికల్ కాంటాలు కాకుండా చిల్లర పాత కాంటాలతో పత్తి కొనుగోలు చేస్తున్నారు. ఈవిధంగా కొనుగోలు చేసిన పత్తిని సీసీఐ ప్రైవేట్ మిల్లులకు తరలిస్తూ అందిన కాడికి దోచుకుంటున్నారు. రైతుల వద్ద తక్కువ రేటుతో కొనుగోలు చేసి మార్కెట్‌లో మాత్రం తగిన రేటుకు అమ్ముకుంటున్నారు. కాంటాలల్లో మొగ్గు చూపుతూ కిలో కట్టింగ్ పేరుతొ కోత పెడుతూ రైతులను నిండా ముంచుతున్నారు.

పత్తిని కొనుగోలు చేయడానికి రైతుల భూమి పాస్ పుస్తకం, ఆధార్, బ్యాంకు ఖాతా, సెల్ నెంబర్ కావాలి. వీటిని కొనుగోలు చేసిన దళారులు, బ్రోకర్లు రైతుల వద్ద నుంచి సేకరించి రైతుల పట్టాదార్ పాస్ పుస్తకం ఏ రకం పంట వేశారో తెలుసుకోవడానికి వ్యాపారులు కార్యాలయంలో ఓటీపీ ద్వారా తెలుసుకుంటున్నారు. పత్తి కొనుగోలు అయిన తర్వాత మొత్తం డబ్బులు ఒక రైతు అకౌంట్లో కీ ట్రాన్స్ఫర్ చేయిస్తున్నారు. ఇలా అందిన కాడికి దోచుకుంటున్నట్లు తెలియవచ్చింది.

# ప్రైవేట్ హోటల్‌కు టిటిడి స్థలం ధారాదత్తం మంచిదికాదు

## టిటిడి మాజీ ఛైర్మన్ భూమన ఆగ్రహం



**తిరుమల,డిసెంబర్ 17ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండలను ఆనుకునే ఉన్న టిటిడి స్థలాన్ని ఓ ప్రైవేట్ హోటల్‌కు 20ఎకరాలు ధారాదత్తం చేయడం మంచిదికాదని టిటిడి మాజీ ఛైర్మన్, వైసిపి ఉమ్మడి చిత్తూరుజిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి మండిపడ్డారు. టిటిడి స్థలం గజం 49వేల రూపాయలని, ఎకరాకు 29కోట్ల రూపాయలు విలువచేసే 20 ఎకరాలు 460 కోట్లరూపాయలు విలువైన భూములను చంద్రబాబు దోచిపెట్టారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అలిపిరికి అత్యంత సమీపంలో ఈ భూములను టిటిడి పర్యాటకశాఖ నుండి తీసుకుని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడాన్ని నిరసిస్తూ బుధవారం ఉదయం అక్కడ జరుగుతున్న పనులను భూమన కరుణాకర్‌రెడ్డి పరిశీలించారు. పర్యాటకశాఖ భూమి తీసుకుని టిటిడి ఒబెరాయ్ గ్రూప్‌కు కట్టబెట్టడం దారుణమన్నారు. ఈ విషయంపై ఈనెల 11వతేదీ మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకుని 13వతేదీ జిఒ ఇవ్వడం ఎంతవరకు సమంజసమన్నారు. పర్యాటకస్థలం ఎకరా 90లక్షలు రూపాయలు మార్కెట్ విలువ ఉంటే టిటిడి గజం 49వేల రూపాయలకు ఎకరాలకు 29కోట్ల విలువచేసే 20 ఎకరాలు 460కోట్లకే దోచిపెట్టారని ఆరోపించారు. బహిరంగ మార్కెట్లో దీనివిలువ మూడుకోట్ల రూపాయలు ఉంటుందని భూమన తెలిపారు. కోహినూర్ వజ్రంకంటే ఎక్కువ ధర టిటిడి స్థలమని, దీనికి విలువ కట్టలేమన్నారు. పర్యాటకశాఖ నుండి టిటిడి తీసుకున్న స్థలం విలువా 18కోట్ల రూపాయలు మాత్రమేనని అయితే అంత విలువైన భూములను ఒబెరాయ్ పేరు మార్చుకున్న మాత్రాన ఎలా కట్టబెడతారని ప్రశ్నించారు. అలిపిరి వద్ద అనుమతులు లేకుండా అక్కడ పనులు జరుగుతున్నాయని, ఎర్రచందనం వృక్షాలను కూడా నరికివేస్తున్నారని, ఆ దుంగలు ఏమయ్యాయని కరుణాకర్‌రెడ్డి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఎకోసెన్సిటివ్ జోన్‌పరిధిలో ఈ భూమి ఉందని, రెవెన్యూస్థలాలు ఇచ్చే అవకాశం ఉన్నా టిటిడి స్థలం ఎందుకు ఇవ్వాలని దుయ్యబట్టారు. వేంకటేశ్వరస్వామి స్థలం ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెడుతున్నారని ఆయన ఆందోళన చెం దారు. ప్రత్యేక అగ్రి మెంట్ వెనుక అవినీతి దాగి ఉందన్నారు. ఈ విషయంపై డిసిఎం పవన్‌కల్యాణ్ కూడా స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. స్వామీజీలు, పీఠాదిపతులు దీనిపై స్పందించాలని,పోరాటం చేయాలని అన్నారు. ప్రైవేట్ హోటల్‌కు స్థలం ఇవ్వడం వల్ల టిటిడికి వచ్చిన ఆదాయం ఏమిటని, దీని వల్ల రూపాయి కూడా ఆదాయంలేదన్నారు. రెండుకోట్ల రూపాయలు భవనం ఫీజు మాఫీ చేశారని, 26కోట్ల రూపాయలు స్టాంప్ డ్యూటీ మాఫీచేసేశారని మండిపడ్డారు.వంద గదులు ఒబెరాయల్ హోటల్ వస్తే 1,500మందికి ఉద్యోగాలు ఎలా వస్తాయని ఆయన అనుమారం వెలిబుచ్చారు. తిరుమల పరకామణి దొంగతనం కంటే ఇదీ పెద్ద దోపిడీ వ్యవహారమని ఆయన మండిపడ్డారు.టిటిడి స్థలం ధారాదత్తం చేయడం వల్ల ఎవరికి లాభమని సూటిగా ప్రశ్నించారు.వందగదులుఉంటే ఆ సంస్థ 1,500 మందికి ఉద్యోగాలు ఎలా ఇస్తుందని అన్నారు. బుధవారం ఉదయం ఆ స్థలాన్ని భూమన పరిశీలించారు. ఈనెల 5వతేదీ రిజిస్ట్రేషన్ చేసినా ఆన్‌లైన్‌లో చూపడం లేదన్నారు.

# ఎఎన్నార్ కళాశాల విద్యార్థుల స్కాలర్‌షిప్‌లకు రూ.2 కోట్లు విరాళం : నాగార్జున

**గుడివాడ,డిసెంబరు 17,ప్రభాతవార్త:** తన తండ్రి అక్కినేని నాగేశ్వరరావు (ఏఎన్నార్) చదువుకోక పోయినా వేల మందికి బంగారు భవిష్యత్తు ఇచ్చేందుకు కృషి చేశారని ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగార్జున అన్నారు. కృష్ణాజిల్లా గుడివాడలో ఏఎన్నార్ కళాశాల వజ్రోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కళాశాలలో రూసా భవనాన్ని నాగార్జున ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1959లో కళాశాలకు ఏఎన్నార్ రూ.లక్ష విరాళం అందించారన్నారు.

## మూడు దశల పోలింగ్‌లోనూ

# కాంగ్రెస్‌దే హవా

## 6816కు పైగా సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకున్న కాంగ్రెస్

## బిఆర్ఎస్ 3514కి పైగా, బిజెపికి 700 వరకు సర్పంచ్‌లు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, డిసెంబర్17:** గ్రామ పంచాయతీ ఎన్నికలు ముగిసాయి. మూడు దశల్లో జరిగిన ఎన్నికల నేపథ్యంలో అక్కడక్కడ చిన్నపాటి ఘర్షణలు చోటు చేసుకున్నా, ఎక్కడా రీపోలింగ్ లేకుండా ఎన్నికలు ముగిశాయి.మొత్తం 12,726 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరగ్గా మూడు విడతల ఎన్నికల్లోన్లనూ కాంగ్రెస్ హవా కొనసాగింది. తొలి దశలో 2331 సర్పంచ్ స్థానాలను, రెండో దశలో 2245 సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకుంది. మూడో దశలో రాత్రి పొద్దుపోయే వరకు వచ్చిన ఫలితాల మేరకు 2240 సర్పంచ్ స్థానాలను కాంగ్రెస్‌కైవసం చేసుకుంది. బిఆర్ఎస్ మూడు దశల్లోనూ రెండో వరుసలో ఉంది. ఆ పార్టీ మద్దతు సర్పంచ్‌గా గెలిచిన అభ్యర్థులు తొలి దశలో 1168,రెండో దశలో 1188 మంది ఉన్నారు. మూడో దశలో రాత్రి పొత్తుపోయే వరకు వచ్చిన ఫలితాల మేరకు 1155 మంది అభ్యర్థులు ఉన్నారు. బిజెపి తొలి దశ ఎన్నికలో 189 సర్పంచ్ స్థానాలను, రెండో దశలో 268 సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకుంది.

# 200 మెగావాట్ల పవన విద్యుత్

## నైవేలి లిగ్నైట్‌కు, సట్లజ్ జల్ విద్యుత్ నిగమ్‌కు మధ్య ఒప్పందం

**హైదరాబాద్, డిసెంబరు 17, ప్రభాతవార్త:** 200 మెగావాట్ల పవన విద్యుత్ కొనుగోలు నిమిత్తం కేంద్ర ప్రభుత్వ సంస్థలు నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ ఇండియా రెన్యువబుల్స్ లిమిటెడ్ (ఎన్ఐఆర్ఎల్)కు సత్లుజ్ జల విద్యుత్ నిగమ్ (ఎస్‌జెవిఎన్) కు మధ్య ఒప్పందం (పిపిఎ) కుదిరింది. ఈ మేరకు బుధవారం ఎన్ఐఆర్ఎల్, ఎస్‌జెవిఎన్‌కు చెందిన ప్రతినిధులు దీనికి సంబంధించిన ఒప్పందంపై సంతకాలు చేశారు. ఎన్ఐఆర్ఎల్ ఛైర్మన్ భూపేందర్ గుప్తా, ఎన్ఎల్‌సిఐఎల్ సిఎండి మోటుపల్లి ప్రసన్నకుమార్, ఎస్‌జెవిఎన్ సిఎండి సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది.

ఎస్‌జెవిఎన్ యొక్క 600 మెగావాట్ల ఐఎస్‌టిఎస్ పవన విద్యుత్ ప్రాజెక్టులు (విండ్-2 ట్రాన్చే) టారిఫ్ ఆధారిత పోటీ బిడ్డింగ్ ద్వారా పిపిఎ జరిగినట్లు రెండు సంస్థల ప్రతినిధులు ప్రకటించారు.

# ఉప ఎన్నికలకు భయపడే ఎమ్మెల్యేలపై వేటు వేయలేదు: స్పీకర్ తీర్పుపై కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, డిసెంబర్17:** ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐదుగురు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలన్న పిటిషన్లను స్పీకర్ కొట్టివేయడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ అసెంబ్లీ సాక్షిగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని ఆయన బుధవారం ఒక ప్రకటనలో తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాహుల్ గాంధీకి, కాంగ్రెస్ పార్టీకి రాజ్యాంగంపైన, దేశ అత్యున్నత న్యాయ స్థానాలపైన ఏమాత్రం గౌరవం లేదని ఈ ఘటనతో మరోసారి రుజువైందని కేటీఆర్ అన్నారు. కేవలం రాజ్యాంగం పుస్తకాన్ని చేతిలో పట్టుకుని ఫొటోలకు ఫోజులిస్తే సరిపోదని ఎద్దేవా చేశారు. తన తండ్రి రాజీవ్ గాంధీ తెచ్చిన ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని గౌరవించడంలో విఫలమైన అసమర్థ నేతగా రాహుల్ గాంధీ చరిత్రలో నిలిచిపోతారని విమర్శించారు. అభివృద్ధి కోసమే పార్టీ మారామని చెబుతున్న ఎమ్మెల్యేలను కాపాడటం కాంగ్రెస్ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు.కేవలం ఉప ఎన్నికలకు భయపడే కాంగ్రెస్ పార్టీ, ఫిరాయింపుదారులపై చర్యలు తీసుకోవడానికి వెనకాడుతోందని కేటీఆర్ ఆరోపించారు. రేవంత్ రెడ్డి రెండేళ్ల పాలనపై గ్రామాల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, త్వరలో జెడ్‌పిటీసీ,ఎంపిటీసీ ఎన్నికలు రానున్న నేపథ్యంలో కాంగ్రెస్ భయపడుతోందని తెలిపారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవడంలో కాంగ్రెస్ జాప్యం వెనుక ఉన్న భయాన్ని తెలంగాణ సమాజం గమనిస్తోందని అన్నారు.కాంగ్రెస్ పార్టీ ఒత్తిడితోనే స్పీకర్ ఫిరాయింపుల పిటిషన్లకు వ్యతిరేకంగా నిర్ణయం తీసుకున్నారని కేటీఆర్ ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పుల స్ఫూర్తిని విస్మరించి, స్థానిక కాంగ్రెస్ నాయకత్వం ఒత్తిడికి స్పీకర్ తలొగ్గడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. స్పీకర్ తీసుకున్న ఈ నిర్ణయాన్ని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని స్పష్టం చేశారు. సాంకేతిక కారణాలతో ఎమ్మెల్యేలను తాత్కాలికంగా కాపాడుకోవచ్చని, కానీ వారి నియోజకవర్గాల్లోని ప్రజలు ఇప్పటికే ప్రజాక్షేత్రంలో వారిపై అనర్హత వేటు వేశారని కేటీఆర్ పేర్కొన్నారు.స్పీకర్ నిర్ణయం ప్రజాస్వామ్య స్ఫూర్తి, రాజ్యాంగానికి విరుద్ధమని ఆయన అన్నారు. అసెంబ్లీ సాక్షిగా ప్రజాస్వామ్యాన్ని కాంగ్రెస్ ఖూనీ చేసిందని మండిపడ్డారు. రాహుల్ గాంధీకి రాజ్యాంగంపై ఏమాత్రం గౌరవం లేదని పేర్కొన్నారు. ఉప ఎన్నికలకు భయపడే ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయలేదని అన్నారు. పంచాయతీ ఎన్నికల్లో పల్లెపల్లెనా ప్రజావ్యతిరేకత వెల్లువెత్తుతోందని... పార్టీ మారిన వారిని ప్రజలు ఎప్పుడో అనర్హులుగా ప్రకటించేశారని పేర్కొన్నారు.

# తిరుపతి,తిరుచానూరు ఆలయాల్లో సేవలపై భక్తుల అభిప్రాయాలు!

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** దేశవిదేశాల నుండి తిరుమలేశుని దర్శనానికి వస్తున్న అశేష సంఖ్యలో భక్తులు వారి యాత్రలో తొలుత తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయాన్ని, తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయాన్ని సందర్శిస్తున్నారు. తిరుచానూరులో కొలువైన దేవేరి,శ్రీవారి పట్టపురాణి శ్రీపద్మావతిఅమ్మవారిని రోజువారీగా పదివేలమందికిపైగా భక్తులు దర్శించుకుంటున్నారు. మరీ శుక్ర,శని,ఆదివారాల్లో ఈ సంఖ్య మరింతగా పెరుగుతుంది. అలాగే వేంకటేశ్వరస్వామికి అన్నగా పిలువబడే తిరుపతి శ్రీగోవిందరాజస్వామి ఆలయాన్ని కూడా భక్తులు రోజువారీగా ఐదారువేలమంది వరకు దర్శించుకుంటున్నారు. వీరందరికీ ఉదయం నుండి రాత్రి 9గంటల వరకు నిరంతరాయంగా అమ్మవారి, స్వామివారి మూలవిరాట్టు దర్శనం టిటిడి అధికారులు చేయిస్తున్నారు. దర్శనానంతరం స్వామివారి తీర్థప్రసాదాలను కొంతవరకు పంపిణీ చేస్తున్నారు. ఈ ప్రాంతాల్లో ఆలయా లకు అనుబంధంగా మధ్యాహ్నం ఉచిత అన్నప్రసాదం అందిస్తున్నారు. ఇప్పుడు ఈ సేవలపై భక్తుల నుండి అభిప్రాయ సేకరణ చేయాలని టిటిడి అధికారులు నిర్ణయించారు. ఆలయంలోపల దర్శన విధానం, ప్రసాదాల వితరణ ,ఇంకా మెరుగైన దర్శనం చేయించడానికి సలహాలు సూచనలు తీసుకోవాలని టిటిడి ఇఒ అనిల్‌కుమార్ సింఘాల్ అధికారులకు ఆదేశించారు. ఇప్పటికే కలియుగవైకుంఠం తిరుమలలో ఈ తరహాలో భక్తుల నుండి పలురకాల అభిప్రాయాలు సేకరణ చేయడం, వాటిద్వారా విలువైన సమాచారంతో మెరుగైన సేవలందించేలా చూడటంభక్తులు హర్షం వ్యక్తంచేస్తున్న విషయం విదితమే.

# ఉద్యాన పంటలే ఊతం



- 15 జిల్లాల నుంచి 80 శాతం జివిఎ
- అరటి రాబడిదే అగ్రస్థానం.. తర్వాత స్థానాల్లో మిరప, మామిడి, మల్లి, టమాట
- వ్యవసాయరంగంలో లక్ష్యాల సాధనకు 6 వ్యూహాత్మక సాధనాలు
- రైతన్నా మీ కోసం ద్వారా సత్ఫలితాలు
- వ్యవసాయశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్

విజయవాడ, డిసెంబరు 17 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్ర ఆర్థిక వృద్ధికి వ్యవసాయ రంగంలో ప్రధానంగా ఉద్యానవన పంటలే ఊతమిస్తున్నాయని, జిల్లా కలెక్టర్లందరూ తమ జిల్లాలో ఈ రంగంపైన ప్రత్యేక దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ ఎక్స్ అఫిషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్ సూచించారు. జిల్లా కలెక్టర్ల సదస్సులో ఆయన మాట్లాడుతూ వ్యవసాయరంగంలో సాధించాల్సిన లక్ష్యాల గురించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరం వ్యవసాయ రంగంలో 16.47 శాతం వృద్ధి రేటుతో సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. రూ.6,02,728 కోట్లతో 35.19 శాతం స్థూల విలువ జోడింపు (గ్రాస్ వాల్యూ యాడెడ్ జీవీఏ) లక్ష్యమన్నారు. ఈ దిశగా జిల్లా కలెక్టర్లు దృష్టి సారించాలన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి రాష్ట్ర ప్రభుత్వం అన్ని రైతు సేవా కేంద్రాల్లో రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని నిర్మాణాత్మకంగా చేపట్టామన్నారు. దీని ద్వారా ప్రతి రైతు సేవా కేంద్రం పరిధిలో జీవీఏ సాధించడానికి చేపట్టాల్సిన ప్రణాళికను క్షేత్ర స్థాయిలో చేపట్టామన్నారు. దీనిద్వారా సత్ఫలితాలు సాధించబోతున్నా మ న్నారు. ఆయా ప్రాంతంలో జీవీఏకి ఊతమిచ్చే పంటలేవి, వాటిని సాధించ డానికి చేపట్టాల్సిన చర్యలు ఏంటీ అనేది కూడా విపులంగా రూపొందించా మన్నారు. ఒకేసారి మూడు సీజన్లకు సంబంధించి ఈ రబీ సీజన్ రేపు రాబోయే ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు.

### ఉద్యాన పంటలే కీలకం

ప్రాథమికరంగమైన వ్యవసాయ రంగంలో ఐదు ఉప రంగాలున్నాయని, వాటిలో ఉద్యానవన రంగం నుంచే జీవీఏ ఎక్కువగా వస్తోందన్నారు. 16శాతం వృద్ధి రేటు ఈ రంగం నుంచి సాధించాలనేది లక్ష్యమన్నారు. ఉద్యానవన రంగం అందించే జీవీఏలోనూ 15 జిల్లాల నుంచే రూ.1,41,498 కోట్లతో 80 శాతం జీవీఏ సాధిస్తున్నామని చెప్పారు. ఇందులో అనంతపురం, సత్యసాయి, కర్నూలు, కడప, ఎఎస్ ఆర్ జిల్లాలు అగ్రస్థానంలో ఉన్నాయని చెప్పారు. మిగిలిన 15 జిల్లాలు కూడా జీవీఏ వృద్ధి సాధనలో పురోగతి సాధించే దిశగా పనిచేయాలన్నారు.

### 22 పంటల నుంచే అత్యధిక జివిఎ

ఉద్యానవన రంగంలో 22 రకాల ప్రధాన పంటల నుంచే అత్యధికంగా జీవీఏ వస్తోందని తెలిపారు. వీటిలో అరటి, మిరప, మామిడి, మల్లి, టమాటాల అగ్రస్థానంలో ఉన్నాయని తెలిపారు. ఒక్క అరటి పంట రూ.31,656 కోట్లతో 17.84 శాతం జీవీఏ అందిస్తోందన్నారు. తర్వాత ఎండుమిర్చి రూ.22,474 కోట్లతో 12.67 శాతం, మామిడి రూ.14,641 కోట్లతో 8.25 శాతం, మల్లె 10,749 కోట్లతో 6.06 శాతం, టమాట రూ.9,573 కోట్లతో 5.4శాతం జీవీఏ సాధిస్తున్నాయని చెప్పారు. మల్లెపూల సాగు ద్వారా కూడా రాష్ట్రం జీవీఏ గణనీయంగా సాధిస్తోందని తెలిపారు. కృష్ణా జిల్లాలో ఈ పూల సాగు ఎక్కువగా ఉందని, గుండుమల్లె మన రాష్ట్ర పుష్పమని, ఈ సాగును కూడా ఆయా జిల్లాల్లో ప్రోత్సహించడం ద్వారా అధిక జీవీఏ సాధించవచ్చన్నారు. అలాగే మామిడి రైతులకు మామిడి కవర్లు అందించి, నాణ్యత బాగుండేలా రైతులను ప్రోత్సహిస్తే ఇందులో మరింత ఎక్కువ జీవీఏ సాధించవచ్చన్నారు. ప్రాథమిక రంగంలో జీవీఏ వృద్ధి లక్ష్యాలు సాధించడానికి 6 వ్యూహాత్మక సాధనాలు (స్ట్రాటజిక్ లీవర్స్ ) రూపొందించామన్నారు. జిల్లా కలెక్టర్లు తమ తమ జిల్లాలో ఈ రంగంలో ఎక్కడెక్కడున్నాము, ఎక్కడ వెనుకబడ్డాము అనేది ఎప్పటికప్పుడు సమీక్షించుకుని, జీవీఏ వృద్ధి లక్ష్యాలు సాధించాలన్నారు. పాలు, మాంసం, గుడ్డు ఉత్పత్తిలో కూడా జిల్లాలు గణనీయమైన వృద్ధి సాధించాలని దానికి తగ్గట్లు వ్యూహాత్మకంగా పనిచేయాలని వ్యవసాయ

# కలువాయిని తిరుపతిలో ఎందుకు కలపాలి?

**- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు**



కలువాయి (నెల్లూరు), డిసెంబరు 17 ప్రభాతవార్త: కలువాయి మండలానికి అన్ని విధాల సౌకర్యంగా ఉండే నెల్లూరు జిల్లాను వదలి తిరుపతి జిల్లాలో కలపవల్సిన అవసరం ఏమి వచ్చిందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకటగిరి నియోజకవర్గ కన్వీనర్ కలువాయి మండల వాసి ఎస్ఎస్ఆర్ నాయుడు ఆద్వర్యంలో తిరుపతి జిల్లా వద్దు, నెల్లూరు జిల్లా ముద్దు ఉద్యమ కలువాయి జెఏసి, టిడిపి సీనియర్ నాయకులు, బిజెపి నాయకులు కలిసి విజయవాడ దగ్గర స్వర్ణభారత్ ట్రస్టులో బుధవారం మాజీ ఉపరాష్ట్ర పతి వెంకయ్యనాయుడ్ని కలిసి వినతి పత్రం అందజేశారు. మా ప్రాంత వాసుల మొర ఆలకించి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకొని వెళ్ళి న్యాయం చేయాలని ఈ సందర్బంగా మాజీ ఉపరాష్ట్రపతిని కోరారు. టిడిపి నాయకులు నాగిరెడ్డి రాజారెడ్డి, పెరంకొండ వేణునాయుడు, మజ్జిగ పెంచలరెడ్డి, రాపూరు దశరదరామిరెడ్డి, సుల్తాన్, బిజెపి సీనియర్ నాయకులు, సన్నపనేని వేణు గోపాల్ నాయుడు, రాపూరు ఎఎంసి డైరక్టర్ దందు పెంచలయ్య, కలువాయి బిజెపి అద్యక్షులు జి.మల్లికార్జున నాయుడు, రాపూరు బిజెపి అద్యక్షులు దూడల పెంచలయ్య, తదితరులున్నారు.

## 'సేవ్ కలువాయి అంటూ' జలదీక్ష



కలువాయి (నెల్లూరు), డిసెంబరు 17 ప్రభాతవార్త: "సేవ్ కలువాయి అంటూ" కలువాయి మండలం ప్రజలు వినూత్న తరహాలో పెన్నానదిలో దిగి నిరసన తెలిపారు. నదిలో దిగి జలదీక్ష చేశారు. కలువాయిని నెల్లూరులో కలిపే వరకు తమ ఉద్యమం ఆగదని హెచ్చరించారు. ఏప్రాతిపదికన కలువాయిని తిరుపతి లో కలుపుతారని వారు ప్రశ్నించారు. రాజకీయ స్వార్దంతో కలువాయిని తిరుపతిలో కలిపితే ఉద్యమం మరింత తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు. 9వ రోజు రిలే నిరాహార దీక్షలో గ్రామ మాజీ సర్పంచ్ విశ్రాంత ఉపాధ్యాయులు గుడిగుంట శ్రీనివాసులతోపాటు ఉయ్యాలపల్లి ప్రజలు దీక్షలో పాల్గొనగా యుటిఎఫ్, విఓఎలు ఆశా, పొదుపు మహిలు సంఘీబావం తెలిపారు 'గురువారం స్వచ్చంద" బంద్‌కు జెఏసి పిలుపునిచ్చింది. వ్యాపాం సంస్దలు, విద్యాసంస్దలు, ప్రవేటు కార్యాలయాలు స్వచ్ఛంధంగా మూసివేయనున్నట్లు ఆందోళన కారులు తెలిపారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాలు మూపిస్తామని వారు పేర్కొన్నారు.

## హోంమంత్రి అనితకు లోకేష్ ప్రశంస



విజయవాడ, డిసెంబరు 17 ప్రభాతవార్తప్రతినిధి: కానిస్టేబుళ్ల నియామక ప్రక్రియను యజ్ఞంలా పూర్తి చేశారని హోం మంత్రి అనితను మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ ప్రశంసించారు. పోస్టుల భర్తీని అడ్డుకునే కుట్రలను అనిత సమర్థంగా ఎదుర్కొన్నారని కితాబు ఇచ్చారు. హోంమంత్రితో పాటు అధికార యంత్రాంగానికి లోకేశ్ ధన్యవాదాలు తెలిపారు. తాను యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు 6,000 కానిస్టేబుల్ పోస్టుల భర్తీ ప్రక్రియను హోంమంత్రి ఆధ్వర్యంలో విజయవంతంగా పూర్తి చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియను ఒక యజ్ఞంలా పూర్తి చేశారంటూ మంత్రి అనితకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. "యువగళం పాదయాత్రలో కానిస్టేబుళ్ల పోస్టులు భర్తీ చేస్తామని హామీ ఇచ్చాను. కానిస్టేబుల్ పోస్టుల భర్తీని కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. నా హామీని నెరవేర్చేందుకు కానిస్టేబుళ్ల ఎంపిక ప్రక్రియను ఒక యజ్ఞంలా చేపట్టి పూర్తి చేసిన గౌరవ హోం మంత్రి వంగలపూడి అనితకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ పోస్టుల భర్తీని అడ్డుకునేందుకు వేసిన కుట్రపూరిత కేసులను అత్యంత చాకచక్యంగా పరిష్కరించడం వెనుక అధికార యంత్రాంగానికి హోంమంత్రి పూర్తి సహాయ, సహకారాలు అందించారు. సీఎం, డిప్యూటీ సీఎం చేతుల మీదుగా కానిస్టేబుళ్లకు నియామక పత్రాలు అందజేసే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన హోం మంత్రికి, అధికార, పోలీసు యంత్రాంగానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను" అంటూ లోకేశ్ ట్వీట్ చేశారు.

# యూరియా కొరతతో రైతులకు చుక్కలు

**- ఎక్కడా లభ్యం కాకపోవడంతో ఇబ్బందుల్లో అన్నదాత**



చిత్తూరు, డిసెంబరు 17 ప్రభాతవార్త: యూరియా కొరత తీవ్రంగా వుండటంతో పంటలు సాగు చేస్తున్న రైతులకు చుక్కలు కన్పిస్తున్నాయి. యూరియా కోసం ఆర్‌బికెలు, మండల కేంద్రాల్లోని ఎరువుల ఏజెన్సీలు, సహకార సంఘాల వద్దకు వెళ్తున్నప్పటికీ ఎక్కడా యూరియా లభ్యం కాని పరిస్థితి నెలకొంది. పంటల సాగుకు ప్రస్తుతం నీరు సమృద్ధిగా వున్నప్పటికీ యూరియా లేకపోవడంతో పైర్లు ఏపుగా పెరగక పోవడంతో ఈసారి దిగుబడి తక్కువ అవుతుందని రైతులు విలపిస్తున్నారు. ఓ వైపు జిల్లాలో ఒక్క బస్తా యూరియా లభించక రైతులు అల్లాడుతుంటే వ్యవసాయ శాఖ మాత్రం ఇందుకు విరుద్ధంగా రైతులకు సరిపడ యూరియా నిల్వలు వున్నాయని, జిల్లాలో ఎక్కడా యూరియా కొరత అనే మాట లేదని ప్రకటనలు ఇస్తుండటంతో రైతులు తీవ్ర అసహనానికి గురవుతున్నారు. గత పది రోజులుగా జిల్లా కేంద్రం చిత్తూరుతో పాటు పరిసర మండలాలైన బంగారుపాళ్యం, పూతలపట్టు, యాదమరి, జిడినెల్లూరు, గుడిపాల తదితర మండలాల్లో యూరియా కొరత తీవ్రంగా వుంది. ఈ మండలాల్లో వ్యవసాయ శాఖ అధికారుల వద్దకు వెళ్ళి యూరియా పరిస్థితిని రైతులు అడిగితే మండలానికి అవసరం కంటే ఎక్కువ యూరియా పంపిణీ చేశామని, రైతులు ఇబ్బంది పడకుండా వుండటానికి యూరియా తెప్పిస్తున్నామని, వారం రోజుల్లో రావచ్చునని, వచ్చిన వెంటనే ఆర్‌బికెల ద్వారా రైతులకు పంపిణీ చేయడానికి చర్యలు తీసుకుంటామనే సమాధానం వస్తోంది.

### రబీకి సరిపడ యూరియా

**- 20,183 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీకి ప్రణాళిక**

జిల్లాలో రబీ సీజన్‌లో పంటల సాగుకు అవసరం అయ్యే యూరియాను పంపిణీ చేయడానికి వ్యవసాయశాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ మేరకు చిత్తూరు జిల్లా పరిధిలో 2025-26 రబీ సీజన్‌లో అన్ని రకాల పంటల సాగు చేయడానికి 20,183 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని గుర్తించి ఆ మేరకు వ్యవసాయ శాఖ ప్రణాళికను తయారు చేసింది. జిల్లాలో ఈ ఏడాది అక్టోబర్ 1నాటికి 2,047 మెట్రిక్ టన్నుల యూనియా ప్రారంభ నిల్వలు అందుబాటులో వున్నాయి. డిసెంబర్ 31వ తేదీ వరకు రైతులకు మొత్తం 5,747 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా ఇప్పటికే 6,617 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందుబాటులో వుంచారు. అలాగే డిసెంబర్ నెలాఖరు నాటికి జిల్లాకు మరో 600 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు అందుబాటులోకి రానుంది. జిల్లాలో ఇప్పటి వరకు 4,217 మెట్రక్ టన్నుల యూరియా విక్రయాలు జరిగాయి. ఈ నెల 11వ తేదీ నుండి డిసెంబర్ నెలాఖరు వరకు రైతులకు 1,247 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా ప్రస్తుతం 2007 మెట్రిక్ టన్నుల యూరియా ఆర్ఎస్‌కెలు, మార్క్‌ఫెడ్ గోదాములు, రిటైల్, హోల్‌సేల్ డీలర్లు, కో-ఆపరేటివ్ సొసైటీలు, కంపెనీ గోడౌన్లలో అందుబాటులో వుంది. జిల్లాలో ఇప్పటి వరకు ఎరువుల కొరత లేదని వ్యవసాయ శాఖ పేర్కొంది. అలాగే నానో యూరియా, నానో డిఎపిని అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని, ఇవి సాంప్రదాయక ఎరువులకు వంద శాతం ప్రత్యామ్నాయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీటిని ప్రోత్సహిస్తున్నాయి.

# వైసిపి నేతల అక్రమాలపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు వెల్లువ

- వారసత్వ భూమిపై మోసపూరిత రిజిస్ట్రేషన్.. న్యాయం చేయాలంటూ విజ్ఞప్తి
- ఇంటి తనఖా పేరు మోసం.. డబ్బులు చెల్లించమని అడిగితే చంపుతామని బెదిరింపులు
- అర్జీలు స్వీకరించిన గుంటూరు కార్పొరేషన్ మేయర్ కోవెలమూడి నాని, ఎపి స్టేట్ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ అడ్వైజరీ కమిటీ ఛైర్మన్ గొట్టిముక్కల రఘురామరాజు

విజయవాడ, డిసెంబరు 17 ప్రభాతవార్త ప్రతినిధి: అన్నమయ్య జిల్లా సంబేపల్లె మండలం శెట్టిపల్లె గ్రామానికి చెందిన జయరాం అఖండ నాయక్ నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో నేతలకు అర్జీ ఇచ్చి అభ్యర్థిస్తూ తమ గ్రామ పరిధిలో వృత్తిరీత్యా కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నాను. 2019-20 సంవత్సరంలో ఆర్అండ్‌బి డిపార్ట్మెంట్ పరిధిలో గుట్టపల్లె-కోన నుంచి సంబేపల్లె వరకు (వయా శెట్టిపల్లె) సుమారు 20 కిలోమీటర్ల మేర రోడ్డు మరమ్మత్తుల పనులకు సంబంధించిన టెండర్ తనకు లభించింది సదరు పనిని పూర్తిగా నిర్వహించాను. అయితే అప్పటి వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన యం. చిదంబర్ రెడ్డి అనే వ్యక్తి అన్యాయంగా జోక్యం చేసుకుని సదరు పనులకు సంబంధించిన బిల్లుల మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నాడు. ఈ ఘటన వల్ల తనకు తీవ్ర ఆర్థిక, మానసిక ఇబ్బందులు కలిగాయి. కావునా వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని నేతలు గుంటూరు కార్పొరేషన్ మేయర్ కోవెలమూడి నాని, ఏపీ స్టేట్ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ అడ్వైజరీ కమిటీ ఛైర్మన్ గొట్టిముక్కల రఘురామరాజులకు అర్జీ ఇచ్చి అభ్యర్ధించాడు.

చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం ఎంసీ కొత్తూరు గ్రామానికి చెందిన బాలాజీ గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో తమ కుటుంబానికి చెందిన సర్వే నెంబర్ 302/2, విస్తీర్ణం 2.45 సెంట్లు గల పిత్రార్జిత భూమిని ఇప్పటికీ తామే అనుభవంలో ఉంచుకుని సాగు చేసుకుంటున్నాం. అయితే శ్రీహరి కుమార్ రాజు అనే వ్యక్తి 1407 2008 తేదీన తమకు తెలియకుండా తమ తండ్రిని మోసం చేసి ఆ భూమిని తన పేరున రాసించుకున్నాడు. ఆ సమయంలో తాము అందరం మైనర్లుగా ఉండటంతో ఈ అక్రమ రిజిస్ట్రేషన్ విషయం తెలియకపోయింది. ఇప్పుడు విషయం తెలిసిన తరువాత సంబంధిత అధికారులను ఆశ్రయించినా ఇప్పటి వరకు న్యాయం జరగలేదు. కావున వారిపై చర్యలు తీసుకోని ఈ వ్యవహారాన్ని సమగ్రంగా విచారించి మోసపూరితంగా రాసుకున్న రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసి తమ పిత్రార్జిత భూమిని తిరిగి తమకు అప్పగించాలని కోరారు.

కృష్ణా జిల్లా గుడివాడ మండలం లింగవరం గ్రామానికి చెందిన సురేష్ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. పెదపాడు మండలం వసంతవాడ గ్రామానికి చెందిన వెంకట శ్రీరామ మూర్తి, జ్యోతి రవితేజ, నవ్యశ్రీ అనే వ్యక్తులు తమ ఇంటిని తనఖా పెట్టి 21122022 తేదీన తన వద్ద నుంచి రూ.5,00,000/ (అక్షరాలా ఐదు లక్షల రూపాయలు) తీసుకున్నారు. ఒక సంవత్సరంలో మొత్తం సొమ్మును తిరిగి చెల్లిస్తామని నమ్మబలికారు. అయితే ఒక సంవత్సరం గడిచి రెండు నెలలు అయినప్పటికీ సొమ్ము తిరిగి ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారు. తన ఆర్థిక పరిస్థితి దృష్ట్యా పలుమార్లు డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగితే "మేము ఇవ్వము, మాకు రాజకీయంగా బలమైన వ్యక్తుల మద్దతు ఉంది అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఇటీవల మరలా డబ్బులు అడిగిన సందర్భంలో తమ వద్దకు వస్తే చంపుతామని బెదిరింపులు చేశారు. తమయందు దయవుంచి వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

ప్రకాశం జిల్లా త్రిపురాంతకము గ్రామానికి చెందిన రమేష్ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో సర్వే నెం. 134 1ఏ1 లో భూమి కలదు. ఆ భూమి నిషేదిత జాబితలో ఉన్నది. ఈ విషయంపై స్థానిక తహసీల్దార్ సంప్రదించగా ఆ భూమి పట్టా భూమి అని చెప్పారు. నిషేధిత జాబితాలో కొనసాగుతుండ టంతో ఎలాంటి లావాదేవీలు చేయలేని పరిస్థితి నెలకొంది. తాను ముడివేముల గ్రామానికి చెందిన అన్నసూయ వద్ద నుండి సదరు స్థలాన్ని కొనుగోలు చేసి స్వాధీనం చేసుకున్నాను. కావున సంబంధిత అధికారుల చేత సదరు భూమిని సమగ్రంగా పరిశీలించి నిషేధిత జాబితా నుంచి తొలగించి న్యాయం చేయాలని కోరాడు.

అన్నమయ్య జిల్లా కురబలకోట మండలం మజాకోరువువారిపల్లి గ్రామానికి చెందిన వెంకటరమణ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో సర్వే నంబర్ 12413లో ఉన్న భూమిని తమ తాత ఆకుల వెంకటస్వామి, తమ తండ్రి నారాయణప్పలు 1955 సంవత్సరం నుంచే సుమారు 50 ఏళ్లుగా సాగు చేసుకుంటూ వచ్చారు. అయితే అదే గ్రామానికి చెందిన మునిరెడ్డి, అమ్మిరెడ్డి, రవీంద్రరెడ్డి అనే ముగ్గురు వ్యక్తులు కలిసి తాము సాగు చేస్తున్న భూమికి సంబంధించి తనకు తెలియకుండా ప్రభుత్వానికి తప్పుడు రికార్డులు సమర్పించి భూమిని అక్రమంగా తమ పేర్లపై నమోదు చేసుకుని తరువాత ఇతరులకు విక్రయించారు. ఈ విషయంపై రెవెన్యూ అధికారుల చుట్టూ పలుమార్లు తిరిగినప్పటికి ఎలాంటి న్యాయం జరగలేదు. కావునా వారిపై చర్యలు తీసుకోని తమ భూమి సమస్యను పరిష్కరించాలని కోరాడు.

పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లి గూడెంకు చెందిన మందమ్మ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమకు తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం వెలుబండ గ్రామ పంచాయతీ పరిధిలో సుమారు 500 చదరపు గజాల స్థలం ఉంది. సదరు స్థలం చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ అయింది. అయితే తమ స్థలాన్ని కొందరు అక్రమంగా ఆక్రమించారు. కావున తమ స్థలాన్ని గుర్తించి తమ న్యాయం చేయాలని కోరారు.

అన్నమయ్య జిల్లా నిమ్మనపల్లి మండలం దేవలం కురవపల్లి గ్రామానికి చెందిన వెంకటరమణ అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. ముష్టూరులో సర్వే నంబర్లు 179, 182లలో విస్తీర్ణం 4.39 ఎకరాల భూమి ఉంది. ఆ భూమి తన, నారాయణ అనే వారిపై పేరుపై పట్టా మంజూరు చేయాలని కోరారు. వీటితో పాటు పలువురు పింఛన్, రేషన్, ఇళ్ల నిర్మాణాల సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని కోరగా.. మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్‌లు ఇచ్చారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం, ఆర్థికతోడ్పాటు కల్పించాలని మరికొందరు అభ్యర్థనలు అందించారు.


# సివిల్స్‌లో మెరిసిన అనంత ఆణిముత్యం

**హరికృష్ణ ప్రసాద్‌కు 22వ ర్యాంకు**



అనంతపురం, డిసెంబరు 17 ప్రభాతవార్త బ్యూరో: సివిల్ సర్వీస్ ఫలితాల్లో అనంతపురం జిల్లా కుర్రాడు అత్యుత్తమ ర్యాంకు సాధించి చరిత్ర సృష్టించారు. ఆత్మకూరు మండలం సిద్దిరాంపురం గ్రామానికి చెందిన తాళ్లూరు హరికృష్ణ ఈ ఏడాది సివిల్ సర్వీస్ పరీక్ష ఫలితాల్లో 22వ ర్యాంక్ సాధించడం విశేషం. హరికృష్ణ ప్రసాద్ ఐఈఎస్‌లో మంచి ర్యాంకు సాధించడం పట్ల ప్రజల్లో వ్యక్తం అవుతోంది. సామాన్య రైతు కుటుంబం తల్లూరు నిర్మల, తల్లూరు వెంకటేశ్వర ప్రసాద్ దంపతులకు హరికృష్ణ ప్రసాద్ జన్మించారు. చిన్నప్పుడు నుంచి కష్టపడి చదివి రాణించారు. ఢిల్లీ ఐఐటి నుంచి గ్రాడ్యుయేషన్ తీసుకున్నారు. ప్రస్తుతం చిత్తూరు జిల్లా కుప్పంలో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. హరికృష్ణ ప్రసాద్‌కు సివిల్ సర్వీస్ పరీక్షల్లో మంచి ర్యాంకు రావడం పట్ల అనంతపురం, చిత్తూరు జిల్లాలకు సంబంధించి అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు హర్షం వ్యక్తం చేయడంతో పాటు హరికృష్ణ ప్రసాద్‌కు ఫోన్ చేసి అభినందించారు.

# పరకామణి చోరీ: జగన్ వ్యాఖ్యలపై సాధుపరిషత్ ఫైర్



విజయవాడ, డిసెంబరు 17 ప్రభాతవార్త ప్రతినిధి: పరకామణి చోరీని చిన్న కేసు అని మాజీ సీఎం వైఎస్ జగన్ వ్యాఖ్యానించడంపై సాధుపరిషత్ ఆగ్రహం వ్యక్తం చేసింది. హిందువులంటే వైఎస్సార్సీపీ నేతలకు అంత హీనంగా కనిపిస్తున్నారా అని ఏపీ సాధుపరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి ఆగ్రహించారు. విశాఖలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేంకటేశ్వర స్వామిని కించపరిచేలా జగన్ మాట్లాడతారా అని, ఆయన వ్యాఖ్యలు వింటుంటే గుండె పగిలిపోతోందని మండిపడ్డారు. వేంకటేశ్వరస్వామి గురించి మాట్లాడేటప్పుడు ఎంతో భక్తిభావంతో ఉండాలని హైకోర్టు మొట్టికాయలు వేసినా జగన్‌కు బుద్ధి రాలేదని విమర్శించారు. హిందూ మతం, దేవాలయాలపై దాడి చేయడమే వైఎస్సార్సీపీ పనిగా పెట్టుకుందని అన్నారు. ఆ పార్టీ నేతలు హిందువుల పక్షాన ఎప్పుడు నిలబడ్డారో చెప్పాలని శ్రీనివాసానంద సరస్వతి నిలదీశారు. "హిందువులంటే వైఎస్సార్సీపీ నేతలకు అంత హీనంగా కనబడుతున్నారా. వెంకటేశ్వరస్వామిని కించపరిచేలా మాజీ సీఎం జగన్ మాట్లాడతారా. మాజీ సీఎం జగన్ వ్యాఖ్యలు చూస్తే గుండె పగిలిపోతుంది. వెంకటేశ్వరస్వామి గురించి మాట్లాడేటప్పుడు ఎంత భక్తిభావంతో మాట్లాడాలి. హైకోర్టు మొట్టికాయలు వేసినా జగన్‌కు బుద్ధి రాకపోతే ఏం చేయలేం. హిందూ మతం, దేవాలయాలపై దాడి చేయడమే వైఎస్సార్సీపీ పనిగా పెట్టుకుంది. హిందువులకు చేసిన మంచిపని ఒక్కటైనా వైఎస్సార్సీపీ నేతలు చెప్పగలరా. వైఎస్సార్సీపీ నేతలు ఏ రోజు హిందువుల పక్షాన నిలబడ్డారో చెప్పాలని డిమాండ్ చేశారు.



# పోష్‌పై అవగాహన ఉండాలి

- ఇబ్బంది పెడితే భయపడకుండా వెంటనే తెలియజేయాలి
- విద్యార్థినులతో మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ శైలజ

శ్రీకాకుళం, డిసెంబరు 17 ప్రభాతవార్త: లైంగిక వేధింపులను ఎదుర్కొనేందుకు మహిళలకు చట్టాలపై అవగాహన అత్యంత కీలకం, భయం వల్ల మౌనం పాటించకుండా ధైర్యంగా ముందుకు రావాలని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ డా. రాయపాటి శైలజ పిలుపునిచ్చారు. మహిళలు, బాలికలు గౌరవం, భద్రతతో జీవించే హక్కు రాజ్యాంగం కల్పించిన మౌలిక హక్కు అని అన్నారు. ఎచ్చెర్ల ఐఐఐటి విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన పోష్, లైంగిక వేధింపులపై అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. లైంగిక వేధింపులు అనేవి కేవలం శారీరకమే కాకుండా, మాటలు, సంకేతాలు, అసభ్య వ్యాఖ్యలు, మెసేజ్‌లు, సోషల్ మీడియా ద్వారా కూడా జరుగుతాయని విద్యార్థులకు వివరించారు. గుడ్ టచ్ – బ్యాడ్ టచ్ పట్ల స్పష్టమైన అవగాహన ఉండాలని సూచించారు. పని చేసే ప్రదేశాల్లో లైంగిక వేధింపులను నిరోధించేందుకు 2013లో పిఓఎస్‌హెచ్ చట్టం అమలులోకి వచ్చింది, ప్రతి సంస్థలో అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు తప్పనిసరి. కమిటీలు బలంగా పనిచేస్తేనే భయరహిత వాతావరణం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన మహిళపై ఒత్తిడి, బెదిరింపులు, ప్రతీకార చర్యలు తీసుకోవడం చట్టరీత్యా నేరమని, మహిళా కమిషన్ ఫిర్యాదుదారుల గోప్యత, భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు, విద్యార్థులు అవగాహన పొందేలా సెమినార్లు, వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇబ్బంది ఏదైనా ఉంటే తప్పకుండా తెలియజేయాలని, మహిళా కమిషన్ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యాశాఖ ఛైర్మన్, ఎచ్చెర్ల ఐఐఐటి ఛాన్సలర్ ప్రొఫెసర్ కొత్తా మధుమూర్తి, ఐఐఐటి డైరెక్టర్ కె. బాలాజీ, పరిపాలనాధికారి రామకృష్ణ, డీన్ డా. శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## షర్మిలకు బర్త్‌డే విషెస్ చెప్పిన సిఎం, డిసిఎం

విజయవాడ, డిసెంబరు 17 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల బుధవారం తన 51వ జన్మదినాన్ని జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా షర్మిలకు సిఎంతోపాటు వివిధ పార్టీల నేతలు రాజకీయ పార్టీలకు అతీతంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా షర్మిలకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. "ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకి జన్మదిన శుభాకాంక్షలు. ఆమెకు మంచి ఆరోగ్యం, దీర్ఘాయుష్షు ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాను" అని చంద్రబాబు తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా పిసిసి చీఫ్ వైఎస్ షర్మిలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. భగవంతుడు ఆమెకు చిరాయువు, సుఖ సంతోషాలు అందించాలని పవన్ కల్యాణ్ ఆకాంక్షి ంచారు. అయితే, షర్మిల సోదరుడు, వైసీపీ అధినేత జగన్ మాత్రం ఆమెకు బహిరంగంగా శుభాకాంక్షలు తెలుపలేదు. అన్నాచెల్లెళ్ల మధ్య ఉన్న రాజకీయ విభేదాల నేపథ్యంలో ఈ పరిణామం మరోసారి వారి మధ్య దూరాన్ని స్పష్టం చేస్తోంది.

# తిరుప్పావై

## 3వ పాశురము



ఓంగి యులకళన్ద ఉత్తమన్
పేర్ పాడి
నాంగళ్ నమ్బావైక్కుచ్చాత్తి
నీరాడినాల్,
తీంగిన్ఱి నాడెల్లామ్ తింగళ్
ముమ్మారి పెయ్దు
ఓంగు పెరుం శెన్నెలూడు
కయలుగళ,
పూంగువళై ప్పోదిల్ ప్పాఱివణ్ణు
కణ్పడుప్ప,
తేం గాదే పుక్కిరున్దు శీర్తములై
పత్తి వాంగ,
క్కుడమ్ నిఱైక్కుమ్ వళ్ళల్
పెరుమ్బశుక్కళ్
నీంగాద శెల్వమ్ నిఱైన్దేలో
రెమ్బావాయ్.


బలిచక్రవర్తి వామనుడికి మూడడుగుల దానము ఇచ్చాడు. మూడు అడుగులతో మూడులోకాలు తన పాదముతో కొలిచాడు వామనుడు. అతనిని మనము కీర్తించుదాము. నెలకు మూడువానలు పడాలి. వరి చేలు బాగా పండాలి. చేపలు పుష్కలంగా ఉంటాయి. కలువపూలు వికసిస్తాయి. తుమ్మెదలు వాటి మకరందాన్ని సేవించి మత్తుతో నిదురిస్తాయి. పొదుగు తాకగానే పుష్కలంగా కడవలకొద్దీ పాలిచ్చే గోవులు ఉండాలి. దేశము తరగని సిరులతో నిండి ఉండాలి. ప్రజలు సుఖంగా. ఉండాలి. వ్రతమను వంకతో మనమంతా స్నానము చేయుదము రండని గోపికలను ఆహ్వానిస్తుంది.

ఫలం: 'ఇహలోక, పరలోక సంపద పొందుటకు'

## ఈ కాలంలో పెదాలు తేమగా..

**చలికాలంలో పెదాలు పొడిబారడం సహజం. కొంతమందికి దీని తీవ్రత ఎక్కువగా ఉంటుంది. అందుకే ఈ సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది, పెట్రో లిప్ బామ్.. తరచుగా వాడుత. వీటితో పాటు కొన్ని సహజ చిట్కాలు పాటిస్తే పెదవులు పొడిబారకుండా కాపాడుకోవచ్చంటున్నారు నిపుణులు.**

గులాబీ రేకులతో..కొన్ని గులాబీ రేకులు తీసుకొని పచ్చిపాలలో కొన్ని గంటల పాటు నానబెట్టాలి. తర్వాత వాటిని, మెత్తని ముద్దలా చేసు కోవాలి. లిప్ బామ్కి బదులుగా ఈ మిశ్రమాన్ని ఉపయోగించవచ్చు. రోజులో మూడు నుంచి నాలుగుసార్లు ఈ గులాబీ పేస్ట్ని పెదాలపై అప్లై చేసుకుంటే వాటి మృదుత్వాన్ని కాపాడుకోవచ్చు. క్రమంగా ఈ చిట్కా పాటిస్తే కొన్నాళ్లకు అధరాలు గులాబీ రంగులోకి మారతాయి.



పాలమీగడతో..పాలమీగడలో ఉండే కొవ్వు పదార్థాలు పెదాలకు మంచి మాయిశ్చరైజర్గా పనిచేస్తాయి. అలాగే. పగిలిన పేదల్ని తిరిగి మృదువుగా మారుస్తాయి. ఈ ఫలితాన్ని పొందడం కోసం పాలమీగడను పెదవులకు రాసి కాసేపు ఆరనివ్వాలి. ఆ తర్వాత గోరువెచ్చని నీటిలో ముంచిన దూదితో తుడిచేస్తే సరిపోతుంది. ఇలా క్రమం తప్పకుండా చేస్తే ఫలితం ఉంటుంది. ఇవి కూడా..తొక్క తీసిన కీరాదోస ముక్కను మెత్తగా చేసుకోవాలి. ఈ గుజ్జును పెదాలకు రాసుకొని ఇరవై. నిమిషాల పాటు ఆరనివ్వాలి. ఆ తర్వాత చల్లని నీటితో కడిగేస్తే ఫలితం కనిపిస్తుంది. ఆదరాలను రోజూ కొబ్బరి నూనెతో మర్దన చేసు కుంటూ ఉంటే పొడిబార కుండా ఉంటాయి. అముదంలో మూడు నుంచి ఐదు చుక్కల చొప్పున గ్లిజరిన్, నిమ్మరసం కలిపి మిశ్రమంగా చేసుకోవాలి. దీన్ని పెదవులకు అప్లై చేసుకుంటే మంచి ఫలితం కనిపిస్తుంది. నిద్రపోయే ముందు తాజా వెన్న రాసుకోవడం ద్వారా పెదవులు పొడిబారకుండా కాపాడుకోవచ్చు. □

# మహిళా సాధికారత లక్ష్యంగా !

**రెక్కలొచ్చి ఎగిరిపోయి.. పట్టణాల్లో జీవనానికి అలవాటు పడిన వాళ్లని పల్లెకు రమ్మంటే వస్తారా? వచ్చినా చుట్టపు చూపుగానే. మనసంతా కాంక్రీటు నగరాల మీదే ఉంటుంది. అలాంటిది విదేశాల్లో విలాసవంతమైన జీవితాన్ని వదులుకుని పుట్టిన ఊరుకు సేవ చేయాలని తలచారు**



మధ్యప్రదేశ్, నర్సింగ్పుర్ జిల్లాలోని మెహ్రాగావ్లో పుట్టి పెరిగారు మాయ. మహిళలు బయటికి రావడమే గగనం అక్కడ. అలాంటిచోట పట్టుబట్టి చదువుకున్నారు. జబల్పుర్లోని రాణి దుర్గావతి విశ్వవిద్యాలయంలో చేరి బయోకెమిస్ట్రీలో బ్యాచిలర్స్, మాస్టర్స్ పూర్తిచేశారు. ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లారు. లుకేమియాపై పరిశోధనలు చేస్తూ.. పిహెచ్డి పట్టాను పొందారీమె. తర్వాత ఉద్యోగం, పెళ్లి, కుటుంబం అన్నీ అక్కడే. అప్పుడప్పుడూ సొంతూరుకు వచ్చి వెళుతుండేవారట. చుట్టూ ఎంత అభివృద్ధి ఉన్నా.. తన ఊరి మహిళల జీవనవిధానాల్లో మార్పు లేకపోవడం గమనించారీమె. ముఖ్యంగా రుతుక్రమ పరిశుభ్రతలో వెనకబడిన తన గ్రామాన్ని చూసి చలించిపోయారు. అనారోగ్యానికి గురవుతూ, సరైన చికిత్స లేక మూఢ నమ్మకాలతో ప్రాణాలపైకి తెచ్చుకుంటున్న వాళ్లను చూసి. .ఆ పరిస్థితుల్లో మార్పు తేవాలనుకున్నారు.

**ఫౌండేషన్కు బీజం ...** తన ఆలోచనల్ని భర్తకు చెబితే.. ఆయనా సరే అన్నారట. ఆర్థికంగా సహకారం అందిస్తానని భరోసానూ ఇచ్చారట. దాంతో 2016లో మెహ్రాగావ్లో 'సుకర్మ ఫౌండేషన్'ను ఏర్పాటుచేశారు మాయ. దీనిద్వారా స్థానిక మహిళల్లో రుతుక్రమ పరిశుభ్రత, శానిటరీ న్యాప్కిన్ల వినియోగం వంటి వాటిపై ప్రచారం మొదలుపెట్టారు. 'తరాలుగా పాతుకుపోయిన సమస్య ఇది. మొదట్లో కనీసం మాట్లాడటానికి కూడా ఇష్టపడేవారు కాదు. తిట్టుకుంటూ వెళ్లిపోయేవారు. నెలల ప్రయత్నం తర్వాత వాళ్లలో మార్పు వచ్చింది. కానీ ఆర్థిక కష్టాలు వెంటాడేవి. అందుకే నా పొదుపు మొత్తం, ఫండింగ్ ద్వారా సేకరించిన నిధుల్ని పెట్టి 'నో టెన్షన్' అనే సంస్థను ప్రారంభించా. శానిటరీ న్యాప్కిన్ల తయారుచేసే యంత్రాలను కొనుగోలు చేసి.. వాటి తయారీ విధానాన్ని మహిళలకు నేర్పించాం. దీని వల్ల రుతుక్రమ సమస్యలకు పరిష్కారం దొరికింది. ఆర్థిక స్వావలంబనకు బీజమూ పడింది. అలా తక్కువ ధరకు ఊరంతా ప్యాడ్లు పంపిణీ చేశాం. ఇప్పటికీ చేస్తున్నాం' అనే మాయ ఆమె అందించిన సేవలకు గానూ 'భారతదేశపు ప్యాడ్ ఉమెన్'గా గుర్తింపు పొందారు. మహిళల హక్కుల కోసం గళం వినిపించాలనే ఉద్దేశంతో లోక్సభ ఎన్నికల్లో పాల్గొన్నా.. విజయం సాధించలేకపోయారు. 2022 పంచాయతీ ఎలక్షనలో ఏకగ్రీవంగా ఎన్నికై సర్పంచ్గా సేవలందిస్తున్న మాయ ప్రయాణం స్ఫూర్తిదాయకమే కదూ! □


# అది మహిమ కాదు, మానసిక రుగ్మత

## వ్యథ



**ఎన్.బి.సుధాకర్రెడ్డి**
**సైకాలజిస్టు**

ప్రశ్న: మా అమ్మ వయస్సు 45 సంవత్సరాలు. ఆమెకు అప్పుడప్పుడు పూనకం వస్తుంది. ఆమెకు 15 ఏళ్ల వయస్సు నుంచి ఈ సమస్య ఉందని చెప్పింది. ఒక్క పలుచగా సన్నగా ఉంటుంది. గుళ్ళకు వెళ్లినప్పుడు అక్కడి వాయిద్యాల, డప్పుల శబ్దం విన్నప్పుడు ఊగి పోతుంది. ఎవేవో మాటలు, సూక్తులు చెపుతుంది. ఒక్కో సారి తాను గంగమ్మ అంటూ మాట్లాడుతుంది. గెంతులు వేసి నీరసించి పోతుంది. అలాంటి సమయంలో కొందరు మా అమ్మకు బొట్టు పెట్టి కాళ్ళు మొక్కి వేడు కుంటారు. నేను బి టెక్ చదువుతున్నాను. అది ఒక మానసిక సమస్య అని నా భావన. అయితే మా బంధువులు, తెలిసిన వారిలో ఎక్కువ మంది అదొక మహిమగా చెపుతారు. కొందరు మంత్రాలు వేసి, తాయత్తు కడితే తగ్గుతుంది అంటారు. దీనిపై శాస్త్రీయ అవగాహన కల్పించండి.- ఒక సోదరి, రాజమండ్రి



జవాబు: అమ్మా పూనకం దేవతల అవాహం అన్న భావన మన సమాజంలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉంది. అయితే ఆధునిక మానసిక వైద్య శాస్త్రం దీనిని భిన్నంగా విశ్లేషిస్తోంది. పూనకం సమయంలో వ్యక్తిలో శరీరం ఊగుతుంది. నియంత్రణ లేని మాటలు, భిన్న స్వరం వినిపిస్తుంది. స్పృహలో మార్పు వచ్చి అసాధారణ ప్రవర్తిస్తారు. భక్తి, విశ్వాసం, సంప్రదాయం కోణంలో చాలామంది పూనకాన్ని దేవుని అంశంగా భావిస్తారు. ఆ వ్యక్తి చెప్పే మాటలకు సామాజికంగా గౌరవం కూడా ఇస్తారు. కానీ ఇది వైద్య శాస్త్రీయ నిర్ధారణ కాదు. మానసిక వైద్యుల ప్రకారం పూనకం సాధారణంగా కొన్ని రుగ్మతల లక్షణాలు. డిస్ అసోసియేటివ్ డిసార్డర్ (విచ్ఛిన్న మానసిక స్థితి), కన్వర్షన్ డిసార్డర్, సామూహిక మానసిక ప్రభావం, తీవ్రమైన భయం, ఒత్తిడి, ఆందోళన వల్ల ఈ సమస్య కనిపిస్తుంది. బాల్యంలో ఎదురైన మానసిక గాయాలు, హార్మోన్ల సమస్యలు ఇందుకు కారణం కావచ్చు. అయితే ఒకసారి, ప్రత్యేక సందర్భంలో, తాత్కాలికంగా జరిగితే అది తీవ్రమైన రుగ్మత కాకపోవచ్చు. కానీ తరచూ, నియంత్రణ లేకుండా, వ్యక్తి జీవితాన్ని దెబ్బతీసే స్థాయిలో జరిగితే తప్పకుండా వైద్య పరీక్ష అవసరం. మానసిక వైద్య పరీక్ష చేస్తే పూర్తి విషయం తెలుస్తుంది. కౌన్సెలింగ్, చికిత్స, మందుల వాడకం ద్వారా పూర్తిగా నియంత్రించవచ్చు. పూజలు, తంత్రాలు పరిష్కారం కావు అన్న విషయం గ్రహించాలి. పూనకం మహిమ అనడం కంటే, మానసిక సమస్యగా గుర్తించి సైకియాట్రిస్ట్ ద్వారా చికిత్స చేయించండి. విశ్వాసాన్ని గౌరవిస్తూనే, బాధపడుతున్న వ్యక్తికి వైద్య సహాయం అందించడం మానవత్వం. భక్తి పేరుతో రుగ్మతలను నిర్లక్ష్యం చేయకూడదు. □

## డ్రై ఫ్రూట్స్ మిఠాయి



ఆరోగ్యానికెంతో మంచిది. వాటితో మిఠాయి చేస్తే పిల్లలు మరింత ఇష్టం ఇదెంతో సులభం కూడా. ఈ స్వీటు కోసం.. వేయించిన శనగపప్పు (పుట్నాల పప్పు బాదం, జీడిపప్పు, మఖానా, కొబ్బరి తురుము అర కప్పు చొప్పున, యాలకుల పొడి చెంచా, జాజికాయ పొడి చిటికెడు, కుంకుమపువ్వు కొద్దిగా, బెల్లం 300 గ్రామా 3 చెంచాలు, బాదం, పిస్తా పలుకులు 2 చెంచాలు తీసుకోవాలి. ఎలా చేయాలి మఖానా వేసి గ్రైండ్ చేయాలి. ఆ పొడిని గిన్నెలోకి తీసి ఇప్పుడు బాదం, జీడిపాలి. దీన్ని కూడా గిన్నెలోకి తీసి.. కొబ్బరి తురుము, యాలకుల పొడి, జాజిక స్ంపు కుంకుమపువ్వు జతచేసి కలపాలి. బెల్లంలో కాస్త నెయ్యి, ముప్పావు కప్పు నీళ్లు ప్యాన్లో చెంచా నెయ్యి వేడిచేసి.. శనగబాదం పొడులను వేయించాలి. దొరగా వేగిన వాసన వస్తుండగా బెల్లం సిరప్ జోడించి కలియతిప్పుతుండాలి. పాకంలో పిండి కలపడం అయ్యాక సెగ తీయాలి. ఈ మిశ్రమాన్ని నెయ్యి రాసిన. పళ్లెంలో సమంగా అని పిస్తా పలుకులు చల్లి.. నచ్చిన ఆకృతిలో ముక్కలు కోసుకుంటే సరిపోతుంది. పిల్ల తింటే మంచి పోషకాహారం. □

## వంట సులువుగా

వంట చేయడం పెద్ద ప్రహసనం ఏమీ కాదు. కూరగాయలు తరగటమే కాస్త కష్టమైన వ్యవహారం.




ఆ పనిని తేలిక చేస్తుంది నాన్ ఎలక్ట్రికల్ డబుల్ బ్లేడ్ వెజిటబుల్ చాపర్. కోలగా టిఫిన్ డబ్బాలా కనిపించే ఈ సాధనంలో రెండు బ్లేడులు ఉండటాన కాయగూరల్ని వేగంగా తరిగేస్తుంది. అప్పుడిక వంట సులేవగా మరి. □

## రంగవల్లి



**- లక్ష్మీప్రసన్న**
బి.ఎన్. రెడ్డి నగర్



17 చుక్కలు, 5 వరుసలు,
ఇటు అటు వదిలి 5 వరకు

### ముగ్గులకు ఆహ్వానం

**మా చిరునామా:** ఎడిటర్, 'చెలి' వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80. Gmail: cheli@vaartha.com

**కృత్రిమ మేధతో రూపొందించిన ముగ్గులు పంపవద్దు**

# తెర

## 'దండోరా' 'అద్భుతమైన చిత్రం

**- నటుడు శివాజీ**



విలక్షణ నటుడు శివాజీ ప్రధాన పాత్రను పోషించిన చిత్రం 'దండోర్రా. 'కలర్ ఫొట్రో, 'బెదురులంక 2012 వంటి మంచి చిత్రాలను నిర్మించి అందరి దృష్టిని ఆకర్షించిన లౌక్య ఎంటర్టైన్మెంట్స్ అధినేత రవీంద్ర బెనర్జీ ముప్పానేని 'దండోర్రా మూవీని రూపొందించారు. ఈ చిత్రంలో శివాజీతో పాటుగా నవదీప్, నందు, రవికృష్ణ, మనికా చిక్కాల, మోనికా రెడ్డి, బిందు మాధవి, రాధ్య, అదితి భావరాజు తదితరులు ముఖ్య పాత్రల్ని పోషించారు. ఈ చిత్రానికి మురళీకాంత్ దర్శకత్వం వహించారు. ఈ మూవీని డిసెంబర్ 25న భారీ ఎత్తున విడుదల చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రమోషన్స్లో భాగంగా నటుడు శివాజీ మీడియాతో ముచ్చటించారు. చిత్రం గురించి ఆయన చెప్పిన సంగతులివే..

**'కోర్ట్' కంటే ముందే 'దండోరా' కథ విన్నారా?**

ముందుగా 'దండోరా' కథను విన్నాను. ఇందులో నా పాత్ర చాలా కొత్తగా ఉంటుంది. ముందే 'దండోర్రా మేకర్లు అడ్వాన్స్ ఇచ్చారు. కానీ ప్రొడక్షన్ పరంగా ఆలస్యమైంది. అలా 'కోర్ట్ ముందుగా రిలీజ్ అయింది.

**'దండోర్రాలో మీ పాత్ర ఎలా ఉండబోతోంది?**

'దండోర్రా చిత్రంలో నా పాత్ర డిఫరెంట్గా ఉంటుంది. మంచోడా? చెడ్డోడా? అని చూసే ప్రేక్షకుడికి సరిగ్గా అర్థం కాదు. సినిమా చూసిన తరువాత ఆడియెన్స్ నా పాత్ర గురించి చెప్పాల్సి ఉంటుంది.

**వేదం, కంచెరపాలెం చిత్రంలోనూ వేశ్య పాత్రల్ని చూపించారు. ఇందులో ఎలా చూపించబోతోన్నారు?**

'దండోర్రా చిత్రంలో బిందు మాధవి గారి పాత్రను చాలా క్లాసీగా చూపించారు. ప్రతీ ఒక్కరూ సినిమాతో, పాత్రలతో కనెక్ట్ అవుతారు.

**'మిస్సమ్మలాంటి చిత్రాల్ని ఎంజాయ్ చేశారా? 'కోర్ట్', 'దండోరా' లాంటి చిత్రాల్ని ఎంజాయ్ చేస్తారా?**


'మిస్సమ్మ, 'శైలజా కృష్ణమూర్తి, 'అదిరిందయ్య చంద్రం' ఇలా అన్ని రకాల చిత్రాల్ని ఎంజాయ్ చేశాను. అయితే నటుడిగా నా మీద నాకు నమ్మకం ఉండేది. కామెడీ, నెగెటివ్ షేడ్స్ ఇలా అన్ని రకాల పాత్రల్ని పోషించగలను.

**'దండోరా' తరువాత మీ నుంచి రాబోతోన్న చిత్రాల గురించి చెప్పండి?**

'దండోరా' తరువాత నా నుంచి 'సాంప్ర దాయిని సుప్పిని సుద్దపూసన్ని అనే చిత్రం రాబో తోంది. ఆదిత్య హాసన్ దర్శకత్వంలో రానున్న 'ఎపిక్' అద్భుతంగా ఉండబోతోంది.

## 'అఖండ 2 తాండవం' అఖండ విజయం ఆనందాన్ని ఇచ్చింది:

**- బోయపాటి శ్రీను**



సినిమా గొప్ప గౌరవాన్ని తీసుకొచ్చింది: బ్లాక్ బస్టర్ మేకర్ బోయపాటి శ్రీనుగాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, బ్లాక్ బస్టర్ మేకర్ బోయపాటి శ్రీను అఖండ భారత్ బ్లాక్ బస్టర్ అఖండ 2: ది తాండవం. ఈ ప్రతిష్టాత్మకమైన చిత్రాన్ని 14 రీల్స్ ప్లస్ బ్యానర్ పై రామ్ ఆచంట, గోపి ఆచంట నిర్మించారు. ఎం తేజస్విని నందమూరి సమర్పించారు. డిసెంబర్ 12న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ గా రిలీజైన ఈ చిత్రం బ్లాక్ బస్టర్ రెస్పాన్స్తో హౌస్ ఫుల్ కలెక్షన్స్ తో రన్ అవుతోంది. ఈ సందర్భంగా డైరెక్టర్ బోయపాటి శ్రీను విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**ఈ అఖండ విజయాన్ని ఎలా ఆస్వాదిస్తున్నారు?**

ఈ అఖండ విజయాన్ని ఎంత ఫీలైనా తక్కువే. ఇంకా కావాలని కోరుకుంటున్నాను. ఈ సినిమా డబ్బు కోసం తీసింది కాదు. ఈ సినిమా ప్రజలకు చేరాలని తీశాం. మన తత్వం ఏమిటి? ప్రపంచంలో ఎవరైనా మనల్ని చూసి చేతులెత్తి దండం పెడతారు ఎందుకు? మనం ఆచరించే ధర్మం కోసం. ఈ సినిమా చాలా పవర్ ఫుల్ గా కమర్షియల్ అంశాలతో తీయడం జరిగింది. ఆడియన్స్ కూర్చుంటే ఊపిరి బిగబెట్టుకొని చూస్తున్నారు. అలాంటి అనుభూతితో తీసిన సినిమా ఇది.

**మీరు థియేటర్స్ విజిట్ కి వెళ్ళినప్పుడు ఆ రెస్పాన్స్ మీకు ఎలాంటి అనుభూతిని ఇచ్చింది?**

ఆ ఆనందాన్ని మాటల్లో చెప్పలేను. ఒక మంచి సినిమా తీసి ఆశించాల్సిందే డబ్బు కాదు గౌరవం. అలాంటి గౌరవం వచ్చింది. అఖండ2 త్రీడీలో ఇంకా అద్భుతంగా ఉంటుంది. మీరు ఈ సినిమాని త్రీడీలో పిల్లలకు చూపిస్తే మరోసారి వెళ్దామని అంటారు. అంత గ్రాండ్ ఇయర్గా వచ్చింది.

**నెక్స్ట్ చేయబోయే ప్రాజెక్టు గురించి?**

మరో 10 రోజుల్లోనే నా నెక్స్ట్ సినిమాకు సంబంధించిన వివరాలు చెప్తాను.

## 'గుర్రం పాపిరెడ్డి' సినిమా నవ్విస్తుంది

**- హీరో నరేష్ అగస్త్య**



నరేష్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా జంటగా నటిస్తున్న సినిమా "గుర్రం పాపిరెడ్డి". ఈ చిత్రాన్ని డా. సంధ్య గోలీ సమర్పణలో ప్రొడ్యూసర్స్ వేణు సద్ది, అమర్ బురా, జయకాంత్ (బాబీ) నిర్మిస్తున్నారు. డార్క్ కామెడీ కథతో ఇప్పటి వరకు మనం తెరపై చూడని కాన్సెప్ట్తో దర్శకుడు మురళీ మనోహర్ రూపొందిస్తున్నారు. "గుర్రం పాపిరెడ్డి" సినిమా ఈ నెల 19న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ రోజు జరిగిన ఇంటర్వ్యూలో సినిమా హైలైట్స్ తెలిపారు హీరో నరేష్ అగస్త్య. తెలివైన వాడు తెలివితక్కువ పనిచేస్తే, తెలివి లేని వాళ్ళు తెలివైన పనిచేస్తే వాళ్ల జీవితాల్లో వచ్చిన పరిణామాలు ఏంటి అనేది ఈ మూవీ స్టోరీ లైన్. డార్క్ కామెడీ మూవీస్ అనే జానర్ లో మనకు గతంలో మూవీస్ వచ్చాయి గానీ అవి డార్క్ కామెడీ అని ట్యాగ్ పెట్టలేదు. ఎవరైనా కొన్ని ఇబ్బందుల్లో ఉంటే వాడికి బాధ కానీ మనకు నవ్వొస్తుంది. నాకు ట్రావెలింగ్ ఇష్టం. అలాగే నేను ఫ్రీ డైవింగ్ చేస్తుంటా. అంటే ఒక్కసారి ఊపిరి పీల్చి సముద్రంలో ఎంత లోతు వెళ్లగలమో అంత లోతు వెళ్లాలి. నేను సముద్రంలో 3 నిమిషాల 40 సెకండ్స్ 80 ఫీట్స్ డెప్త్ వెళ్లాను. నా దృష్టిలో కమర్షియల్ సినిమా అంటే ఆ మూవీలో పాటలు ఫైట్స్ లేకున్నా ప్రేక్షకుల్ని ఎంగేజ్ చేయగలిగేది. సెన్సబుల్ ఎలిమెంట్స్ ఉంటూ ప్రేక్షకులకు నచ్చేలా ఉన్న సినిమా. నేను ఇప్పటిదాకా చేసిన సినిమాల్లో పక్కా కమర్షియల్ మూవీ లేదు. అలాంటి మూవీ ఉంటే ఆడియెన్స్ కు మరింతగా రీచ్ అయ్యే అవకాశాలు ఉండేవి.

## డిసెంబర్ 19న రాబోతోన్న 'జిన్'



సాదలమ్మ ఫిల్మ్ ప్రొడక్షన్స్, బిల్వ స్టూడియోస్ బ్యానర్ల మీద నిఖిల్ ఎం. గౌడ నిర్మించిన చిత్రం 'జిన్'. ఈ మూవీకి చిన్మయ్ రామ్ దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో అమ్మిత్ రావ్, పర్వేజ్ సింబా, ప్రకాష్ తుమినాద్, రవి భట్, సంగీత వంటి వారు ముఖ్య పాత్రల్ని పోషించారు. ఈ చిత్రం డిసెంబర్ 19న గ్రాండ్గా రిలీజ్ కాబోతోంది. ఈ క్రమంలో సోమవారం నాడు ట్రైలర్ లాంఛ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజ్ కందుకూరి, వీరభద్రం చౌదరి, సోహెల్ వంటి వారు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. భూతనాల చెరువు నేపథ్యం ఏంటి? కాలేజ్లో దాగి వున్న మిస్టరీ ఏంటి? అనే ఆసక్తికర ప్రశ్నలు రేకెత్తించేలా ట్రైలర్ను కట్ చేశారు. నలుగురు యువకులు ప్రేతాత్మలకు చిక్కడం, ఆ కాలేజీ భవనం నుంచి బయటకు రాలేకపోవడం, మధ్యలో జిన్ రాక వంటి అంశాలతో ఆద్యంతం ఆసక్తికరంగా ట్రైలర్ను చూపించారు. ఈ ట్రైలర్తోనే అందరినీ భయపెట్టించేశారు మేకర్స్. ఇందులోని విజువల్స్, ఆర్ఆర్ అందరినీ కట్టిపడేసేలా ఉన్నాయి. ట్రైలర్ లాంఛ్ అనంతరం ఈ కార్యక్రమంలో..

రాజ్ కందుకూరి మాట్లాడుతూ.. .. 'జిన్' టైటిల్ చాలా బాగుంది. గుడ్ జిన్, బ్యాడ్ జిన్ అని జిన్లో రెండు రకాలుంటాయి. వీరభద్రం చౌదరి మాట్లాడుతూ.. .. 'జిన్' ట్రైలర్ చాలా నచ్చింది. హారర్ చిత్రాలన్నీ ఇప్పుడు సక్సెస్ అవుతున్నాయి. సోహెల్ మాట్లాడుతూ.. ..'తెలుగు ఆడియెన్స్ అన్ని భాషల చిత్రాల్ని, అన్ని భాషల టెక్నీషియన్లను ఆదరిస్తుంటారు.

## 30న క్రైమ్ థ్రిల్లర్ 'జమాన'



సూర్య శ్రీనివాస్, సంజీవ్ కుమార్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'జమాన్న. భాస్కర్ జక్కుల దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. తేజస్వి అడప, బొద్దుల లక్ష్మణ్, శివకాంత్, శశికాంత్ నిర్మాతలు. ఈ చిత్ర ట్రైలర్ లాంచ్ కార్యక్రమం ఘనంగా జరిగింది. చిత్ర యూనిట్ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దర్శకుడు భాస్కర్ జక్కుల మాట్లాడుతూ.. .జమాన సినిమా డిఫరెంట్ గా ఉంటుంది, మంచి థ్రిల్లర్ సబ్జెక్ట్ తో ఈ సినిమాను తీయడం జరిగింది. సినిమా ఆద్యంతం వినోదంతో పాటు ఊహించని ట్విస్ట్లు ఉంటాయి.

## 'పోలీస్ కంప్లైంట్' టీజర్ లాంచ్..

..సౌతిండియా హాట్ ఫేవరెట్ హీరోయిన్ వరలక్ష్మి శరత్కుమార్ పవర్ఫుల్ రోల్.. హీరోయిజంను ఫర్ఫెక్ట్ గా ప్లే చేసే హీరో నవీన్ చంద్ర పవర్ ఫుల్ రోల్ లో.. 52 మంది సీనియర్ ఆర్టిస్టులు.. హారర్ థ్రిల్లర్.. అవుట్ అండ్ అవుట్ ఎంటర్టైనర్గా.. టాలీవుడ్ టాలెంటెడ్ అండ్ ఫ్యాషనేట్ ఫిలిమ్ డైరెక్టర్ సంజీవ్ మేగోటి తెరకెక్కిస్తున్న మూవీ 'పోలీస్ కంప్లైంట్'.. ఎమ్మెస్కె ప్రమిదశ్రీ ఫిలిమ్స్ బ్యానర్పై సంజీవ్ మేగోటి రచన-దర్శకత్వంలో బాలకృష్ణ మహారాణా నిర్మించిన యాక్షన్ థ్రిల్లర్ 'పోలీస్ కంప్లైంట్ మూవీ తెలుగు, కన్నడ టీజర్ రిలీజ్ కార్యక్రమం హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్లో ఘనంగా జరిగింది. ఈ చిత్రంలో వరలక్ష్మి శరత్కుమార్ పవర్ఫుల్ యాటిట్యూడ్తో పాటు తొలిసారిగా ఫుల్ ఎంటర్టైనింగ్ క్యారెక్టర్లో అద్భుతంగా




నటించారని నిర్మాత తెలిపారు. ఆమెకు జంటగా నవీన్ చంద్ర మరో బలమైన పాత్రలో నటించారు. డైరెక్టర్ సంజీవ్ మేగోటి మాట్లాడుతూ... ప్రేమ, పగ, తప్పు-ఒప్పు, మంచి-చెడు మధ్య హైడ్ అండ్ సీక్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమాను హారర్ థ్రిల్లర్ మాత్రమే కాకుండా అవుట్ అండ్ అవుట్ ఎంటర్టైనర్గా రూపొందించాం. కన్నడ స్టార్ హీరోయిన్ రాగిణి ద్వివేది ప్రత్యేక పాత్రలో ప్రేక్షకులకు థ్రిల్ కలిగిస్తారు. ప్రధాన పాత్రల్లో నటించిన వరలక్ష్మి శరత్ కుమార్ మాట్లాడుతూ.. డైరెక్టర్ గారు చెప్పిన సబ్జెక్టు నచ్చి సినిమా చేశాను. ఈ సినిమాలో యాక్షన్ తో పాటు ఫుల్లుగా కామెడీ చేశాను. సినిమా బాగా వచ్చింది

## టి-20 ర్యాంకింగ్‌లో..

# వరుణ్‌కు అత్యుత్తమ రేటింగ్

**న్యూఢిల్లీ:** టీమిండియా మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఐసీసీ బుధవారం విడుదల చేసిన పురుషుల అంతర్జాతీయ టీ20 ర్యాంకింగ్‌లో అత్యుత్తమ రేటింగ్ సాధించిన భారత్ బౌలర్‌గా నిలిచాడు. ఈ క్రమంలో పేస్ దళ నాయకుడు జస్‌ప్రీత్ బుమ్రా పేరిట ఉన్న రికార్డును వరుణ్ బద్దలు కొట్టాడు. కెరీర్‌లోనే అత్యుత్తమంగా ఏకంగా 818 రేటింగ్ పాయింట్లు సాధించి రెండో ర్యాంకర్ బేకబ్ డఫీ (699 పాయింట్లు)కు అందనంత దూరంలో నిలిచాడు. టీ20 బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో టీమిండియా ఓపెనర్ అభిషేక్ శర్మ టాప్ ర్యాంక్ నిలబెట్టుకోగా, తిలక్ వర్మ రెండు స్థానాలు ఎగబాకి నాలుగో ర్యాంక్‌లో నిలిచాడు. పురుషుల అంతర్జాతీయ టీ20లలో బెస్ట్ బౌలర్ రేటింగ్స్‌లో ఉమర్ గుల్ (పాకిస్తాన్) 865 పాయింట్లు, శామ్యూల్ బద్రీ (వెస్టిండీస్) 864 పాయింట్లు, డేనియల్ వెటోరి (న్యూజిలాండ్) 858 పాయింట్లు, సునీల్ నరైన్ (వెస్టిండీస్) 832 పాయింట్లు, రషీద్ ఖాన్ (అఫ్గనిస్తాన్) 828 పాయింట్లు, తబ్రేజ్ షంసీ (దక్షిణాఫ్రికా) 827 పాయింట్లు, షాహిద్ అఫ్రిది (పాకిస్తాన్) 822 పాయింట్లు, వరుణ్ చక్రవర్తి (ఇండియా) 818 పాయింట్లు, షాదాబ్ ఖాన్ (పాకిస్తాన్) 811 పాయింట్లు, వనిందు హసరంగా (శ్రీలంక) 809 పాయింట్లతో ఉన్నారు.





## గ్లోబల్ చెస్ లీగ్‌లో వరల్డ్ ఛాంపియన్

# గుకేష్ ఓటమి

**న్యూఢిల్లీ:** 2025 గ్లోబల్ చెస్ లీగ్‌లో ఐదుసార్లు ప్రపంచ ఛాంపియన్ విశ్వనాథన్ ఆనంద్ ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ గుకేష్ దొమ్మరాజుపై విజయం సాధించాడు. గ్లోబల్ చెస్ లీగ్ ఘర్షణలో తన అభిమాన ఆటగాడు, గురువు విశ్వనాథన్ ఆనంద్ చేతిలో గుకేష్ ఓటమిని చవిచూశాడు. గ్యాంజెస్ గ్రాండ్‌మాస్టర్స్ తరపున తెల్లటి పావులతో ఆడుతూ, ఆనంద్ తన టీనేజర్ సిసిలియన్ డిఫెన్స్‌ను అధిగమించి పోటీలో తన రెండు గేమ్‌ల పరాజయాల పరంపరను ముగించాడు. 34వ ఎత్తుగడ వరకు ఆనంద్ గుకేష్ పై బోర్డులో స్వల్ప ఆధిక్యాన్ని కొనసాగించాడు. టోర్నమెంట్ నియమాలు ఆటగాళ్లకు 40వ ఎత్తుగడ తర్వాత ప్రతి కదలికకు రెండు సెకన్ల ఇంక్రిమెంట్లు మాత్రమే లభిస్తాయని నిర్దేశిస్తాయి. కానీ గుకేష్ వంటి గణన ఆధారిత ఆటగాడికి అటువంటి అవకాశం రాలేదు. ఆనంద్ విజయం అతని జట్టు పిబిజి అలాస్కాన్ నైట్స్‌పై 12-3 తేడాతో విజయం సాధించడానికి సహాయపడింది. గంగాస్ గ్రాండ్‌మాస్టర్ విజయంతో మూడు టైలలో వారి రెండవ విజయం నమోదైంది. వారు ఇప్పుడు పాయింట్ల పట్టికలో 6 పాయింట్లతో త్రివేణి కాంటినెంటల్ కింగ్స్ తర్వాత రెండవ స్థానంలో ఉన్నారు. మరోవైపు, పిబిజి అలాస్కాన్ నైట్స్ పాయింట్ల పట్టికలో అట్టడుగున ఉండగా, ఇప్పటి వరకూ ఇంకా ఖాతా తెరవని ఏకైక జట్టుగా నిలిచింది.






## షూటింగ్ నేషనల్స్‌లో

# తోమర్‌కు స్వర్ణం

### గుర్జోత్‌కు స్కీట్ టైటిల్

**న్యూఢిల్లీ:** ప్రపంచ ఛాంపియన్‌షిప్ రజత పతక విజేత ఐశ్వర్య ప్రతాప్ సింగ్ తోమర్ 68వ జాతీయ షూటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల పురుషుల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్ ఫైనల్‌లో 470.5 ప్రపంచ రికార్డు స్కోరు చేశాడు. ఇది ప్రస్తుత ప్రపంచ రికార్డు కంటే 1.6 ఎక్కువ. డాక్టర్ కర్ణి సింగ్ షూటింగ్ రేంజ్‌లో ఏకకాలంలో జరిగిన షాట్‌గన్ యాక్షన్‌లో, గుర్జోత్ సింగ్ పురుషుల స్కీట్‌లో 55 హిట్‌లతో స్వర్ణం సాధించాడు. తొమ్మిది సార్లు జాతీయ ఛాంపియన్ అయిన మైరాజ్ అహ్మద్ ఖాన్‌ను 54 హిట్‌లతో తృటిలో ఓడించాడు. సీనియర్ విభాగంలో హర్మెహర్ సింగ్ లల్లీ 43 హిట్స్ తో కాంస్య పతకాన్ని గెలుచుకోగా, జూనియర్ ఫైనల్లో స్వర్ణంతో ఆ తర్వాత నిలిచాడు. అంగద్ (+4), జ్యోతిరాదిత్య (+3+2) ఇద్దరూ 119 లక్ష్యాలను ఛేధించి షూటౌట్ తర్వాత ఫైనల్ కు చేరుకున్నారు. హర్మెహర్ అద్భుతమైన ప్రదర్శనతో స్వర్ణ పతకాన్ని గెలుచుకున్నాడు. క్వాలిఫికేషన్ రౌండ్‌లో 120 స్కోరుతో అగ్రస్థానంలో నిలిచి ఫైనల్‌లో 54 హిట్‌లను నమోదు చేశాడు. జోరావర్ సింగ్ బేడి 51 హిట్‌లతో రజతంతో సరిపెట్టుకోగా, జ్యోతిరాదిత్య సింగ్ సిసోడియా 40 హిట్‌లతో కాంస్య పతకాన్ని సాధించాడు. జూనియర్ పురుషుల 50 మీటర్ల 3 పి ఫైనల్లో రోహిత్ కన్యన్ 457.4 పాయింట్లతో స్వర్ణం గెలుచుకోగా, అడ్రియన్ కర్మాకర్ 455.5 పాయింట్లతో రజతం, వేదాంత్ నితిన్ వాగ్మారే 443.0 పాయింట్లతో కాంస్యం గెలుచుకున్నాడు.

## ఐపిఎల్ 2026 మినీ వేలంలో

# టిజి, ఎపికి అన్యాయం

### 18 మందిలో అమ్ముడైంది ఒక్కడే!

### పట్టించుకోని సన్‌రైజర్స్ హైదరాబాద్, ఢిల్లీ

**న్యూఢిల్లీ:** ఐపిఎల్ 2026 మినీ వేలంలోనూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్లేయర్లకు నిరాశే ఎదురైంది. అబుదాబి వేదికగా జరిగిన మినీ వేలంలో ఈ రెండు రాష్ట్రాల నుండి 18 మంది ఆటగాళ్లు బరిలో నిలవగా, ఒకే ఒక్కడికి అవకాశం దక్కింది. హైదరాబాద్‌కు చెందిన అమన్ రావును రాజస్థాన్ రాయల్స్ రూ.30 లక్షల కనీస ధరకు కొనుగోలు చేసింది. ఈ వేలంలో 8 మంది అనామక ఆటగాళ్లను కొనుగోలు చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్, ఈ రెండు రాష్ట్రాల ప్లేయర్లను మాత్రం అస్సలు పట్టించుకోలేదు. ఒక్కరిని కూడా తీసుకునే ప్రయత్నం చేయలేదు. రెండు రాష్ట్రాలకు సంబంధించి యాజమాన్యం కలిగిన ఢిల్లీ క్యాపిటల్స్ కూడా ఈ ఆటగాళ్ల వైపు కన్నెత్తి చూడలేదు. దాంతో తెలంగాణ, ఆంధ్ర ప్లేయర్లకు మరోసారి అన్యాయమే జరిగింది. గతంలో అమ్ముడైన ఆటగాళ్లకు కూడా ఈసారి మొండి చెయ్యే ఎదురైంది. హైదరాబాద్ తరపున దేశవాళీ క్రికెట్‌లో రాణిస్తున్న రాహుల్ బుద్ధి, తనయ్ త్యాగరాజన్, ఆరోన్ జార్జి వర్గీస్, రక్షణ్ రెడ్డి, మనీశ్ రెడ్డి, నిశాంత్ శరణు, అర్బాజ్ మహమ్మద్, నితిన్ సాయి యాదవ్, చామ మిలింద్‌లను హైదరాబాద్, ఢిల్లీతో సహా మిగిలిన ఏ ఫ్రాంచైజీలు పట్టించుకోలేదు. రూ.30 లక్షల కనీస ధరతో తీసుకునేందుకు కూడా ఆసక్తి చూపించలేదు. ఆంధ్ర వెటరన్ వికెట్ కీపర్ కేఎస్ భరత్‌కు ఈ సారి కూడా నిరాశే ఎదురైంది. రూ.75 లక్షల కనీస ధరతో ఉన్న ఈ తెలుగు వికెట్ కీపర్‌ను ఫ్రాంచైజీలు విస్మరించాయి. అతనితో పాటు రికీ భుయ్, సత్యనారయణ రాజు, యర్ర పృథ్వీ రాజ్, బైలాపుడి యశ్వంత్, ధీరజ్ కుమార్, మారం రెడ్డి హేమంత్ రెడ్డి, సాధిఖ్ హుస్సేన్‌లకు నిరాశే ఎదురైంది. ఈ రెండు రాష్ట్రాల ప్లేయర్లకు అవకాశం ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ముఖ్యంగా సన్‌రైజర్స్ హైదరాబాద్ యాజమాన్యంపై మండిపడుతున్నారు. రెండు రాష్ట్రాలకు చెందిన ఫ్రాంచైజీలో ఈ ప్లేయర్లకు అవకాశం ఇవ్వరా అని మండిపడుతున్నారు. సన్‌రైజర్స్ కొనుగోలు చేసిన ఈ రెండు రాష్ట్రాలకు సంబంధం లేని ఆటగాళ్లను చూస్తే సలీల్ అరోరా(రూ.1.50 కోట్లు), శివాంగ్ కుమార్(రూ.30 లక్షలు), క్రెయిన్స్ ఫులెట్రా(రూ.30 లక్షలు), సాకిబ్ హుస్సేన్(రూ.30 లక్షలు), ఓంకార్ తర్మలె(రూ.30 లక్షలు), ప్రఫుల్ హింగే(రూ.30 లక్షలు), అమిత్ కుమార్(రూ.30 లక్షలు), లియామ్ లివింగ్ స్టోన్(రూ.13 కోట్లు), శివమ్ మావి(రూ.75 లక్షలు), జాక్ ఎడ్వర్డ్స్(రూ.3 కోట్లు) ఉన్నారు.



# ఆస్ట్రేలియా భారీ స్కోర్

### ఇంగ్లండ్ మ్యాచ్‌లో 326 రన్స్

**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్‌లో ఆతిథ్య ఆస్ట్రేలియా పూర్తి ఆధిపత్యం చెలాయిస్తుంది. ఇప్పటికే రెండు టెస్ట్ మ్యాచ్‌ల్లో గెలిచి 2-0తో ఆధిక్యంలో నిలిచిన ఆసీస్, అడిలైడ్ వేదికగా మూడో టెస్ట్‌లో శుభారంభం అందుకుంది. అలెక్స్ క్యారీ (106) సెంచరీతో చెలరేగడంతో తొలి రోజు బుధవారం ఆట ముగిసే సమయానికి ఆసీస్ 83 ఓవర్లలో 8 వికెట్లకు 326 పరుగులు చేసింది. ఉస్మాన్ ఖవాజా (82) హాఫ్ సెంచరీతో రాణించాడు. క్రీజులో మిచెల్ స్టార్క్ (33 బ్యాటింగ్)తో పాటు, నాథన్ లయన్ (0 బ్యాటింగ్) ఉన్నాడు. ఇంగ్లండ్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్ (3/29) వికెట్లు, బ్రైడన్ కార్స్, విల్ జాక్స్ రెండేసి వికెట్లు, జోష్ టంగ్‌కు ఓ వికెట్ దక్కింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఆసిస్‌కు ఆశించిన శుభారంభం దక్కలేదు. జోఫ్రా ఆర్చర్ బౌలింగ్‌లో జేక్ వెధరాల్డ్ (18) ఔటవ్వగా, ఆ మరుసటి ఓవర్‌లోనే డేంజరస్ ట్రావిస్ హెడ్(10)ను బ్రైడన్ కార్స్ పెవిలియన్ చేర్చాడు. ఈ పరిస్థితుల్లో మార్నస్ లబుషేన్, ఉస్మాన్ ఖావాజా ఆచితూచి ఆడి వికెట్ పడకుండా తొలి సెషన్‌ను ఆసీస్ 94/2 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్ తొలి ఓవర్‌లోనే మార్నస్ లబుషేన్(19)ను ఆర్చర్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. అదే ఓవర్ మూడో బంతికి కామెరూన్ గ్రీన్(0) డకౌట్ చేశాడు. అలెక్స్ క్యారీతో కలిసి ఉస్మాన్ ఖవాజా 81 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. కానీ అతన్ని విల్ జాక్స్ పెవిలియన్ చేర్చాడు. క్రీజులోకి వచ్చిన అలెక్స్ క్యారీ, జోష్ ఇంగ్లీస్ మరో వికెట్ పడకుండా రెండో సెషన్‌ను 194/5 స్కోర్‌కు తీసుకెళ్లారు. ఆఖరి సెషన్‌లో హాఫ్ సెంచరీ దిశగా సాగిన జోష్ ఇంగ్లీస్‌ను టంగ్ క్లీన్ బౌల్డ్ చేశాడు. కెప్టెన్ ప్యాట్ కమిన్స్(13) తీవ్రంగా నిరాశపర్చాడు. మిచెల్ స్టార్క్ సాయంతో అలెక్స్ క్యారీ 135 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఈ ఇద్దరి మరో వికెట్ పడకుండా తొలి రోజు ఆటను ముగించారు.

## డీమార్ట్ దమానీని వెనక్కి నెట్టేసిన

# దీపీందర్ గోయల్

### జొమాటో నంబర్‌వన్.. డీమార్ట్ నంబర్‌టూ..

### బిలియనీర్స్ జాబితాలో హురూన్ నంబర్‌వన్



**న్యూఢిల్లీ, డిసెంబరు 17**: హురూన్ ఇండియా టాప్ 200 స్వయకృషితో ఎదిగిన పారిశ్రామిక వేత్తల జాబితాలో జోమాటో మాతృసంస్థ ఎటర్నల్ సిఇఒ దీపీందర్ గోయల్ అగ్రస్థానంలో నిలిచాడు. అవెన్యూ సూపర్‌మార్ట్స్ రాధాకిషన్ ధమానిని నెట్టివేసి అగ్రస్థానంలోకి ఎదిగారు. ఐడిఎఫ్‌సి ఫస్ట్ ప్రైవేట్ అండ్ హురూన్ ఇండియా టాప్ 200 స్వశక్తితో ఎదిగిన పారిశ్రామికవేత్తల జాబితాను విడుదలచేసారు. ఈ జాబితాలో యువపారిశ్రామికవేత్తలు అధికంగా ఉన్నారు. 2000వ సంవత్సరం తర్వాత ఏర్పాటయిన బిజినెస్‌లను చూస్తే కొత్తవారే అధికంగా ఉన్నారు. వారిలో దీపిందర్ తమ సంస్థ విలువలు రూ.3.2 లక్షలకోట్లతో టాప్ స్థాయిలో ఉన్నారు. వినియోగరంగంలో ఇంటర్నెట్ ఆధారిత సంస్థల్లో అగ్రభాగంలో నిలిచింది. లాభదాయకత, బ్రాండ్ పటిష్టత, మార్కెట్‌లలోకి చొరబాటు వంటి వాటిలో దమానికంటే ముందువరుసలో నిలిచారు. ఇక టాప్ టెన్ సంస్థల్లో ఇండిగో వ్యవస్థాపకులు రాహుల్ భాటియా, రాకేష్ గంగ్వాల్‌లు మూడోస్థానంలోనిలిచారు. స్విగ్గీ సహ వనయవస్థాపకులు శ్రీహర్ష మాజేటి, నందన్ రెడ్డి ఐదోస్థానంలోకి రాగా వీరి కంపెనీ విలువలు ఐదుశాతం పెరిగి రూ.1.06 లక్షలకోట్లకు చేరింది. పేటిఎం వ్యవస్థాపకకుడు విజయ్‌శేఖర్‌శర్మ భారీ లాభాలు ఆర్జించారు. 67శాతం లాభపడ్డారు. ఆయన సంస్థ విలువలు రూ.72,900 కోట్లుగా నిలిచాయి. లెన్స్‌కార్ట్‌కూడా ఈజాబితాలో చేరింది. 60శాతం లాభాలతో రూ.67వేల కోట్లకు చేరింది. ఈ సంస్థ వ్యవస్థాపకులు పదవ స్థానంలో నిలిచారు. ఈసంస్థల టర్నోవర్, మార్కెట్ విలువలు, మార్కెట్లలో వీటి ధోరణులు వంటి వాటిని పరిగణనలోనికి తీసుకుని జాబితాను విడుదలచేసారు. హురూన్ జాబితా కంపెనీల మొత్తం విలువలు 42 లక్షలకోట్లుగా ఉంది. ముందు ఏడాది రూ.36 లక్షలకోట్లుగా ఉంటే ఏడాదిలో 15శాతం వృద్ధి నమోదుచేసింది. బిలియన్ డాలర్ల కంపెనీగా ఏర్పాటుచేసి స్వశక్తితో ఎదిగిన పారిశ్రామికవేత్తలసంఖ్య 128కి పెరిగింది. 52 కంపెనీలు బెంగళూరు కేంద్రంగానే ఉన్నాయని హురూన్ వెల్లడించింది.

# ఐసిఐసిఐ 'ప్రు' ఐపిఒకు భారీ స్పందన

### 197కోట్ల షేర్లకు బిడ్లు దాఖలు




**ముంబయి, డిసెంబరు 17:** ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ (ఎఎంసి) ఐపిఒకు ఇన్వెస్టర్ల నుంచి భారీ స్పందన లభించింది. ఈ పబ్లిక్ ఇష్యూ మొత్తం 39.17 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. ముఖ్యంగా సంస్థాగత ఇన్వెస్టర్లు ఈ ఐపిఒపై అధిక ఆసక్తి కనబరచడంతో బిడ్లు వెల్లువెత్తాయి. మొత్తం రూ.10,602.65 కోట్ల విలువైన 3.50 కోట్ల షేర్లను విక్రయానికి ఉంచగా, ఏకంగా 197 కోట్ల షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. వీటి మొత్తం విలువ సుమారు రూ.3 లక్షల కోట్లుగా ఉంది. క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ కేటగిరీలో 123.87 రెట్లు, నాన్‌ఇన్‌స్టిట్యూషనల్ కోటాలో 22.04 రెట్లు సబ్‌స్క్రిప్షన్ నమోదైంది. అయితే, రిటైల్ ఇన్వెస్టర్ల నుంచి స్పందన పరిమితంగా ఉండి, కేవలం 2.53 రెట్లు మాత్రమే సబ్‌స్క్రైబ్ అయింది. అంతకుముందు, యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి కంపెనీ రూ.3,022 కోట్లను సమీకరించింది. ఈ ఐపిఒ ద్వారా ఒక్కో షేరు ధరల శ్రేణిని రూ.2061-2165గా నిర్ణయించారు. ఈ ఇష్యూ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిలో జరిగింది. ప్రమోటర్ సంస్థ అయిన యూకేకు చెందిన ప్రుడెన్షియల్ కార్పొరేషన్ తన వాటా నుంచి 4.89 కోట్ల షేర్లను విక్రయించింది. దీంతో ఐపిఒ ద్వారా వచ్చిన నిధులు కంపెనీకి చేరవు. ప్రస్తుతం ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ ఎఎంసిలో ఐసిఐసిఐ బ్యాంకుకు 51 శాతం, ప్రుడెన్షియల్‌కు 49 శాతం వాటా ఉంది. భారత ఐపిఒ చరిత్రలో అత్యధిక సబ్‌స్క్రిప్షన్ పొందిన నాలుగో కంపెనీగా ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఎఎంసి నిలిచింది. గతంలో రిలయన్స్ పవర్ (2007), ఎల్జీ ఎలక్ట్రానిక్స్ (2025), బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ (2024) ఈ జాబితాలో మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి.

## జనవరి ఒకటినుంచే

# భారత్ ట్యాక్సీ సేవలు

### దేశరాజధాని ఢిల్లీలో ప్రారంభం




**న్యూఢిల్లీ, డిసెంబరు 17:** ఉబర్, ఓలా, ర్యాపిడో వంటి ప్రైవేటు సంస్థలకు దీటుగా కేంద్ర సహకార శాఖ ఆధ్వర్యంలో దేశంలో తొలిసారిగా సహకార (కోఆపరేటివ్) క్యాబ్ సేవలు ప్రారంభం కాబోతున్నాయి. 'భారత్ ట్యాక్సీ' పేరుతో వస్తున్న ఈ సేవలు వచ్చే నెల నుంచి ప్రారంభం కాబోతున్నాయి. తొలుత దేశ రాజధాని ఢిల్లీలో జనవరి 1వ తేదీ నుంచి ఈ సేవలను అందుబాటులోకి తెస్తున్నట్లు కేంద్రం తాజాగా ప్రకటించింది. ఆ తర్వాత ఈయాప్ సేవలను దేశ వ్యాప్తంగా అందుబాటులోకి తేనున్నారు. ఇందులో ఆటో, క్యాబ్, బైక్ సర్వీసులు అందుబాటులో ఉండనున్నాయి. ఈ సేవలకు సంబంధించి అన్ని ఏర్పాట్లూ పూర్తయినట్లు వెల్లడించింది. ఈ భారత్ ట్యాక్సీ యాప్ ఆండ్రాయిడ్, ఐఓఎస్ రెండింటిలోనూ అందుబాటులో ఉంటుంది. యూజర్లు తమ మొబైల్ నంబర్‌తో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఇదివరకు ఉన్న క్యాబ్ ఛార్జీల నుంచి ప్రయాణికులకు ఉపశమనం కలిగించేలా ఎలాంటి సర్వీస్ ఛార్జీలు లేకుండానే ఈ సేవలను పొందే అవకాశముంది. సుమారు 56 వేల మంది డ్రైవర్లు భారత్ ట్యాక్సీ యాప్‌లో రిజిస్టర్ చేసుకున్నట్లు కేంద్రం తెలిపింది. ఈ సేవల్లో రైడ్ ద్వారా వచ్చే ఆదాయం మొత్తాన్ని నూరుశాతం డ్రైవర్లకే చెల్లిస్తారు. అతి తక్కువ నామినల్ రుసుముతో డ్రైవర్లు ఈ ప్లాట్‌ఫాంలో పనిచేయవచ్చు.

## జిఎస్టీ హేతుబద్ధీకరణతో

# రూ.47 వేల కోట్ల భారం




**న్యూఢిల్లీ, డిసెంబరు 17:** జిఎస్టీ హేతుబద్దీకరణ ద్వారా కేంద్రఖజానాకు పరోక్షపన్నుల రాబడుల్లో రూ.47 వేల కోట్ల రూపాయలు భారం పడిందని ఆర్థికశాఖ లోక్‌సభకు వెల్లడించింది. భారీ స్థాయిలో నిర్వహించిన జిఎస్టీ శ్లాబ్‌ల క్రమబద్ధీకరణ స్థూల రాబడుల్లో ప్రభావం చూపించిందని మొత్తం 93,300 కోట్ల విలువైన పన్ను రాబడులు కుదింపునకు గురయినట్లు ఆర్థికశాఖ వివరించింది. కొన్ని ప్రత్యేక ఉత్పత్తులను 28శాతం శ్లాబ్‌నుంచి 40శాతం పన్ను శ్లాబ్‌కు పెంచడంవల్ల అదనపు రాబడి సుమారు 45,570 కోట్లు వస్తుందని అంచనావేసినట్లు తెలిపారు. వినియోగం ఆధారంగా మొత్తం విలు వల చైన్ 2023-24కు సంబంధించి వస్తువులు 28శాతంనుంచి 40శాతానికి పెంచిన వాటిలో అదనపు రాబడులు 46వేల కోట్లవరకూ రావచ్చని అంచనావేసామన్నారు. వీటికి అదనంగా మొత్తం పన్నుల హేతుబద్ధీకరణవల్ల జిఎస్టీకి 47,700 కోట్ల భారం పెరిగిందని మంత్రిత్వశాఖ అంచనావేస్తూ నివేదికలను పార్లమెంటుకు అందచేసింది. జిఎస్టీ హేతుబద్ధీకరణతో కొన్ని వివాదాలనుకూడా పరిష్కరించాల్సి ఉందని, అయితే తక్కువశాతం శ్లాబ్‌తోనే ఈనష్టం భర్తీ అవుతుందని ఆర్థికశాఖ సహాయ మంత్రి పార్లమెంటుకు వివరిం చారు. జిఎస్టీ రాబడి నష్టాల భర్తీకి అనుసరించే వ్యూహంపై ప్రత్యేకమంత్రుల బృందం అంటూ ఏదీ జిఎస్టీ మండలి నియమించలేదని కూడా స్పష్టంచేసింది. 56వ జిఎస్టీ మండలి సమావేశంలోనే కేరళ ఆర్థిక మంత్రి రెవెన్యూ నష్టం అత్యధికంగా ఉంటుందని తెలిపారు. ఆటోమొబైల్స్, బీమా, సిమెంట్, ఎలక్ట్రానిక్స్ రంగాలనుంచే ఎక్కువనష్టం వస్తుందని కూడా కేరళ జిఎస్టీ మండ లిలో వెల్లడించింది. ఈ రంగాలనుంచే సుమారు 2500 కోట్లవరకూ పన్నుల రాబడినష్టం ఉంటుందనికూడా తెలిపింది.

## స్టార్టప్‌ల టర్నోవర్

# రూ.42 లక్షలకోట్లు

**న్యూఢిల్లీ, డిసెంబరు 17:** భారతదేశంలోని టాప్ 200 స్టార్టప్ కేటగిరీకి చెందిన అన్ని కంపెనీల విలువ 2025లో రూ. 42 లక్షల కోట్లుగా ఉంది. ఇది గత ఏడాది రూ. 36 లక్షల కోట్లుగా నమోదైంది. ఏడాది ప్రాతిపదికన 15 శాతం వృద్ధిని ఇది ప్రతిబిం బిస్తూ, భారతదేశ స్వయంనిర్మిత పారిశ్రామిక వేత్తల వేగవంతమైన సంపద సృష్టిని నొక్కి చెబుతోందని ఒక నివేదిక పేర్కొంది. 2025లో 128 కంపెనీలు బిలియన్ డాలర్ల వ్యాల్యుయేషన్‌ను కలిగి ఉన్నాయి. గత ఏడాది ఈ సంఖ్య 121గా ఉంది. ఐడీఎఫ్‌సీ ఫస్ట్ ప్రైవేట్, హురున్ ఇండియా జాబితా ప్రకారం 22 కొత్త కంపెనీలు ఈ జాబితాలో చేరాయి. రూ. లక్ష కోట్లు లేదా అంతకంటే ఎక్కువ విలువ కలిగిన కంపెనీలు ఐదు ఉన్నాయి. అత్యధిక స్టార్టప్‌లు కలిగిన నగరంగా బెంగళూరు నిలిచింది. గత సంవత్సరంతో పోలిస్తే 14 కంపెనీలు తగ్గినప్పటికీ 52 కంపెనీలతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఆ తర్వాత వరుసగా ముంబై (41), గురుగ్రామ్ (36) ఉన్నాయి. ముంబై, గురుగ్రామ్ లలో గత ఏడాదితో పోలిస్తే ఐదు స్టార్టప్‌లు పెరిగాయి. 88 మంది స్టార్టప్ వ్యవస్థాపకులతో బెంగళూరు అగ్రస్థానంలో ఉండగా, ఆ తర్వాత ముంబై (83), ఢిల్లీ (52) ఉన్నాయి. ఈ నగరాలు అత్యధిక సంఖ్యలో స్టార్టప్ వ్యవస్థాపకులను కలిగి ఉన్నాయి. దేశంలోని స్టార్టప్ కంపెనీలలో 47 ఫైనాన్షియల్ సర్వీసెస్, 28 సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్, 27 హెల్త్ కేర్, 20 రిటైల్ రంగాల్లో ఉన్నాయి.

# మూడోరోజూ సెన్సెక్స్, నిఫ్టీలు డీలా

### మీడియా, రియాల్టీ రంగాల్లో అమ్మకాల ఒత్తిళ్లు




**ముంబయి, డిసెంబరు 17:** దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో సెషన్‌లోనూ నష్టాలతో ముగిశాయి. మీడియా, రియల్టీ, వినియోగరంగ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి మార్కెట్ సెంటిమెంట్‌ను ప్రభావితంచేసింది. బుధవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి బిఎస్ఇ సెన్సెక్స్ 120.21 పాయింట్లు నష్టపోయి 84,559.65 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ కూడా 41.55 పాయింట్లు క్షీణించి 25,818.55 వద్ద ముగిసింది. నిఫ్టీ 25,900-26,000 స్థాయిని దాటనంత వరకు అమ్మకాల ఒత్తిడి కొనసాగే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. సమీప కాలంలో 25,700-25,750 నిఫ్టీకి కీలక మద్దతు జోన్‌గా ఉందని, ఒకవేళ ఈ స్థాయి కంటే దిగువన ముగిస్తే పతనం మరింత కొనసాగవచ్చని అంచనా వేస్తున్నారు. మార్కెట్లు బలహీనంగా ఉన్నప్పటికీ కొన్ని ప్రధాన స్టాక్స్ లాభపడ్డాయి. ఎస్‌బిఐ, ఇన్ఫోసిస్, యాక్సిస్ బ్యాంక్, సన్ ఫార్మా, మారుతీ సుజుకీ, టిసిఎస్, టాటా స్టీల్ షేర్లు 1.5 శాతం వరకు లాభపడ్డాయి. మరోవైపు, ట్రెంట్, ఐసిఐసిఐ బ్యాంక్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్ వంటి స్టాక్స్ నష్టపోయి సూచీలపై ఒత్తిడి పెంచాయి. బ్రాడర్ మార్కెట్లలో బిఎస్ఇ మిడ్‌క్యాప్ 0.54 శాతం, స్మాల్‌క్యాప్ 0.73 శాతం చొప్పున నష్టపోయాయి. రంగాలవారీగా చూస్తే, నిఫ్టీ మీడియా ఇండెక్స్ అత్యధికంగా 1.7 శాతం పతనమైంది. ఐటీ, పిఎస్‌యూ బ్యాంక్ రంగాలు మాత్రం లాభాలతో ముగిశాయి. కమొడిటీ మార్కెట్‌లో వెండి ధరలు రికార్డు స్థాయికి చేరాయి. ఎంసీఎక్స్‌లో సిల్వర్ మార్చి ఫ్యూచర్స్ సుమారు రూ. 2,05,665 వద్ద ట్రేడ్ అయింది. మరోవైపు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) జోక్యంతో యూఎస్ డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ కోలుకుని 90.98 వద్ద ఊగిసలాడింది. బిఎస్ఇలో 1654 కంపెనీల షేర్లు పెరిగాయి. 2523 షేర్లు పతనం చెందితే 170 కంపెనీలు స్థిరంగా నిలిచాయి ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్స్ ఫిబ్రవరి ఐదునాటి సెటిలెమంట్‌లు 0.28శాతం క్షీణించి రూ.1,33,760కి చేరింది. బ్రెంట్ ముడిచమురు ఫిబ్రవరి ఫ్యూచర్స్‌కు 1.09 డాలర్లు తగ్గి బ్యారెల్‌కు 59.47 డాలర్లుగా నిలిచింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.